www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 7-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 99 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా.11:10 తదుపరి త్రయోదశి; నక్షత్రం: అనూరాధ రా.1:12 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: మ.12:46-1:38, మ.3:22-4:14; అమృతఘడియలు: మ.1:43-3:29; రాహుకాలం: ఉ.7:30-9:00; సూర్యోదయం: 5.50; సూర్యాస్తమయం: 6.50 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కుర్రాళ్ల ఘన విజయం
టీమిండియాదే రెండో టెస్టు
కెప్టెన్‌గా గిల్‌కు తొలి గెలుపు
చెలరేగిన ఆకాశ్‌దీప్, సిరాజ్
336 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చిత్తు 11





ఏఐతో నిండు 150 ఏళ్లు!
2030 కల్లా మనిషి సగటు జీవితకాలం రెట్టింపు.. శాస్త్రజ్ఞుల అంచనా
- 'కృత్రిమ మేధ' సాయంతో జన్యుమార్పిడి, వైద్య రంగాల్లో పరిశోధనలు వేగవంతం
- శరీరం లోపలికి వెళ్లి కణాల స్థాయిలో రిపేర్ చేసే నానోబోట్లు అందుబాటులోకి
- మనిషి మెదడులోని సమాచారాన్ని బ్యాకప్ తీసే సాంకేతిక పరిజ్ఞానం కూడా..
- 150 ఏళ్లు కాదుగానీ.. నిండు నూరేళ్లు జీవించే చాన్స్: మరికొందరు శాస్త్రజ్ఞులు

న్యూఢిల్లీ, జూలై 6: 'నిండు నూరేళ్లూ చల్లగా ఉండు'.. అని పెద్దలు దీవిస్తుంటారు! మనిషికి పూర్ణాయుర్దాయం అంటే వందేళ్లని మనందరి భావన. కానీ.. స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారతీయుల సగటు జీవిత కాలం కేవలం 32 సంవత్సరాలు! మెరుగైన జీవనానికి అవసరమైన సౌకర్యాలు, సరైన వైద్యసదుపాయాలు లేకపోవడం.. తరచూ ప్రబలే అంటువ్యాధులు.. ఇలా రకరకాల కారణాల వల్ల ఒక్క మనదేశంలోనే కాక ప్రపంచంలోని చాలా దేశాల్లో 70-80 ఏళ్ల క్రితం దాకా కూడా సగటు జీవిత



కాలం చాలా తక్కువగా ఉండేది. కానీ.. వైద్యరంగంలో విప్లవాత్మక పరిశోధనల వల్ల, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే సరికొత్త వైద్య ఉపకరణాలు, రకరకాల వ్యాధులను అరికట్టే టీకాలు అందుబాటులోకి రావడం వల్ల.. మనలో ఆరోగ్యం పట్ల పెరిగిన స్పృహ వల్ల.. సగటు జీవిత కాలం గణనీయంగా పెరిగింది. 70-80 ఏళ్ల క్రితంతో పోలిస్తే శిశుమరణాల రేటు బాగా తగ్గిపోయింది. భారతీయుల సగటు జీవితకాలం ఇప్పుడు 70 ఏళ్లు కాగా.. హాంకాంగ్,

మిగతా 2వ పేజీలో...

డిజిటల్ హైవేలు!
జాతీయ రహదారులు ఇక స్మార్ట్‌గా.. రోడ్లపై ఏఐతో కూడిన సీసీ కెమెరాల ఏర్పాటు

- రాష్ట్ర పోలీసు, రవాణా శాఖకు అనుసంధానం
- ప్రమాదాలు జరిగితే వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు లొకేషన్, కి.మీ. నంబర్‌తో సహా వివరాలు
- వీడియోతో సహా పంపనున్న నిఘా కెమెరాలు
- వెంటనే అక్కడికెళ్లి సాయం అందించనున్న సిబ్బంది
- నాగ్‌పూర్-హైదరాబాద్ హైవేపై మొదలైన పనులు
- తర్వాత ఖమ్మం-దేవరపల్లి, హైదరాబాద్-బెజవాడ, కర్నూల్-రాయచూర్ మార్గాల్లో అమలు
- నిర్మాణమే స్మార్ట్‌గా ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం



హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సరికొత్త చర్యలు తీసుకుంటోంది. రోడ్డుపై నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడిపే వారిని నియంత్రించేలా దేశంలోని పలు జాతీయ రహదారులను డిజిటల్, స్మార్ట్ హైవేలుగా మార్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలంగాణ పరిధిలో ఉన్న పలు కీలక రహదారులను కూడా డిజిటల్, స్మార్ట్ రోడ్లుగా మార్చనుంది. ఈ మేరకు ప్రతి రోడ్డుపైనా అత్యంత అధునాతనమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి.. వాటిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో అనుసంధానం చేయనున్నారు. ఏఐతో అనుసంధానమైన కెమెరా వ్యవస్థను రాష్ట్ర పోలీసు, రవాణా శాఖకు అనుసంధానం చేస్తారు. దీంతో రోడ్డుపై వాహనం ఎలా వెళ్తోంది, ఎంత స్పీడ్‌తో వెళ్తోందనే విషయంతోపాటు సవ్య దిశలోనే వెళ్తోందా, లేదా అనేదీ తెలిసిపోతుంది. తద్వారా.. నిబంధనలను ఉల్లంఘించి వాహనం నడిపిన వారికి జరిమానా పడడంతోపాటు వాహన ప్రయాణ వీడియో కూడా ఫోన్‌కు వచ్చేస్తుంది. ఇప్పటికే ఢిల్లీ-గురుగ్రామ్‌ను కలిపే ద్వారక ఎక్స్‌ప్రెస్‌వేపై ఏఐతో పనిచేసే సాంకేతిక విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇదే విధానాన్ని దేశంలోని ఇతర రహదారులతోపాటు తెలంగాణలోనూ అమలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రాష్ట్రంలోనూ డిజిటల్ హైవే పనులు అమల్లోకి వచ్చాయి. ప్రస్తుతం మొదటి దశలో భాగంగా హైదరాబాద్-నాగ్‌పూర్ మార్గం (ఎన్.హెచ్-44)లో స్మార్ట్ హైవే విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇది మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వరకు మొత్తం 591 కిలోమీటర్లు ఉంటుంది. తెలంగాణ

మిగతా 12వ పేజీలో...

బెంగళూరుకు హైస్పీడ్ కారిడార్
- నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు నిర్మించే రహదారే బెంగళూరు వరకు కొనసాగింపు
- రెండు సెక్షన్లుగా రోడ్డు నిర్మాణానికి నిర్ణయం
- రెండింటి డీపీఆర్‌లకూ టెండర్ల ఖరారు
- గంటకు 120 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించేలా రోడ్డు నిర్మాణం 12
- తొలుత 6 లేన్లు.. భవిష్యత్తులో 8-12 లేన్లు!



చిరుద్యోగులు, కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీలు పతనావస్థకు చేరాయి. మౌలిక సదుపాయాలు లేవు. కనీస వైద్య పరీక్షలకూ దిక్కులేకుండా పోయింది. సరిపడా వైద్యులూ లేరు. 270 పడకలున్న నాచారం ఆస్పత్రిలో మూత్ర పరీక్షలు కూడా చేయడం లేదంటే పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. ఫలితంగా ఈఎస్ఐ కార్డుదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

మూత్ర పరీక్షకూ దిక్కులేదు!
రాష్ట్రంలో పతనావస్థలో ఈఎస్ఐ వైద్యం

- వైద్యులు లేరు.. మందులూ లేవు..
- నిర్వహణ సరిగా లేక తగ్గుతున్న రోగులు
- వరుసగా మూతపడుతున్న డిస్పెన్సరీలు
- రూ.150 కోట్ల మేర ఔషధ బకాయిలు
- నిలిచిపోయిన మందుల సరఫరా
- బిల్లుల చెల్లింపును పట్టించుకోని ఈఎస్ఐ ఉన్నతాధికారులు
- ఈఎస్ఐ కార్డుదారులు, కుటుంబ సభ్యులు 72 లక్షల మందికి ఇబ్బందులు

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీలకు వెళ్లడానికి రోగులు తటపటాయిస్తున్నారు. భారీగా ఓపీ పడిపోతుండడంతో డిస్పెన్సరీలు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. కొన్నింటిని దగ్గరిలో ఉన్న వాటిలో కలిపేస్తున్నారు. రాష్ట్రంలోని ఈఎస్ఐ ఆస్పత్రులకు సంబంధించి ఏడాదిగా ఔషధ సరఫరాదారులకు బిల్లులు చెల్లించడం లేదు. సుమారు రూ.150 కోట్లు పెండింగ్‌లో పడ్డాయి. వారు మందుల సరఫరా నిలిపివేశారు. ఈ ఆస్పత్రులపై ఆధారపడిన సుమారు 18 లక్షల మంది ఈఎస్ఐ ఐపీ కార్డు హోల్డర్లు, వారి కుటుంబ సభ్యులు కలిపి మొత్తం 72 లక్షల మంది ఇబ్బందిపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 71 ఈఎస్ఐ డిస్పెన్సరీలు, 4 ఆస్పత్రులు, 2 డయాగ్నస్టిక్స్ కేంద్రాలు ఉన్నాయి. ఎక్కువ మంది రోగులొచ్చే డిస్పెన్సరీల్లో ఐదుగురు చొప్పున, మిగతా వాటిలో ఇద్దరు చొప్పున వైద్యులు ఉన్నారు. డిస్పెన్సరీల్లో చాలా వరకు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. రెండు, మూడేళ్లుగా వాటికి అద్దెలు

మిగతా 12వ పేజీలో...

మాజీ సీజేఐ చంద్రచూడ్ ఇల్లు
ఖాళీ చేయించండి
కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు లేఖ 2
పదవీ విరమణ చేసిన 8 నెలల తర్వాత కూడా అధికారిక నివాసాన్ని వీడని వైనం
గ్రేస్ పీరియడ్ ఆర్నెల్లు దాటినా అక్కడే..
త్వరలోనే ఖాళీ చేస్తా: జస్టిస్ చంద్రచూడ్

నేటి నుంచి
వనమహోత్సవం
వ్యవసాయ వర్సిటీలో సీఎం శ్రీకారం
నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
రెండు రోజుల పాటు హస్తినలోనే.. 13
కేంద్రమంత్రులను కలిసే అవకాశం



'అమెరికా పార్టీ'
కొత్త రాజకీయ పార్టీని ప్రకటించిన మస్క్
ఇప్పుడున్న పార్టీలు చెత్త నిర్ణయాలతో దేశాన్ని దివాలా తీయిస్తున్నాయి 2
మూడింట రెండొంతుల మంది అమెరికన్లు రాజకీయ మార్పు కోరుకుంటున్నారు
ప్రజలకు స్వేచ్ఛను తిరిగి అందిస్తా: మస్క్



నిండుకుండలా శ్రీశైలం
1.86 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. రేపు తెరుచుకోనున్న ప్రాజెక్టు గేట్లు
బంగాళాఖాతంలో అల్పపీడనం.. నేడు భారీ, రేపు అతిభారీ వర్షాలు

పోలవరం/ కర్నూలు/ దరూరు/దోమలపెంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి వరద పోటెత్తుతుండటంతో జూరాల ప్రాజెక్టు నిండు కుండలా కనిపిస్తుండగా.. శ్రీశైలం రిజర్వాయర్ కళకళలాడుతోంది. ఎగువన నారాయణపూర్ నుంచి జూరాలకు 99,933 క్యూసెక్కుల వరద విడుదలవుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 317.440 మీటర్లు కాగా, 7.535 టీఎంసీలు ఉన్నాయి. జూరాలకు ఆదివారం 1.13 లక్షల క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో నమోదు కాగా, డ్యామ్ 12 గేట్లను ఒక మీటరు మేర

మిగతా 3వ పేజీలో...

శ్రీశైలానికి ఐదేళ్లలో కొత్త గేట్లు పెట్టాలి!
లేదంటే 'తుంగభద్ర' పరిస్థితే 3
ప్రాజెక్టుల నిపుణుడు కన్నయ్య నాయుడు

నాసిక్‌లో వరద ఉధృతి
నీట మునిగిన పలు ఆలయాలు 2

రైతులు ఆనందంగా ఉంటే బీఆర్ఎస్ నేతలకు
కళ్లుమంట!
- అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోకుండా ఇప్పుడు మాటలా?
- రైతుబంధు సొమ్మును ఎప్పుడైనా రెండు నెలల్లోపు వేశారా?
- 'బంధు' పేరుతో ఎగ్గొట్టిన పథకాలు ఎన్ని?
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం



హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రైతుల్లో ఆనందం, సంతోషం వెల్లివిరుస్తుంటే బీఆర్ఎస్ నేతలు ఓర్వలేక పోతున్నారని, వారి కళ్లు మండుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తోంటే బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు రైతు సమస్యలపై చర్చించాలని అంటుంటే.. మొగుణ్ణి కొట్టి మొగసాలకు ఎక్కినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలపై మంత్రి తుమ్మల ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదిన్నరలో లక్షా మూడు వేల కోట్ల రూపాయలను

మిగతా 13వ పేజీలో...

ఇందిరమ్మ ఇళ్లు.. దేశానికే ఆదర్శం
ఏడాదిలోనే పథకానికి రూ.22 వేల కోట్ల ఖర్చు
వచ్చే మూడేళ్లలో మరెన్నో పథకాలు అందిస్తాం
పుట్టగతులుండవనే ప్రతిపక్షాల ఆందోళన
కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయి: భట్టి విక్రమార్క
రాష్ట్రంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం
'డబుల్' పేరుతో బీఆర్ఎస్ మోసం: పొంగులేటి
సంయమనం పాటించండి.. 13
మంత్రి కొండా సురేఖకు సీఎం రేవంత్ సూచన

'పేలుడు పదార్థాల' కేసులో టీపీసీసీ నేత
చంద్రశేఖర్‌రెడ్డికి రిమాండ్
జిలెటిన్ స్టిక్స్ నిల్వ ఉంచడంపై కేసు నమోదు
పరారీలో ఉన్న అతని సోదరుడి కోసం గాలింపు
నా భర్త చంద్రశేఖర్ అరెస్టు అక్రమం: ఇందుప్రియ 12

వర్ధమాన దేశాలకు ప్రాతినిధ్యమేదీ?
బడుగుదేశాల సమస్యలపై చర్చే లేదు 2
ప్రస్తుత పరిస్థితులకు సరిపోని ఐక్యరాజ్య సమితి
సమూల ప్రక్షాళన జరగాలి.. బ్రిక్స్ సదస్సులో మోదీ



గోల్డెన్ వీసా @ 23 లక్షలు
భారతీయులకు యూఏఈ బంపర్ ఆఫర్
నామినేషన్ ఆధారంగా వీసా జారీ 2
ప్రాపర్టీ/వ్యాపారంలో భారీ పెట్టుబడి అక్కర్లేదిక..

తమిళ 'నాగరికత'పై రాజకీయం!
14
కీళడి నాగరికతపై ఎడతెగని వివాదం
ఆ నాగరికత 2,800 ఏళ్లకన్నా ముందటిదని పరిశోధనల్లో తేలిందంటున్న ఆ రాష్ట్ర ప్రభుత్వం
అందులో తప్పులున్నాయంటూ నిలిపేసిన కేంద్రం



టెక్సస్‌లో వరదల బీభత్సం

» 51 మంది మృతి.. మృతుల్లో 15 మంది చిన్నారులు

వాషింగ్టన్/ముంబై, జూలై 6: అమెరికాలోని టెక్సస్ రాష్ట్రం వరదలతో అతలాకుతలమవుతోంది. ఈ ప్రకృతి విలయం 51 మందిని పొట్టనబెట్టుకోగా.. 27 మంది బాలికలు గల్లంతయ్యారు. ఒక్క కేర్ కౌంటీలోనే 43 మంది చనిపోయారని, వారిలో 15 మంది చిన్నారులున్నారని అధికారులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున గ్వాడలూప్ నది ఉప్పొంగడంతో వరద ఉధృతి మొదలైనట్లు పేర్కొన్నారు. "కేవలం కొన్ని గంటల్లోనే కుంభవృష్టి కురిసింది. 45 నిమిషాల వ్యవధిలోనే నదిలో వరద సుమారు 8 మీటర్ల మేర పెరిగింది. దాంతో.. నది సమీపంలోని రోడ్లపై పార్క్ చేసిన వాహనాలు కొట్టుకుపోయాయి" అని వివరించారు. వరదల సమయంలో కేర్ కౌంటీలో సమ్మర్ క్యాంప్ జరుగుతుండడంతో.. విద్యార్థులు ఎక్కువగా వచ్చారని, అక్కడే 27 మంది బాలికలు గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని పేర్కొన్నారు.

నాసిక్‌లో గోదావరి ఉధృతి..మునిగిన ఆలయాలు

నాసిక్, జూలై 6: మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా భారీ వర్షాలతో వణుకుతోంది. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో.. రామకుండ్ ప్రాంతంలోని దేవాలయాలు నీట మునిగిపోయాయి. శనివారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షాలు కురియడంతో.. గోదావరి ఉప్పొంగి.. గోరారామ్-కాలారామ్ ఆలయం, ముక్తిధామ్, దుతొండియా ఆంజనేయుడి మందిరం(వరద హెచ్చరికగా భావించే ఆలయం)లో వరద కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం నాసిక్ జిల్లా వ్యాప్తంగా రెడ్ అలెర్ట్ జారీ అయ్యింది. వరదల కారణంగా గంగాపూర్ డ్యామ్‌లో నీటిమట్టం భారీగా పెరిగింది. నాసిక్ నగరంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

మేం హిందీ వ్యతిరేకులం కాదు: సంజయ్ రౌత్

ముంబై, జూలై 6: ప్రాథమిక పాఠశాలల్లో హిందీని తప్పనిసరి చేయడాన్ని మాత్రమే తాము వ్యతిరేకించామని, అలాగని తాము హిందీకి వ్యతిరేకులం కాదని ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ స్పష్టం చేశారు. హిందీ విషయంలో తమిళనాడు సీఎం స్టాలిన్ వైఖరికి తాము దూరమన్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు హిందీని తృతీయ భాషగా అమలు చేయాలనే నిర్ణయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవడంతో ఉద్ధవ్, రాజ్ ఠాక్రే సోదరులు శనివారం విజయోత్సవం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హిందీ అమలుపై కేంద్రంతో సుదీర్ఘ పోరాటం చేస్తున్న స్టాలిన్ .. ఠాక్రే సోదరుల పోరాటాన్ని స్వాగతించారు. దీంతో హిందీని వ్యతిరేకించే తమ వైఖరి స్టాలిన్ వైఖరికి భిన్నమని సంజయ్ రౌత్ వివరణ ఇచ్చారు. 'వారి వైఖరిలో హిందీని వ్యతిరేకించడం అంటే.. వారు హిందీ మాట్లాడరు. ఎవరినీ హిందీ మాట్లాడనివ్వరు. కానీ, మేం హిందీ మాట్లాడతాం. హిందీ మాట్లాడొద్దని మేం ఎవరినీ అడ్డుకోలేదు. మా పోరాటం ప్రాథమిక విద్యలో బలవంతంగా హిందీ అమలును వ్యతిరేకించడం వరకే పరిమితం' అని సంజయ్‌రౌత్ తేల్చిచెప్పారు.

సహనానికి మారుపేరు దలైలామా: మోదీ

ధర్మశాల, జూలై 6: టిబెటన్ ఆధ్యాత్మిక గురువు 14వ దలైలామా 90వ జన్మదిన వేడుకలు ఆదివారం ధర్మశాలలో వైభవంగా జరిగాయి. ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "140 కోట్ల భారతీయులతో పాటు నేను కూడా దలైలామాకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నా. దలైలామా ప్రేమ, కరుణ, సహనం, నైతిక క్రమశిక్షణకు మారుపేరు. ఆయన దీర్ఘాయువు కలిగి ఉండాలని ప్రార్థిస్తున్నా" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. జన్మదిన వేడుకల్లో దలైలామా మాట్లాడుతూ.. 'బోధిసత్వను జీవన మార్గంగా ఎంచుకున్న నా పట్ల ప్రజలు చూపిన ప్రేమాభిమానాలు.. మతాలకతీతంగా అందరికీ సేవ చేసేందుకు నాకు ప్రేరణనిస్తాయి. నా శక్తి మేరకు అందరికీ సేవ చేస్తాను' అని పేర్కొన్నారు. కేంద్రమంత్రి రిజిజు మాట్లాడుతూ మత పరమైన అంశాల్లో భారత్ జోక్యం చేసుకోబోదన్నారు.

రద్దు చేసిన రైలు టికెట్లపై రీఫండ్ పెంపు!

న్యూఢిల్లీ, జూలై 6: రైలు టికెట్లను రద్దు చేసినప్పుడు తిరిగి ఇచ్చే రీఫండ్ మొత్తాన్ని పెంచేందుకు భారతీయ రైల్వే యోచిస్తోంది. టికెట్లపై విధిస్తున్న 'క్లర్కేజీ' చార్జీ తగ్గింపు లేదా పూర్తిగా తొలగించే అంశాన్ని పరిశీలిస్తోంది. వెయిటింగ్ లిస్టు, ఆర్‌ఏసీ టికెట్లను రద్దు చేసుకున్నప్పుడు ప్రస్తుతం ఈ చార్జీలు మినహాయించుకొని ప్రయాణికులకు డబ్బులు వాపసు ఇస్తున్నారు. ఇటీవలి కాలంలో కౌంటర్‌లో కంటే ఆన్‌లైన్‌లోనే టికెట్ల కొనుగోలుకు ఎక్కువ మంది ప్రయాణికులు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో రైల్వేకు నిర్వహణ ఖర్చులు తగ్గాయి. దీంతో రీఫండ్ మొత్తం పెంపు దిశగా అధికారులు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నారు.

డ్యూటీకి వెళ్లకుండానే 12 ఏళ్లలో 28లక్షల జీతం

భోపాల్, జూలై 6: ఒకటి కాదు రెండు కాదు 12 ఏళ్లుగా డ్యూటీకి వెళ్లకుండా మధ్యప్రదేశ్‌లో ఓ కానిస్టేబుల్ నెలనెలా జీతం తీసుకుంటున్నాడు. మధ్యప్రదేశ్ విదిశా జిల్లాకు చెందిన ఓ వ్యక్తి 2011లో భోపాల్‌లోని పోలీస్ లైన్స్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరాడు. అనంతరం కొన్ని రోజులకు శిక్షణ కోసం సాగర్‌కు పంపించాలని అధికారులు నిర్ణయించారు. ఇంచార్జిగా ఉన్న అధికారి సర్వీసు రికార్డు అతడికే ఇచ్చి పంపించారు. అయితే ఆ కానిస్టేబుల్ సాగర్‌కు వెళ్లకుండా వ్యక్తిగత కారణాలతో ఇంటికి వెళ్లిపోయాడు. ఆ తర్వాత సర్వీసు రికార్డును పోలీస్ లైన్స్‌లో ఉన్న అధికారులకు స్పీడ్ పోస్టులో పంపించాడు. వాటిని తీసుకున్న అధికారులు.. సరిగ్గా ధ్రువీకరించుకోకుండానే ఆమోదించారు. దీంతో ఇటు పోలీస్ లైన్స్‌లో, అటు సాగర్‌లోని శిక్షణా కేంద్రంలో లేకుండా పోయాడు. అయినప్పటికీ ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నాడనే విషయాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదు. కానీ రికార్డుల్లో పేరు ఉండటంతో విధులకు రాకున్నా 12 ఏళ్లుగా అతడి ఖాతాలో జీతం పడుతూనే ఉంది. ఇలా మొత్తంగా 12 ఏళ్లలో రూ. 28లక్షలు అతడి ఖాతాలో జమ అయింది. 2011 బ్యాచ్ వారికి పే గ్రేడ్ మదింపుపై డీజీపీ ఇటీవల ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో ఈ కానిస్టేబుల్ వ్యవహారం వెలుగు చూసింది.

ఎలాన్ మస్క్ 'అమెరికా పార్టీ'

అన్నట్టుగానే కొత్త రాజకీయ పార్టీ స్థాపిస్తున్నట్టు ప్రకటించిన ప్రపంచ కుబేరుడు

» ఇప్పుడున్న పార్టీలు చెత్త నిర్ణయాలతో అమెరికాను దివాలా తీయిస్తున్నాయి

» ప్రజలకు స్వేచ్ఛను తిరిగి అందిస్తా..: మస్క్



వాషింగ్టన్, జూలై 6: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అన్నంత పనీ చేశారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి విజయం సాధించేందుకు తోడ్పడి, అదే ట్రంప్‌తో విభేదాలతో బయటికొచ్చిన మస్క్.. కొద్దిరోజులుగా చెబుతున్నట్టుగా 'అమెరికా పార్టీ' పేరిట కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్'లో వరుసగా పోస్టులు పెట్టారు. అమెరికాలో ఇప్పుడున్న రెండు పెద్ద పార్టీలు డెమొక్రటిక్, రిపబ్లికన్ పార్టీలతో ఎలాంటి ప్రయోజనం లేదని.. ప్రజలు నిజమైన రాజకీయ మార్పును కోరుకుంటున్నారని మస్క్ పేర్కొన్నారు. ఇటీవల తాను నిర్వహించిన పోల్‌లో మూడింట రెండొంతుల మంది కొత్త పార్టీ అవసరమని తేల్చారని చెప్పారు. "మీ స్వేచ్ఛను తిరిగి మీకు అందజేసేందుకు ఈ రోజు అమెరికా పార్టీ ఏర్పాటైంది. చెత్త, పనికిరాని నిర్ణయాలతో మనదేశాన్ని దివాలా తీయించే పరిస్థితి నెలకొంది. మనం ఈ ఏక పార్టీ వ్యవస్థను తుత్తునీయులు చేయబోతున్నాం" అని మస్క్ పేర్కొన్నారు. అమెరికాలో నిజానికి రెండు పెద్ద రాజకీయ పార్టీలు ఉన్నా.. అవి ఒకే తీరులో పనిచేస్తున్నాయన్న ఉద్దేశంతో ఏక పార్టీ వ్యవస్థగా ఆయన అభివర్ణించారు.

ట్రంప్‌ను గెలిపించి.. విభేదించి..

వాస్తవానికి గత అధ్యక్ష ఎన్నికలకు ముందు ట్రంప్‌కు మస్క్ గట్టి మద్దతుదారుగా నిలిచారు. ట్రంప్ గెలవడం కోసం ప్రచారం చేయడమేకాదు.. వందల కోట్ల డాలర్లు ఖర్చుపెట్టారు. ట్రంప్ అధ్యక్షుడిగా గెలిచాక ప్రభుత్వ వ్యయాలను తగ్గించడం కోసం ఏర్పాటు చేసిన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్)'కు ఎలాన్ మస్క్ చీఫ్‌గా కూడా వ్యవహరించారు. కానీ ట్రంప్ ప్రభుత్వం తలపెట్టిన 'బిగ్ బ్యూటీఫుల్ యాక్ట్'ను మస్క్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ డోజ్ నుంచి బయటికి వచ్చారు. ఈ క్రమంలో ట్రంప్, మస్క్ మధ్య తీవ్ర విమర్శల యుద్ధం నడిచింది. ఒకదశలో మస్క్‌ను దేశం నుంచి గెంటివేయడానికి సిద్ధమన్నట్టుగా కూడా ట్రంప్ మాట్లాడారు. ఈ క్రమంలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతానని మస్క్ చెబుతూ వచ్చారు. తాజాగా 'అమెరికా పార్టీ'ని స్థాపిస్తున్నట్టు ప్రకటించారు. అయితే పార్టీకి సంబంధించి ఎలాంటి వివరాలనూ మస్క్ వెల్లడించలేదు. కొత్త పార్టీ పెట్టాలంటే అమెరికా ఫెడరల్ ఎన్నికల కమిషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇటీవలికాలంలో ఎన్నికల కమిషన్‌కు వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కడా అమెరికా పార్టీ పేరిట దరఖాస్తు లేదని సీఎన్ఎన్ వార్తా సంస్థ పేర్కొంది.

ట్రంప్‌కు దెబ్బపడుతుందా?

ఎలాన్ మస్క్ కొత్త రాజకీయ పార్టీతో రిపబ్లికన్ పార్టీకి, ట్రంప్‌కు దెబ్బతగులుతుందా? అన్న అంశం చర్చనీయాంశంగా మారింది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టెక్నాలజీని ఎక్కువగా వినియోగించే యువతతోపాటు పలు వర్గాల ఓటర్లలో మస్క్‌కు మద్దతు ఉంది. దానికి తోడు ట్రంప్ వ్యతిరేకులు, తటస్థ ఓటర్లు మస్క్ పార్టీ వైపు చూస్తే.. రిపబ్లికన్ పార్టీపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఇదే సమయంలో డెమొక్రటిక్ పార్టీకి సెనేట్, ప్రతినిధుల సభల్లో ప్రాతినిధ్యం తగ్గితే.. బలమైన ప్రతిపక్షం లేకుండా పోతుందని, ఇది ట్రంప్‌కు కలిసి వస్తుందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

కొత్త పార్టీ.. అంత సులువేం కాదు!

అమెరికా రాజకీయ విధానం చాలా వరకు రెండు పార్టీల వ్యవస్థకే అనుకూలంగా ఉంటుంది. ఇంతకుముందు గ్రీన్ పార్టీ, లిబర్టేరియన్ పార్టీ వంటివి వచ్చినా పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. మస్క్‌కు ఎంత ప్రతిష్ఠ, సంపద ఉన్నా కొత్త పార్టీ అంత సులువుకాదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఇక అమెరికాలో పుట్టినవారికి మాత్రమే అధ్యక్ష పదవికి పోటీపడే అవకాశం ఉంటుంది. మస్క్ దక్షిణాఫ్రికాలో జన్మించారు కాబట్టి తన పార్టీ ప్రజల్లో మద్దతు పొందినా కూడా మస్క్ అధ్యక్షుడు అయ్యే అవకాశమే లేదు. నిజానికి మస్క్ వ్యూహాలు కూడా భిన్నంగా ఉన్నాయి. గతంలో పలుమార్లు ఆయన చెప్పిన అంశాల మేరకు.. అమెరికా చట్టసభలైన సెనేట్, ప్రతినిధుల సభల్లో కొన్ని సీట్లను మస్క్ పార్టీ గెలుచుకుంటే చాలు. ఏవైనా బిల్లులను వ్యతిరేకించేందుకు, ఆమోదించేందుకు ఆ బలం సరిపోతుందని ఆయన ఆలోచన.

లోకం తీరు



జమిలి ఎన్నికలు రాజ్యాంగబద్ధమే!

» కానీ ఈసీకి అపరిమిత అధికారాలు

» సముచితం కాదన్న మాజీ సీజేఐలు

న్యూఢిల్లీ, జూలై 6: లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు జరిపేందుకు ఉద్దేశించిన 'ఒక దేశం-ఒకే ఎన్నిక' విధానం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు (సీజేఐలు) పేర్కొన్నారు. అయితే ఈ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘాని(ఈసీ)కి అపరిమిత అధికారాలు కట్టబెట్టడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. విచక్షణాధికారాల వినియోగానికి కమిషన్‌కు తగు మార్గదర్శకాలు అవసరమన్నారు. మాజీ సీజేఐలు జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ జేఎస్ కేహర్.. జమిలి ఎన్నికల బిల్లుపై మాజీ మంత్రి పీపీ చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి తమ తమ అభిప్రాయాలను తెలియజేశారు. జస్టిస్ లలిత్ ఫిబ్రవరిలో, జస్టిస్ కేహర్ మార్చిలో కమిటీని కలిసి బిల్లులోని వివిధ అంశాలపై చర్చించి తమ అభిప్రాయాలను తెలియజేశారు. జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ గొగోయ్ ఈ నెల 11న సదరు కమిటీతో సమావేశం కానున్నారు. ఏకకాలంలో లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికల నిర్వహణ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించడమేనని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను జస్టిస్ చంద్రచూడ్ తోసిపుచ్చారు. వేర్వేరుగా ఎన్నికలు జరపాలని రాజ్యాంగం ఎక్కడా చెప్పలేదని జేపీసీకి లిఖితపూర్వకంగా తెలియజేశారు. అయితే ప్రతిపాదిత రాజ్యాంగ సవరణలో ఈసీకి అత్యధిక అధికారాలు ఇవ్వడాన్ని ఆయన, జస్టిస్ గొగోయ్ ప్రశ్నించారు. చట్టప్రకారం అసెంబ్లీల కాలపరిమితి ఐదేళ్లు. లోక్‌సభతో పాటే ఎన్నికల పేరుతో.. ఈ గడువును కుదించేలా, పెంచేలా హద్దుల్లేని అధికారాన్ని ఈసీకి కట్టబెట్టడం సముచితం కాదన్నారు.

23.30 లక్షలు చెల్లిస్తే గోల్డెన్ వీసా

» భారతీయులకు యూఏఈ బంపర్ ఆఫర్



దుబాయి, జూలై 6: భారతీయులకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం బంపర్ ఆఫర్ ఇస్తోంది. కొత్త రకం గోల్డెన్ వీసాను అందిస్తోంది. స్థిరాస్తి లేదా వ్యాపారంలో భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేకుండా ఈ వీసాను పొందే అవకాశం కల్పిస్తోంది. నామినేషన్ ప్రాతిపదికన ఈ వీసాను ఇస్తోంది. ఇప్పటి వరకు దుబాయ్ గోల్డెన్ వీసాను భారతీయులు పొందడానికిగాను కనీసం రెండు మిలియన్ ఏఈడీల (రూ.4.66 కోట్లు) విలువైన ప్రాపర్టీలో పెట్టుబడి పెట్టాలి లేదా దేశంలోని వ్యాపారంలో భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టడం ఒక మార్గంగా ఉంది. అయితే ఇప్పుడు కొత్తగా నామినేషన్ ఆధారిత వీసా విధానం కింద భారతీయులు లక్ష ఏఈడీలు (దాదాపు రూ.23.30 లక్షలు) రుసుముగా చెల్లిస్తే జీవిత కాలానికి యూఏఈ గోల్డెన్ వీసా పొందవచ్చు. ఈ వీసాను పరీక్షించే నిమిత్తం మొదటి విడతలో భారత్, బంగ్లాదేశ్‌ను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. భారత్‌లో ఈ వీసా దరఖాస్తులను పరిశీలించేందుకు కన్సల్టెన్సీ సంస్థ రయాద్ గ్రూప్ ఎంపికైంది. ఈ గోల్డెన్ వీసా కోసం ఎవరైనా దరఖాస్తు చేయగానే మొదట తాము వారి నేపథ్యాన్ని పరిశీలిస్తామని, మనీలాండరింగ్ క్రిమినల్ రికార్డులతోపాటు వారి సోషల్ మీడియాను తనిఖీ చేస్తామని రయాద్ గ్రూప్ ఎండీ రయాద్ కమల్ అయుబ్ పేర్కొన్నారు. ఆ తర్వాత రయాద్ గ్రూప్ ఆ దరఖాస్తును ప్రభుత్వానికి పంపుతుందని, అనంతరం నామినేషన్ ఆధారిత గోల్డెన్ వీసాపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. నామినేషన్ కేటగిరీలో యూఏఈ గోల్డెన్ వీసా పొందాలనుకునే వారు దుబాయ్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. గోల్డెన్ వీసాను పొందిన వారు తమ కుటుంబ సభ్యులను దుబాయికి తీసుకువెళ్లవచ్చు. ప్రాపర్టీ ఆధారితంగా తీసుకునే గోల్డెన్ వీసా సదరు ప్రాపర్టీని విక్రయిస్తే దాని కాలం ముగిసిపోతుంది. కానీ నామినేషన్ ఆధారిత వీసా జీవిత కాలం చెల్లుబాటు అవుతుంది.

మాజీ సీజేఐ చంద్రచూడ్‌ను ఖాళీ చేయించండి

» కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు లేఖ

న్యూఢిల్లీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ చంద్రచూడ్‌ను వెంటనే ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసం నుంచి ఖాళీ చేయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు పాలనా విభాగం కోరింది. 2024 నవంబరు 10న సీజేఐగా పదవీ విరమణ పొందిన జస్టిస్ చంద్రచూడ్.. గత 8 నెలలుగా టైప్-8 అధికారిక బంగ్లాలోనే ఉంటున్నారని తెలుపుతూ కేంద్ర హౌజింగ్, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శికి లేఖ రాసింది. రిటైర్ అయ్యాక టైప్-7 ప్రభుత్వ బంగ్లాలో ఆరు నెలల పాటు అద్దె చెల్లించకుండానే ఉండొచ్చని, ఆ గ్రేస్ పీరియడ్ కూడా ఇప్పటికే గడిచిపోయిందని ఆ లేఖలో గుర్తు చేసింది. ప్రస్తుతం సీజేఐగా ఉన్న వారికి టైప్-8 అధికారిక బంగ్లాను కేటాయించాల్సి ఉన్నందున, దాన్ని వెంటనే ఖాళీ చేయించాలని కోరింది. అధికారిక బంగ్లాలో నివసించేందుకు మాజీ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కు ఇచ్చిన గడువు మే 31తోనే ముగిసిందని గుర్తు చేసింది. కాగా.. జస్టిస్ చంద్రచూడ్ తర్వాత జస్టిస్ ఖన్నా సీజేఐగా నియమితులయ్యారు. అయితే, ఆయన 6 నెలలు మాత్రమే ఆ పదవిలో ఉన్నారు. అలా ఉన్నప్పుడు.. 2024 డిసెంబరు 18న జస్టిస్ ఖన్నాకు జస్టిస్ చంద్రచూడ్ ఒక లేఖ రాశారు. ఇప్పటికే తనకు తుగ్లక్ రోడ్డులోని బంగ్లా నంబర్ 14ను కేటాయించారని, అక్కడ మరమ్మతులు జరుగుతున్నాయని.. పనులు పూర్తయిన వెంటనే సీజేఐ అధికారిక నివాసాన్ని ఖాళీ చేస్తానని లేఖలో స్పష్టం చేశారు. ఆ లేఖకు జస్టిస్ సంజీవ్ ఖన్నా సానుకూలంగా స్పందించారు. జస్టిస్ ఖన్నా సీజేఐ అధికారిక నివాసంలో ఉండకుండానే పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ బీఆర్ గవాయికి సైతం జస్టిస్ చంద్రచూడ్ ఇదే విజ్ఞప్తి చేశారు. జస్టిస్ చంద్రచూడ్‌కు మే 31 వరకు అనుమతి లభించింది. అయితే, గడువు పొడిగించకూడదనే షరతుపైనే అనుమతి ఇచ్చారు. ఆ సమయం కూడా గడిచిపోయి మరో నెల పూర్తయింది. కానీ, జస్టిస్ చంద్రచూడ్ అధికారిక నివాసాన్ని ఖాళీ చేయలేదు.

వర్ధమాన దేశాలకు ప్రాతినిధ్యమేదీ?

» ప్రస్తుత పరిస్థితులకు సరిపోని ఐరాస

» బడుగు దేశాల సమస్యలపై చర్చే లేదు

» బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



బ్రిక్స్ సదస్సు సందర్భంగా వివిధ దేశాల అధినేతలతో కలిసి ప్రధాని మోదీ మానవహారం

రియో డి జనైరో, జూలై 6: ప్రపంచస్థాయి సంస్థల్లో వర్ధమాన, వెనుకబడిన దేశాలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడంపై భారత ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని మరింత సమ్మిళితంగా, బహుళ ధ్రువ సంస్థలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. 'గ్లోబల్ సౌత్'గా వ్యవహరిస్తున్న వెనుకబడిన దేశాలకు మరింత ప్రాధాన్యం లభించాల్సి ఉందని తెలిపారు. ఆదివారం బ్రెజిల్‌లోని రియో డి జనైరో నగరంలో జరిగిన 17వ బ్రిక్స్ కూటమి సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సదస్సుకు కీలక నేతలైన రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ గైర్హాజరు కావడం గమనార్హం. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలు కారణంగా ప్రపంచ స్థాయి సంస్థల్లో గ్లోబల్ సౌత్ దేశాలు బాధితులుగా మిగులుతున్నాయని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి, వనరుల పంపిణీ, భద్రత వంటి విషయాల్లో చిన్నచూపునకు గురవుతున్నాయని తెలిపారు. 20వ శతాబ్దంలో ఏర్పాటయిన ప్రపంచస్థాయి సంస్థల్లో మూడింట రెండో వంతు మానవ జాతికి తగిన ప్రాతినిధ్యమే లేకుండా పోతోందని ఆరోపించారు. "ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఎంతగానే సహకరిస్తున్న దేశాలకు విధాన నిర్ణయాలు తీసుకునే సమయంలో తగిన స్థానం ఉండడం లేదు. ఇది కేవలం ప్రాతినిధ్యానికి సంబంధించిన సమస్యే కాదు.. ఆయా సంస్థల విశ్వసనీయత, సమర్థతకు సంబంధించినది కూడా. గ్లోబల్ సౌత్ దేశాలకు ప్రాతినిధ్యం లేని సంస్థలను ప్రపంచస్థాయి సంస్థలు అంటే..అవి సిమ్ కార్డు ఉండి నెట్ వర్క్‌లేని మొబైల్ ఫోన్లు లాంటివి" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచస్థాయి సంస్థ అయిన ఐక్యరాజ్యసమితిపై అభిప్రాయం చెబుతూ అది 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనలేకపోతోందని చెప్పారు. "ప్రపంచంలో పలుచోట్ల జరుగుతున్న యుద్ధాలు, కరోనా వంటి మహమ్మారులు, ఆర్థిక సంక్షోభం, సైబర్ నేరాలు, అంతరిక్షంలోని సమస్యలకు ఈ సంస్థల వద్ద సమాధానాలు లేవ"ని ప్రధాని అన్నారు. నూతన సమ్మిళిత ప్రపంచ వ్యవస్థను నెలకొల్పాలంటే ముందుగా ఇప్పుడున్న ప్రపంచస్థాయి సంస్థలను సంపూర్ణంగా ప్రక్షాళన చేయాల్సి ఉందని అన్నారు. పరిపాలన వ్యవస్థ, ఓటింగ్ హక్కులు, నాయకత్వ స్థానాల్లో మార్పులు ఉండాలని చెప్పారు. బ్రిక్స్‌లో కూడా మరిన్ని దేశాలను కలుపుకోవాలని, కాలానికి తగ్గట్టుగా ఈ కూటమి కూడా మారుతుందని నిరూపించాలని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ(ఏఐ)ను అన్ని దేశాలకు అందుబాటులో ఉంచడంపైనా ప్రధాని మోదీ మాట్లాడారు. "సాంకేతిక పరిజ్ఞానం ప్రతి వారం మారుతోంది. కానీ ఓ ప్రపంచ స్థాయి సంస్థ మాత్రం దీనిని ఎనిమిదేళ్లకు ఒకసారయినా అప్‌డేట్ చేసేందుకు ఇష్టపడడం లేదు. 20వ శతాబ్దపు టైప్‌రైటర్ల మీద 21వ శతాబ్దం సాఫ్ట్‌వేర్ పనిచేయదు" అని వ్యాఖ్యానించారు. భారత్ మాత్రం నిర్మాణాత్మక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ పరిపాలన, శాంతి, భద్రత, కృత్రిమ మేధ రంగాల్లో సహకారం అందిస్తుందన్నారు.

పహల్గామ్ ఉగ్రదాడి ప్రస్తావన

ఉగ్రవాదం పహల్గామ్ దాడి అంశాలనూ మోదీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఉగ్రవాదం ప్రపంచమానవాళి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ అని పేర్కొన్న ఆయన, పహల్గామ్ ఉగ్రదాడి సమస్త మానవాళిపై జరిగిన దాడి అన్నారు. కాగా, అర్జెంటీనా పర్యటన ముగించుకొని బ్రెజిల్ చేరుకున్న మోదీకి రియో డి జనైరోలో భారతీయులు ఘనంగా స్వాగతం పలికారు.

ఏఐతో నిండు 150 ఏళ్లు!

(మొదటి పేజీ తరువాయి)



దక్షిణ కొరియా పౌరులు 85 ఏళ్ల సగటు జీవితకాలంతో ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచారు. మరి తదుపరి దశ ఏమిటి? ఏ టెక్నాలజీ సాయంతో మనిషి జీవితకాలాన్ని మరింత పెంచవచ్చు? ..అంటే, ఈ ప్రశ్నలకు సమాధానం 'కృత్రిమమేధ' అని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఏఐ వల్ల 2030 నాటికి.. అంటే కేవలం వచ్చే ఐదేళ్లలోనే మానవ జీవితకాలం రెట్టింపు అవుతుందని వారు అంచనా వేస్తున్నారు. రెట్టింపు అంటే.. దాదాపుగా 150 సంవత్సరాలు! మనం అనుకునే పూర్ణాయుష్షు కన్నా యాభై ఏళ్లు ఎక్కువ!! ఆధునిక వైద్యం వల్ల జీవితకాలం పెరిగిందంటే.. దాంట్లో ఒక అర్థం ఉంది. మరి కృత్రిమ మేధతో జీవితకాలం ఎలా రెట్టింపు అవుతుంది? అంటే.. వేలాది పత్రాలను సైతం వేగంగా పరిశీలించి క్షణాల్లో విశ్లేషించే శక్తి ఏఐకి ఉందని శాస్త్రజ్ఞులు గుర్తుచేస్తున్నారు. ఆ శక్తిని వినియోగించుకోవడం ద్వారా.. సరైన చికిత్స లేని పలు ఆరోగ్య సమస్యలకు కొత్త కొత్త పరిష్కారాలను కనుగొనవచ్చని, కొన్ని సమస్యలు అసలు తలెత్తకుండా ముందుజాగ్రత్త పడొచ్చని తద్వారా మనుషుల లైఫ్‌స్పాన్‌ను పెంచడం సాధ్యమని వారు ప్రతిపాదిస్తున్నారు. ఉదాహరణకు.. మన శరీరంలోని క్రోమోజోముల చివరి భాగంలో ఉండే టెలోమియర్ల పొడుగు మన వయసు పెరిగేకొద్దీ తగ్గిపోతుందని, ఆ ప్రక్రియను నిరోధించగలిగితే వృద్ధాప్యాన్ని జయించవచ్చని శాస్త్రజ్ఞులు ఇప్పటికే గుర్తించారు. కొన్ని ఇంజెక్షన్లు, మందుల ద్వారా టెలోమియర్ల పొడుగును తగ్గించకుండా ఆపొచ్చని వారి పరిశోధనల్లో వెల్లడైంది. కానీ.. వాటివల్ల కణవిభజన అపరిమితంగా జరిగి క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని తెలిసింది. దీంతో.. ఆ ముప్పు లేకుండా టెలోమియర్ల పొడుగు తగ్గిపోయే ప్రక్రియను నిరోధించే దిశగా శాస్త్రవేత్తలు చాలాకాలంగా పరిశోధనలు చేస్తున్నారు. ఆ పరిశోధనలకు ఏఐని ఊతంగా వాడుకోగలిగితే ఇంకా వేగంగా ఫలితాలను సాధించవచ్చని కొందరు శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

మెడికల్ నానోబోట్లు..

ఏఐ సాయంతో మానవ జీవితకాలాన్ని వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేయొచ్చని.. అమెరికాలోని క్యాలిఫోర్నియాకు చెందిన ప్రముఖ ఏఐ సంస్థ 'ఆంత్రోపిక్' వ్యవస్థాపకుడు డేరియో పదేపదే చెబుతున్నారు. మరో నిపుణుడు.. రే కర్జ్‌వెయిల్‌ది కూడా ఇదే మాట. మానవుల్లో వయసుమీరే ప్రక్రియను 2032 నాటికి ఏఐ నియంత్రించగలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అప్పటికి కృత్రిమమేధతో పనిచేసే మెడికల్ నానోబోట్లు అందుబాటులోకి వస్తాయని, మనకు ఏదైనా రోగం వచ్చినప్పుడు ఏఐ సాయంతో సమస్య ఏమిటో గుర్తించి.. ఈ మెడికల్ నానోబోట్లను శరీరంలోకి పంపిస్తే అవి కణస్థాయిలో మరమ్మతులు చేస్తాయని చెప్పారు. అలాగే.. ఏఐ సాయంతో అప్పటికి మన మెదడులోని సమాచారాన్ని బ్యాకప్ తీయడం కూడా సాధ్యమవుతుందని ఆయన అంచనా. అలా బ్యాకప్ తీయగలిగితే మనిషి భౌతికంగా లేకపోయినా మానసికంగా చిరంజీవిగానే మిగిలినట్టు!!

ఇంత త్వరగానా?

కృత్రిమ మేధ సామర్థ్యం గురించి కొందరు శాస్త్రజ్ఞులు ఆశావహ దృక్పథంతో ఆలోచిస్తుండగా.. మరికొందరు మాత్రం ఇవన్నీ ఐదేళ్లలో సాధ్యమవుతాయనకోలేమంటున్నారు. "సినిమాల్లో చూపించినట్టుగా ఏఐ మనల్ని హద్దుల్లేని శక్తులుగా తయారుచేసేయలేదు. కాకపోతే, మనల్ని మరింత ఆరోగ్యంగా, చురుగ్గా ఉంచగలుగుతుంది. మరీ 150 ఏళ్లు కాదుగానీ.. ఏఐ మనుషులు కనీసం వందేళ్లు జీవించడం మన జీవితకాలంలోనే చూడగలుగుతాం" అని 'డేటా సొసైటీ' కంపెనీ చీఫ్ సైంటిస్ట్ ద్మిత్రీ అడ్లెర్ తెలిపారు.

జన్యు పరిశోధనలకు..

జన్యులోపాలను సరిచేయడానికి ప్రస్తుతం క్రిస్పర్ అనే జీన్ ఎడిటింగ్ టెక్నాలజీ అందుబాటులో ఉన్న సంగతి తెలిసిందే. కానీ, అది ఇంకా చాలా ప్రాథమిక స్థాయిలో ఉంది. లోపం ఉన్న చోట సవరణకే ఉపయోగిస్తున్నారు. కానీ.. మన శరీరంలోని జన్యువులు కాలక్రమంలో రకరకాల ప్రభావాలకు లోనై మార్పులు చెందుతుంటాయి. వాటన్నింటినీ ఊహించి (లేదా) ముందే అంచనా వేసి జన్యుసవరణ చేసే వెసులుబాటు ప్రస్తుతానికి అందుబాటులో లేదు. ఈ ప్రక్రియలో ఏఐ సాయం తీసుకుంటే.. కాలక్రమంలో ఒక జన్యువులో ఎలాంటిమార్పులు సంభవించే అవకాశం ఉందో సమగ్రంగా విశ్లేషించి అంచనా వేస్తుంది. దానివల్ల చాలారకాల అనారోగ్యాలను రాకుండా అడ్డుకునే అవకాశం ఉందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడిలో హమాస్ కమాండర్ మృతి

» మరో ఇద్దరు హమాస్ కీలక నేతలు కూడా

» అమెరికాలో నేడు ట్రంప్‌తో నెతన్యాహు భేటీ

గాజా, టెల్ అవీవ్, జూలై 6: గాజాపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో హమాస్ కమాండర్ అలీ సలేహ్ మృతిచెందాడు. హమాస్‌కు చెందిన మరో ఇద్దరు కీలక సభ్యులు మన్సూర్, సులేమాన్ కూడా హతమయ్యారు. గాజా నగరంతో పాటు మొత్తం వంద చోట్ల దాడులు ఇజ్రాయెల్ దాడులు చేయగా 61 మంది మృతిచెందారు. నగరంలోని శతి శరణార్థుల శిబిరంపై ఇజ్రాయెల్ దాడులు జరిపింది. అయితే పక్కనే ఉన్న అబు అసీ పాఠశాల లక్ష్యంగా దాడి జరిగిందని, ఈ దాడుల్లో చిన్నారులు పెద్ద సంఖ్యలో చనిపోయారని పాలస్తీనా వర్గాలు తెలిపాయి. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సోమవారం అమెరికా వెళ్తున్నారు. కాల్పుల విరమణ ఒప్పందంపై అధ్యక్షుడు ట్రంప్‌తో చర్చిస్తారు. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చించేందుకు ఖతార్‌కు తమ ప్రతినిధులను పంపుతామని ఇజ్రాయెల్ ఇప్పటికే ప్రకటించింది.

ఐదేళ్లలో కొత్త గేట్లు పెట్టాలి

- లేదంటే శ్రీశైలానికీ 'తుంగభద్ర' పరిస్థితే
- సాగునీటి ప్రాజెక్టుల నిపుణుడు కన్నయ్య నాయుడు

దోమలపెంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను మార్చాలని భారీ ప్రాజెక్టు గేట్ల నిపుణుడు నాగినేని కన్నయ్య నాయుడు చెప్పారు. మరో ఐదేళ్లలో కొత్త గేట్లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం చేస్తే గత ఏడాది తుంగభద్ర డ్యాం పరిస్థితే శ్రీశైలం ప్రాజెక్టుకూ ఎదురయ్యే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన శ్రీశైలం ప్రాజెక్టును అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం డ్యామ్ 10వ క్రస్టు గేటు నుంచి స్వల్పంగా(10 శాతం కంటే తక్కువగా) నీరు లీకవుతోందని తెలిపారు. దీనివల్ల ఇబ్బంది లేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగి 40 ఏళ్లయిందని తెలిపారు.



శ్రీశైలం ప్రాజెక్టు క్రస్టు గేట్లను పరిశీలిస్తున్న కన్నయ్య నాయుడు

2010 తర్వాత క్రస్టు గేట్లకు పెయింటింగ్ వేయలేదని గుర్తుచేశారు. సకాలంలో పెయింటింగ్ చేయడం వల్ల గేట్ల మన్నిక పెరుగుతుందని చెప్పారు. ప్లంజ్‌పూల్‌తో ప్రాజెక్టుకు ఎలాంటి ఇబ్బందీ లేదని, అది జలాశయం నుంచి 60 మీటర్ల దూరంలో ఉందని తెలిపారు. ప్రాజెక్టు పరిశీలనలో కన్నయ్య నాయుడితో ఇంజనీర్లు ఉన్నారు.

నేడు భారీ, రేపు అతి భారీ వర్షాలు

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం అక్కడక్కడ ఈదురుగాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు పడతాయని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మంగళవారం పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో అక్కడక్కడ అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇక పెద్దపల్లి, భూపాలపల్లి, జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఆ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈ నెల 12 వరకు రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.



బొగత జలపాతంలో జనసందడి

వాజేడు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలోని బొగత జలపాతానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇక్కడ జలకళ సంతరించుకుంది. పాల నురగలా కిందకు దుంకుతున్న జలధారలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం జలపాతం వద్ద జన సందడి నెలకొంది.

ఆటో కావాలా.. నమోదు చేసుకోండి!

- ఓఆర్‌ఆర్‌లోపు నివసించే వారికి అవకాశం

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ ఆటోల నమోదుకు రవాణా శాఖ పచ్చజెండా ఊపింది. రాష్ట్రంలోని ఆటో డీలర్ల వద్ద అర్హులైన వారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించింది. రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ ఆదివారం డ్రైవర్లకు, డీలర్లకు పలు మార్గదర్శకాలు విడుదల చేశారు. నగరంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే ఓఆర్‌ఆర్ లోపల ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ ఆటోలకు అనుమతిస్తూ ఇటీవల ప్రభుత్వం జీవో 263 జారీ చేసింది. రాష్ట్రంలోని ఏ డీలర్ వద్దనైనా ఆటోలు కొనుగోలు చేయొచ్చని, డ్రైవింగ్ లైసెన్స్‌పై ఓఆర్‌ఆర్ లోపు నివసిస్తోన్న చిరునామా ఉండాలని పేర్కొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే ఉద్యమం తప్పదు: బీసీ కుల సంఘాల నేతలు

ఖైరతాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బీసీలను మభ్యపెట్టి అధికారంలోకి వస్తున్న పార్టీలు వారికి చేసిందేమీ లేదని బీసీ కుల సంఘాల నేతలు విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఖైరతాబాద్‌లోని మోడ్రన్ ఫంక్షన్ హాల్‌లో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన కుల సంఘాల రాష్ట్రస్థాయి సదస్సులో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటవ నరసింహ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో అన్ని జిల్లాల కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం వెంటనే ఆమోదించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి జిల్లాలో బీసీ ఐక్యవేదికలను మరింత బలోపేతం చేయాలని, త్వరలో ముఖ్యమంత్రిని కలిసి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలని నిర్ణయించారు.

ఎట్టకేలకు హ్యాంగర్‌కు కదిలిన బ్రిటన్ ఫైటర్ జెట్

తిరువనంతపురం, జూలై 6: గత 22 రోజులుగా కేరళలోని తిరువనంతపురం విమానాశ్రయంలోనే నిలిచిపోయిన బ్రిటన్ యుద్ధ విమానం ఎఫ్-35బీ ఎట్టకేలకు మరమ్మతుల నిమిత్తం హ్యాంగర్‌కు కదిలింది. సాంకేతిక సమస్యలతో ఎయిర్‌పోర్టు ఆవరణలోనే నిలిచిపోయిన ఈ ఫైటర్ జెట్‌కు మరమ్మతులు చేసేందుకు బ్రిటన్ నుంచి సుమారు 25 మందితో కూడిన ఇంజనీరింగ్ నిపుణులు ప్రత్యేక పరికరాలతో బ్రిటిష్ రాయల్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఏ400ఎం అట్లాస్ విమానంలో ఆదివారం తిరువనంతపురం చేరుకున్నారు. వారి సమక్షంలో దీన్ని ఎయిర్‌పోర్టు ఆవరణ నుంచి హ్యాంగర్‌కు తరలించారు. బ్రిటిష్ రాయల్ నేవీకి చెందిన ఈ యుద్ధ విమానం.. కేరళ తీరానికి 100 నాటికల్ మైళ్ల దూరంలో విన్యాసాలు చేస్తుండగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వాతావరణం కూడా అనుకూలించకపోవడంతో దీన్ని గత నెల 14న అత్యవసరంగా తిరువనంతపురంలో ల్యాండ్ చేశారు. ఆ తర్వాత ఇక్కడి నుంచి బయల్దేరే ముందు తనిఖీల సమయంలో హైడ్రాలిక్ వైఫల్యాన్ని గుర్తించారు. మరమ్మతులు చేసేందుకు బ్రిటిష్ రాయల్ నేవీకి చెందిన ముగ్గురు నిపుణులు వచ్చినప్పటికీ ఇది మొరాయించింది. దీంతో అప్పటి నుంచి ఇది విమానాశ్రయంలోనే ఉండిపోయింది. దీనికి కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) కాపలాగా ఉంది. రుతుపవనాల కారణంగా కేరళలో భారీ వర్షాలు కురుస్తుండడంతో.. దీన్ని అక్కడి నుంచి తమ హ్యాంగర్‌లోకి తరలించాలని ఎయిరిండియా చేసిన ప్రతిపాదనను బ్రిటన్ మొదట్లో తిరస్కరించింది. ఈ క్రమంలో బ్రిటన్ నుంచి నిపుణుల బృందం రాకతో ఎట్టకేలకు దీన్ని హ్యాంగర్‌కు తరలించారు. ఒకవేళ అక్కడ కూడా రిపేరు చేయడం సాధ్యం కాకపోతే.. రవాణా విమానంలో దీన్ని ఎయిర్‌లిఫ్ట్ చేసే అవకాశం ఉంది.

నిండుకుండలా శ్రీశైలం

(మొదటి పేజీ తరువాయి)

ఎత్తి 79,920 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రాలకు 29,296 క్యూసెక్కులు, వివిధ కాలువలు, లిఫ్ట్ కెనాల్‌లకు 3,455 క్యూసెక్కులతోపాటు దిగువకు 1,11,804 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. జూరాల జల విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో 204.728 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్‌లో 172.66 టీఎంసీల నీరు ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తుండటంతో మంగళవారం సాయంత్రం శ్రీశైలం ప్రాజెక్టు గేట్లను ఎత్తడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 1,86,212 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మరోవైపు,పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ కాలువలకు 10 వేల క్యూసెక్కులు, ప్రాజెక్టు పరిధిలోని జంట విద్యుత్ కేంద్రాల్లో జల విద్యుత్ తయారీకి 67,740 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. మరోవైపు, ఎగువ నుంచి తుంగభద్ర ప్రాజెక్టుకు 52,308 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, జలాశయంలో నీటి నిల్వ 77.34 టీఎంసీలకు చేరింది.

ఆల్మట్టి నుంచి లక్ష క్యూసెక్కుల ఔట్ ఫ్లో

ఎగువన కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 91.08 టీఎంసీలు కాగా, రిజర్వాయర్‌కు 1,02,140 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దిగువకు 1,06,070 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ జలాశయంలో 30.85 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రాజెక్టుకు 99,933 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా నమోదయ్యింది.

అల్పపీడనంతో గోదావరి పరీవాహకంలో కుంభవృష్టి

మరోవైపు, పశ్చిమ బెంగాల్ పరిసరాల్లో బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్ప పీడనం ప్రభావంతో ఆదివారం ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిశాయి. సోమవారం ఛత్తీస్‌గఢ్‌లో గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు కొన్ని చోట్ల కుంభవృష్టి కురిసే అవకాశాలున్నాయని ఇస్రో వాతావరణ విభాగం తెలిపింది. దీంతో వచ్చే రెండు, మూడు రోజుల్లో గోదావరికి వరద పోటెత్తనుండగా, దాని ఉప నదులు వైన్ గంగా, ప్రాణహిత నది పరీవాహక ప్రాంతాల్లో వరద ఉధృతి పెరుగనున్నది.

కాలుష్య కోరల్లో ఓసీపీ బాధిత గ్రామాలు

ఆస్తమా, అలర్జీలతో సతమతమవుతున్న ప్రజలు.. దుమ్ము, ధూళితో పంటలూ పండించలేని వైనం

- సింగరేణి పరిహారం ఇస్తే.. ఊళ్లు ఇచ్చేస్తామంటున్న బాధితులు
- మంత్రుల సమీక్ష తర్వాత వారి ఆశలకు కొత్త ఊపిరి
- సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఆదేశించడంతో ఊరట

భూపాలపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బొగ్గు గనులతో సింగరేణికి సిరుల పంట పండుతున్నా.. ఓపెన్ కాస్టు తవ్వకాల వల్ల సమీప గ్రామాల ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. గనుల ఏర్పాటుతో తమ భూములకు ధరలు పెరిగి మహర్దశ పడుతుందని ఆశ పడిన స్థానికులకు.. సింగరేణి ఓసీపీల పుణ్యమా అని ఆస్తమా, అలర్జీ వంటి వ్యాధులే ఫలంగా మిగులుతున్నాయి. తవ్వకాలతో వెలువడుతున్న దుమ్ము కారణంగా అటు పంటలు పండక, ఇటు ఊర్లలో ఉండలేక అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో తమ ఊళ్లను వదిలేయాలనే నిర్ణయానికొచ్చిన బాధిత గ్రామాల ప్రజలు.. తగిన పరిహారమిచ్చి తమ ఇళ్లు, భూములను తీసుకోవాలని సింగరేణిని కోరుతున్నారు. భూపాలపల్లి ప్రాంతంలోని ఓపెన్‌కాస్టు-3 (మాధవరావుపల్లి ఉపరితల గని) పరిసరాల్లో ఉన్న కొండంపల్లి, పరుశురాంపల్లి, ధర్మరావుపేట, నగరంపల్లి, కొండాపూర్, వెంకటేశ్వర్లపల్లి, గుర్రంపేట ఎస్సీ కాలనీ తీవ్రంగా ప్రభావిత మవుతున్నాయి. బొగ్గు తవ్వకాల కోసం జరిపే పేలుళ్ల తీవ్రతకు ఆయా ప్రాంతాల్లోని ఇళ్లన్నీ కంపించిపోవడంతో పాటు గోడలు బీటలు వారుతున్నాయి. బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్(మట్టి) తరలింపు సమయంలో రేగుతున్న దుమ్ము, ధూళి కారణంగా ప్రజలు శ్వాస సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. పేలుళ్ల తీవ్రతనైనా తగ్గించండి లేదా పరిహారం ఇచ్చి తమ ఇళ్లను సేకరించండి అంటూ బాధిత గ్రామాల

ఓసీపీ-3 ప్రభావిత గ్రామం పరుశురాంపల్లి



ప్రజలు పదేళ్లుగా సింగరేణిపై ఒత్తిడి తెస్తున్నా.. పెద్దగా ఫలితం దక్కలేదు. ఓపెన్ కాస్టు-1 పరిధిలో కొంత భూ సేకరణ జరిపినా.. ఇంకా 125 ఎకరాల మేర సేకరించి, పరిహారం చెల్లించాల్సి ఉంది. ఇక, భూపాలపల్లి పట్టణ సమీపంలో ఉన్న ఓపెన్ కాస్టు-2 కారణంగా శాంతినగర్, హనుమాన్ నగర్, గాంధీనగర్, ఫక్కీర్ గడ్డ, ఆకుదారివాడ, జంగేడు కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. ఇప్పటికీ ఎలాంటి పరిహారం చెల్లించలేదు.

దుమ్ములో ప్రమాదకర సూక్ష్మ కణాలు

ఓసీపీల వల్ల పీఎం(పర్టిక్యులేట్ మ్యాటర్) 10, పీఎం 2.5గా పిలవబడే అతి సూక్ష్మ కణాలు గాలిలో కలిసి మనుషులు, జంతువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పీఎం 2.5 సూక్ష్మ కణాలు ఊపిరితిత్తులు, రక్త నాళాల్లోకి చొచ్చుకుపోయి ముక్కు, గొంతు, కంటి ఎలర్జీ, దగ్గు, దమ్ము, గురక వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ముఖ్యంగా రక్తంలోకి చొచ్చుకుపోవడం వల్ల ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు అకాల మరణాలకు దారితీసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కొన్నేళ్లుగా సింగరేణి సంస్థ వైద్య శిబిరాలు నిర్వహించిన దాఖలాలు కూడా లేవు. ఓసీపీ-3 వల్ల పంటలు కూడా సాగు చేయలేని పరిస్థితి నెలకొందంటూ పలు గ్రామాల రైతులు ఇటీవల సింగరేణి కార్యాలయాలు, బొగ్గు గనుల పరిసరాల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు.

మంత్రుల దృష్టికి సమస్య

ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లడంతో మరో సారి తెరపైకి వచ్చింది. బాధిత గ్రామాల ప్రజల సమస్యలు విన్న మంత్రులు.. శాశ్వత పరిష్కారం చూపుతామంటూ అక్కడిక్కడే హామీ ఇచ్చారు. అంతేకాదు అదే రోజు సాయంత్రం సింగరేణి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభావిత గ్రామాల్లో రెవెన్యూ అధికారులతో కలిసి అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయడంతోపాటు వెంటనే తమకు నివేదిక పంపాలని వారు ఆదేశించారు. పునరావాసం సాధ్యాసాధ్యాలపై అంచనాలు రూపొందించాలని సూచించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తమకు ఇచ్చే పరిహారాన్ని(అవార్డును) తేల్చాలని, వెంటనే పునరావాసం కల్పించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

ఓసీపీతో ఇబ్బందులు పడుతున్నాం



ఓసీపీతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న భూములను కోల్పోయి దుమ్ము, ధూళితో సతమతమవుతున్నాం. పేలుళ్ల తీవ్రతతో మా ఇళ్లు బీటలు వారుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. పరిహారం అందించి మా గ్రామాన్ని ఇక్కడ నుంచి తరలించాలి.

– ఉడుత రవీందర్, పరుశురాంపల్లి

కోరుట్ల చిన్నారిని చంపింది చిన్నమ్మేనా?

- పోలీసుల అదుపులో అనుమానితురాలు
- ఇంట్లో చిన్నచూపు చూస్తున్నారనే దారుణం



హితీక్ష (ఫైల్)

కోరుట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్లలో చోటు చేసుకున్న ఐదేళ్ల బాలిక హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. బాలిక(బాబాయ్ భార్య) చిన్నమ్మ మమతపై అనుమానంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి హితీక్షను గొంతు కోసి చంపి పక్కింటి బాత్రూంలో పడేసిన ఘటన శనివారం కలకలం రేపింది. ఘటనా స్థలం దగ్గర జాగిలాలతో తనిఖీలు చేపట్టగా అవి హితీక్ష ఇంటిలోకి వెళ్లి నిలిచిపోవడంతో పోలీసులు ఆ దిశగా విచారణ చేశారు. ఇంట్లో ఉన్న వారి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని పరిసరాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఇంట్లోకి వచ్చిపోయే వారి వివరాలతో పాటు హితీక్ష చిన్నమ్మ మమత ఫోన్ డేటాను పరిశీలించారు. మమత సెల్‌ఫోన్‌లో హత్య చేయడానికి సంబంధించిన కొన్ని వీడియో క్లిప్పింగులను గుర్తించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. హత్య జరిగిన ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించగా మమత సాయంత్రం 6:30 గంటల నుంచి మృతదేహం దొరికే వరకు ఐదుసార్లు అదే ప్రాంతానికి వచ్చిపోయినట్లు గుర్తించారు. తనను ఇంట్లో చిన్నచూపు చూస్తున్నారనే మమత తన తోడి కోడలు నవీనపై కక్ష పెంచుకొని ఆమె కూతురు హితీక్షను హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. మమత హత్య కోసం వాడిన పరికరాలతో పాటు ఆమె వేసుకున్న లెగ్గిన్‌ను పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద పోలీసులు సేకరించినట్లు తెలిసింది. కాగా, మమత ఆన్‌లైన్ గేమ్స్‌తో పాటు బిట్ కాయిన్‌లో పెట్టుబడి పెట్టి రూ.25లక్షలు పోగొట్టుకున్నట్టు తెలిసింది.

42కు చేరిన 'సిగాచి' మృతుల సంఖ్య

- ఆస్పత్రిలో కార్మికుడి మృతి
- డీఎన్‌ఏ పరీక్షల ఆధారంగా ముగ్గురి వివరాల గుర్తింపు
- ఆచూకీ తెలియని మరో 8 మంది కోసం అన్వేషణ
- సిగాచి పరిశ్రమకు తాళం



శిథిలాల్లో దొరికిన మానవ అవశేషాలు

పటాన్‌చెరు/పటాన్‌చెరు రూరల్ జూలై 6(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 42కు పెరిగింది. పటాన్‌చెరులోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు జితేందర్ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రసూల్‌పూర్‌కు చెందిన జితేందర్ 80శాతానికి పైగా కాలిన గాయాలతో ఆస్పత్రిలో చేరాడు. మరోపక్క, మార్చురీలో గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న రెండు మృతదేహాలకు డీఎన్‌ఏ పరీక్షలు చేసిన వైద్యులు.. మృతులను ఇస్నాపూర్‌కు చెందిన దాసరి రామాంజనేయులు (52), మధ్యప్రదేశ్‌కు చెందిన చికెన్‌సింగ్ (49)గా గుర్తించారు. ఆ మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. చికెన్‌సింగ్ కుటుంబానికి రూ.లక్ష అందజేసిన అధికారులు మృతదేహాన్ని అంబులెన్స్‌లో మధ్యప్రదేశ్‌కు తరలించారు. అలాగే, ప్రమాదం జరిగిన రోజు నుంచి ఆచూకీ లేకుండా పోయిన మహబూబాబాద్‌కు చెందిన ఎం.అఖిల్ అనే కార్మికుడి శరీర అవశేషాలను వైద్యులు డీఎన్‌ఏ పరీక్షల ద్వారా గుర్తించి వాటిని కుటుంబసభ్యులకు అప్పగించారు. అఖిల్ కుటుంబం ఉప్పల్‌లోని కొర్రెముల్‌లో నివాసముంటోంది. మొత్తంగా 42 మంది కార్మికులకు చెందిన మృతదేహాలు, శరీర అవశేషాలను బాధిత కుటుంబాలకు అధికారికంగా అప్పగించారు. మరో 18 మంది క్షతగాత్రులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఘటన జరిగిన నాటి నుంచి ఆచూకీ లేకుండా పోయిన మరో 8 మంది కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఘటనాస్థలిలో లభించిన 70కి పైగా నమూనాలను ఇప్పటికే ల్యాబ్‌లకు తరలించగా.. ఇంకా ఏమైనా అవశేషాలు లభిస్తాయేమోనని అధికారులు ఘటనా స్థలిని జల్లెడ పడుతున్నారు. సిగాచి పరిశ్రమ ప్రధాన గేటుకి ఎట్టకేలకు తాళం పడింది. శిథిలాల తొలగింపు కార్యక్రమం దాదాపు పూర్తవ్వగా.. ఇప్పటివరకు తమ వారి ఆచూకీ లభించకపోవడంతో కొన్ని కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి. వారంతా పాశమైలారం ఐలా భవనం వద్ద పడిగాపులు పడుతున్నారు.

మతి ఉండే నా తలరాత ఇలా రాశావా ?

- దేవుడిని ఉద్దేశించి లేఖ రాసి వేములవాడలో యువకుడి ఆత్మహత్య



రోహిత్ (ఫైల్)

వేములవాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): "మతి, తెలివి ఉండే నా తలరాత ఇలా రాసావా.. అదే నీ కొడుకుకు అలా రాయలేదే.. మేము కొడుకులం కాదా..?" అని దేవుడిని ఉద్దేశిస్తూ లేఖ రాసి ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన దీటి రోహిత్(25) జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం గుర్తించారు. రోహిత్ తండ్రి దీటి వేణుగోపాల్ స్థానికంగా ఎలక్ట్రానిక్స్, ఫర్నిచర్ దుకాణం నిర్వహిస్తుంటారు. ఎమ్మెస్సీ పూర్తి చేసి ప్రస్తుతం బీఎడ్ చదువుతున్న రోహిత్.. డాక్టర్ కావాలనే తన కల నెరవేరకపోవడంతో ఎప్పుడూ అసంతృప్తిగా ఉండేవాడని బంధువులు చెబుతున్నారు. ఆత్మహత్య విషయం తెలిసి ఘటనాస్థలికి చేరుకున్న వేములవాడ పోలీసులు.. రోహిత్ రాసినట్టుగా భావిస్తున్న ఓ లేఖను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దేవుళ్లను ప్రార్థిస్తూ లేఖను మొదలుపెట్టిన రోహిత్.. ఓ మంచి ఆత్మహత్య లేఖ రాయాలనే తన కోరిక నెరవేరిందని అందులో పేర్కొన్నాడు. మరణం కంటే జీవించడంలో ఉన్న బాధ అధికమని అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని, తనకు మరో జన్మ వద్దని అందులో రాశాడు. తన జీవితాన్ని జగన్మాతకు అర్పిస్తున్నానని, తన మృతదేహాన్ని కాశీలో దహనం చేయాలనేదే తన చివరి కోరికని పేర్కొన్నాడు.

ప్రాణాలు తీస్తున్న పరిశ్రమల కక్కుర్తి

రాష్ట్రంలో ఐదేళ్లలో 700కు పైగా ప్రమాదాలు.. ఔషధ, రసాయన పరిశ్రమల్లోనే అధికం

- యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరే కారణం
- వారికి వత్తాసుగా అధికార యంత్రాంగం

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సిగాచీ పరిశ్రమలో పేలుడు నేపథ్యంలో ఔషధ, రసాయన, ఇతర పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఎక్కువగా ప్రచారం జరుగుతోందిగానీ.. తరచూ అనేక చోట్ల ప్రమాదాలు జరుగుతున్నా.. వాటి గురించి బయటకు రావట్లేదని నిపుణులు అంటున్నారు. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారమే.. తెలంగాణలో ఐదేళ్లలో పలు పరిశ్రమల్లో 700కు పైగా ప్రమాదాలు జరిగినట్టు తెలుస్తోంది. వాటిలో 500కు పైగా ఔషధ, రసాయన పరిశ్రమల్లో జరిగినవే! అయినప్పటికీ.. కారణాలను అంచనావేసి, గుర్తించడంలో అధికారుల వైఫల్యం ఎంతో ఉందని నిపుణులు అంటున్నారు. ప్రమాదం జరిగినప్పుడు కార్మికుల నిర్లక్ష్యమే కారణమంటూ యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయని.. కానీ, తగిన అర్హతలు లేనివారిని తక్కువ జీతానికి నియమించుకోవడం, భద్రతా చర్యలకు సంబంధించి వారికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వకుండానే పనులు చేయించడం, నిర్ణీత విధానాల ప్రకారం పనిచేయడానికి వీలుగా వారికి అవసరమైన పరికరాలను అందించకపోవడమే ప్రమాదాలకు కారణమని మానవ హక్కుల వేదిక ప్రతినిధి సంజీవ్ చెబుతున్నారు. నిబంధనలన్నీ పక్కాగా అమలు చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం తక్కువని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో అత్యంత ప్రమాదకర పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి. వాటిల్లో ఎలాంటి యంత్రాలు వినియోగిస్తున్నారు. వాటి పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారా? ప్రమాణాలను పాటిస్తున్నారా అనే విషయాలను మాత్రం ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోవట్లేదని.. సీనియర్ సైంటిస్టు కలపాల బాబూరావు ఆవేదన వెలిబుచ్చారు. విదేశాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటారని, మన దగ్గర మాత్రం యజమానులపై ఈగ కూడా వాలనివ్వకుండా తప్పంతా కార్మికులదే అన్నచందంగా కొందరు అధికారులు నివేదికలు ఇవ్వడం దుర్మార్గమని బాబూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించేందుకు చట్టాలున్నా.. వాటి అమలు తీరు సరిగ్గా లేదని ఆవేదన వెలిబుచ్చారు. అలా కాకుండా.. ప్రతి కేసులోనూ నిపుణులతో నిజ నిర్ధారణ చేయించాలని, నిష్పక్షపాతంగా విచారణ జరిపి యాజమాన్యాల తప్పిదాలు ఉంటే వారికి తగిన శిక్ష విధించాలి అని సూచించారు.

యజమానులే దోషులు



రసాయన, ఔషధ పరిశ్రమలలో ప్రమాదాలు తలెత్తిన ప్రతి సందర్భంలోనూ కార్మికుల చర్యలే అందుకు కారణమని ఫ్యాక్టరీస్ శాఖ, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు నివేదికలు రాయడం వల్ల యజమానులు తప్పించుకుంటున్నారు. నిజానికి అసలు దోషులు వారే. కనీస భద్రత చర్యలు తీసుకోకపోవడం, సమర్థులైన భద్రతాధికారులను నియమించకపోవడం, కనీస భద్రతా పరికరాలు అందుబాటులో ఉంచకపోవడం వంటి కారణాల వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పాశమైలారం ఘటన నేపథ్యంలో అయినా ఈ లోపాలపై దృష్టి సారించాలి.

– కలపాల బాబూరావు, విశ్రాంత సైంటిస్ట్

వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

దాశరథి శతజయంతి సదస్సు

కేంద్రసాహిత్య అకాడమీ, తెలుగు శాఖ ప్రభుత్వ సిటీ కళాశాల (హైదరాబాద్) సంయుక్త నిర్వహణలో జూలై 9 ఉ.10 నుంచి సా.5.30 వరకు సిటీ కళాశాల ఆజామ్ హాల్లో 'దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి సదస్సు' జరుగుతుంది. ప్రారంభ సమావేశంలో సి. మృణాళిని స్వాగతోపన్యాసం, నందిని సిధారెడ్డి కీలకోపన్యాసం చేస్తారు. ముఖ్య అతిథి ప్రిన్సిపాల్ పి. బాలభాస్కర్, గౌరవ అతిథి దాశరథి కుమార్తె ఇందిరా గౌరీశంకర్, అధ్యక్షత కోయి కోటేశ్వరరావు. పత్ర సమర్పణ– గంగ్ర లక్ష్మణ రావు, ఏనుగు నరసింహారెడ్డి, ఆర్. సీతారామ్, కె. ప్రభాకర్, సిద్ధంకి యాదగిరి, సమ్మెట విజయ, గరిపెల్లి అశోక్.

కోయి కోటేశ్వరరావు

కార్టూనిస్ట్ శేఖర్ స్మారక అవార్డులు

కార్టూనిస్ట్ శేఖర్ స్మారకార్థం అవార్డుల ప్రదానం జూలై 13 ఉ.10.30 గం.లకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. 2025కు గాను కార్టూనిస్ట్ మృత్యుంజయ, ఆర్టిస్ట్ చిత్ర ఈ అవార్డు కింద రూ.10,116 నగదు, ప్రశంసాపత్రం స్వీకరిస్తారు. ముఖ్యఅతిథి ఎస్. వినయకుమార్, స్మారకోపన్యాసం కూర్మనాథ్; విశిష్ట అతిథులు తిప్పర్తి యాదయ్య, చింతల యాదగిరి, శంకర్, కూరెళ్ళ శ్రీనివాస్ తదితరులు వివరాలకు: 9052116323.

కంభాలపల్లి కృష్ణ

రజనిశ్రీ సాహిత్య పురస్కార ప్రదానం

రజనిశ్రీ సాహిత్య పురస్కార ప్రదానం జూలై 12 మ.1.30గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. 'నిశాచరుడి దివాస్వప్నం' కవితా సంపుటికి గాను మల్లారెడ్డి మురళీమోహన్ పురస్కారాన్ని స్వీకరిస్తారు. కార్యక్రమంలో సి. పార్థసారథి, కసిరెడ్డి వెంకటరెడ్డి, మామిడి హరికృష్ణ, ఎస్. రఘు, అన్నవరం దేవేందర్ తదితరులు పాల్గొంటారు.

గాజుల రవీందర్



కవి కులాబ్ధి సోముడు!

"ఒకడు నాచన సోమన్న" అన్నారు విశ్వనాథ. అద్వితీయుడు (unique) అని ఆయన భావన. "మాట నేర్పు మీద, మానవ ప్రకృతి మీద, గడుసుదనం మీదనే సంవిధాన సౌధాన్ని నాచన సోమన్న నిర్మించాడు. ఇంతగా గడుసుతో సంవిధాన నిర్వహణ చేసిన తెలుగు కవులు లేనేలేరని చెప్పవచ్చు," అని కూడా విశ్వనాథ వ్యాఖ్యానించారు.

నాచన సోమన క్రీ.శ.1344ప్రాంతంవాడు. ఎఱ్ఱాప్రగడకు సమకాలికుడు; ఒకరకంగా కొద్దిగా చిన్నవాడు. సోమన రాసిన 'ఉత్తర హరివంశం' ఒక ప్రబంధం. కాగా అప్పటికే ఎఱ్ఱన రాసిన 'హరివంశం' ఉన్నది. ఎఱ్ఱనది పురాణ కావ్యమైతే సోమనది ప్రబంధ శైలి. ఎఱ్ఱాప్రగడ తన 'హరివంశా'న్ని ప్రోలయ వేమారెడ్డికి అంకితం ఇచ్చాడు. కాని సోమన తన ప్రబంధాన్ని నరాంకితం చేయకుండా తిక్కన లాగా హరిహరనాథుడికి సమర్పించాడు.

నిజానికి హరివంశం భారతానికి ఖిలం. అంటే పరిశిష్టం. సంస్కృత హరివంశాన్ని తిక్కన తన అనువాదంలో చేర్చలేదు. ఇది కలిపితేనే భారతం మహాభారతం ఔతుందని పెద్దలంటారు. వ్యాసకృతంగా పేర్కొనే ఈ పవిత్ర గ్రంథాన్ని ఇప్పటికీ నేపాల్ న్యాయస్థానాల్లో సాక్షులు తల మీద పెట్టుకుని ప్రమాణం చేస్తారు. హరివంశంతో భారతం సంపూర్ణతను సంతరించుకుంటుంది.

అప్పటికే ఎఱ్ఱన రాసిన హరివంశం ఉండగా, నాచన సోముడు మళ్ళీ రాయడం ఎందుకు? కారణాలు ఊహించాల్సిందే. ఎఱ్ఱన హరివంశం సోమన దృష్టికి వచ్చి ఉండకపోవచ్చు; వచ్చినా సంతృప్తిని ఇవ్వకపోయివుండవచ్చు; పురాణంగా కాక, ప్రబంధ ధోరణిలో రాయాలని భావించి వుండవచ్చు. ఇక పోతే, మనకు లభ్యమవుతున్న సోమన 'ఉత్తర హరివంశం'లో సాధారణంగా ఉండాల్సిన అవతారిక, కావ్యం చివరలో గద్య లేవు. ఇవి వుంటే ఎన్నో వివరాలు తెలిసేవి. అందువల్ల సోముడు పూర్వహరివంశం, ఉత్తర హరివంశం– రెండూ రాసాడని ఊహించడానికి చాలా అవకాశం వున్నది.

సంస్కృత హరివంశంలో వున్న ఎన్నో విషయాలు మనకు ఈ 'ఉత్తర హరివంశం'లో కనిపించవు. ఎఱ్ఱన వదిలేసిన హంసడిభోపాఖ్యానం ఇందులో కనిపిస్తుంది. అందువల్ల పూర్వహరివంశం సోమన రాసి వుండవచ్చు. నిజానికి ఉత్తర హరివంశం కూడా మనకు పూర్తిగా దొరకడం లేదు. సోమన 'హరవిలాసం', 'వసంత విలాసం', 'ఆదిపురాణం' అనే రచనలు చేసాడని లాక్షణికులు అన్నారు. కాగా, ఇవేమీ ఇప్పుడు లభ్యం కావు.

సోమన ఎన్నో ప్రక్రియలకు ఆద్యుడు. వీటిని తదనంతర కవులు ఎన్నిటినో అనుసరించారు. మచ్చుకు సోముని మొదటి పద్యం – "శ్రీ సర్వమంగళాకుచవాసంతీ" అని ప్రారంభమవుతుంది. ఇందులో అమ్మవారి వక్షోజాల ప్రశంస వున్నది. ఇలాంటిది పూర్వ కవుల్లో అగుపించదు. కావ్యం మొదట్లో అమ్మవారి పాలిండ్లను స్తుతించడం సోమన ఒరవడి దిద్దిందే. అందువల్ల మొట్టమొదటి 'చంటబ్బాయ్' నాచన సోముడే అని చెప్పాలి.

సోమన రాసిన 1487 సద్యాల్లో సామెతలు, జాతీయలు, పలుకుబళ్ళు మనకు బళ్ళనిండా దొరుకుతాయి. సజీవమైన జాతీయాల్ని, నిత్యజీవితంలోని మాటల్ని వాడాడు. 'లంజ', 'మిండరికం' లాంటి శబ్దాలు సైతం కనిపిస్తాయి. పురాణ ధోరణి నుంచి తన కావ్యాన్ని ప్రబంధ ధోరణిలో తీర్చిదిద్దాడు సోమన. ఇతని పాత్రలు సమకాలీన మనస్తత్వాలతో కానవస్తాయి. సారస్వతం కన్నా ఈయన రచనలో చమత్కారమే ఎక్కువ.

అందుకే – "ఈ కథలు వ్రాయుటలో నాచన సోమన్న తన కావ్యమునకొక మహాప్రయోజనమభిలషించెను. ఇట్టి దానికి ప్రబంధ ధ్వనియని పేరు. ఈ ప్రబంధ ధ్వని విషయము మహోత్తాలమైన కొలది ప్రధానముగా కవి మహాకవి యగుచున్నాడు" అని విశ్వనాథ వివరించారు. అందువల్లే ఇతణ్ణి చాలా మంది అనంతర కవులు పద్య రచనా విధానంలో పూర్తిగా అనుసరించారు. నరకాసుర వధ వృత్తాంతంలో సత్యభామ యుద్ధం చేస్తూండగా నాచన ఆమెను ఇలా వర్ణించాడు:

మ. అరిజూచున్ హరిజూచు జూచుకములందందంద మందార కే
సరమాలా మకరంద బిందు సలిలస్యందంబులందంబులై
తొరుగం, బయ్యెదకొం గొకింత దొలగన్ దోర్త్రో శరాసారమున్
దరహాసామృతపూరముం గురియుచుం దన్వంగి కేళీగతిన్
(హరివంశం – 1 – 162)

– ఇదే ఘట్టంలో తన భాగవతంలో బమ్మెర పోతన ఇలా అనుకరించారు:

మ. పరుజూచున్ వరుజూచు నొంప నలరింపన్ రోష రాగోదయా
విరత భ్రూకుటి మందహాసములతో వీరంబు శృంగారమున్
జరగన్ గన్నుల గెంపు సొంపు బరగన్ జండాస్త్ర సందోహమున్
సరసాలోక సమూహమున్ నెఱపుచున్ జంద్రాస్య హేలాగతిన్
(భాగవతం – 10 – ఉత్తర – 178)

నాచన క్రమాలంకారాన్ని సైతం పోతన అందంగా అనుసరించాడు. రచనాశిల్పపరంగా 'సంవిధాన చక్రవర్తి' అనే బిరుదు నాచన సోమునికి సార్థకమవుతుందని విశ్వనాథ వ్యాఖ్యానించారు. అత్యంత దుష్కర ప్రాసను వాడి కంద పద్యానికే వన్నె తెచ్చిన విధానం "ప్రాగ్జ్యోతిషంబు గదిసి దృగ్జ్యాంట కృతులు లేక దితిజుల మీదన్ దృగ్జ్యోత్స్న జేవురింపగ దిగ్జ్యాగగనాంతరంబు దివురగ నార్చెన్" (1-143) అనే దాంట్లో మనకు కనపడుతుంది.

పురాణ అంశాన్ని తాత్త్విక దశలోకి తీసుకెళ్ళి, శివకేశవుల్ని పోలుస్తూ, ఛేకానుప్రాసం, విషయం, అంత్యానుప్రాసాలంకారాలలో ఒక విచిత్రమైన సీస పద్యాన్ని రాసాడు సోమన (2-180). పెంచడం, తుంచడం హరిహరులు ఇద్దరూ సమానంగా చేస్తున్నారని చెప్పాడు:

అభ్రంకషంబైన ఆలపోతు నితండు త్రుంచినాడీతండు పెంచినాడు
సాధుసమ్మతముగా సామజంబు నితండు కాచినాడీతండు త్రోచినాడు
బర్హిర్ముఖార్థమై పర్వతేశు నితండు తాల్చినాడీతండు వ్రాల్చినాడు
ఫణ పరంపర తోడి పన్నగేంద్రునితండు మెట్టినాడీతండు చుట్టినాడు
నేడు నాడును నాడును నేడు మనకు చూపచెప్పంగ చెప్పంగ చూపగలిగె
ననుచు కొనియాడ సంయమిజనుల కొదవె రజతగిరి మీద
హరిహరారాధనంబు

–కృష్ణుడు వృషభాసురుణ్ణి చంపాడు. కాగా, శివుడు ఎద్దును పెంచి వాహనంగా చేసుకున్నాడు. హరి ఏనుగును రక్షించాడు. ఐతే, శివుడు గజాసురుణ్ణి వధించాడు. విష్ణువు దేవతల కోసం కూర్మంగా పర్వతాన్ని మోసాడు. శివుడు మాత్రం త్రిపురాసురుల సంహారంతో మేరుపర్వతాన్ని విల్లుగా చేసుకుని, దాన్ని వంచాడు. హరి పామును పాన్పుగా చేసుకుంటే హరుడు మెడకు చుట్టుకున్నాడు. నాడూ నేడూ వీటిని కథలుగా విన్నాం – ఇప్పుడు చూస్తున్నాం – అని శివ కేశవుల సమాగమంలోని పద్యం.

సీసపద్య రచనకు శ్రీనాథుణ్ణి ఎంతో స్తుతిస్తారు కాని, నాచన సోముడి రచనాశిల్పం అగ్రగణ్యమని తోస్తుంది (శ్రీనాథుడు క్రీ.శ.1370 ప్రాంతంవాడు). పద్యాల్లో సారస్వతం కన్నా చమత్కారమే ఎక్కువగా ఆయన సాహిత్య ధర్మంగా మారింది అనవచ్చు. వక్రోక్తికి ఉదాహరణగా ఒక గొప్ప పద్యం మనకు రెండో ఆశ్వాసంలో తటస్థిస్తుంది (176):

సీ. కుజము కుంజరముచే కూలునో కూలదో? కూల్చు కుంజరము
నీ కుజము గూల్చె
మ్రాను పేరేటిచే మడుగునో మడుగదో? మడుచు పేరేటి
నీ మ్రాను మడచె
కాలునో కాలదో ఒకనిచే సాలంబు? కాలు నీ సాలంబు కాల్చె నొకని
తునియునో పరశుచే తునియదో వృక్షంబు? తునియు
నీ వృక్షంబు తునిమె పరశు

గీ. వనుచు తమలోన చర్చించు అమర వరుల కభిమతార్థ
ఫలార్థమై ఉండవచ్చు
పారిజాతంబు నా మ్రోల పండియుండ నంద గంటి నా కోర్కెల నంద గంటి

– ఇక్కడ పునరుక్తులైన శబ్దాలతో అర్థభేదం కల్పించి క్రీడ సల్పాడు సోమన. "లోకంలో ఏనుగు చెట్టును కూలుస్తుందో లేదో కాని, ఈ వృక్షం (శివుడు) గజాసురుణ్ణి కూల్చేశాడు. పెద్ద నది చెట్టును చుట్టేస్తుందో లేదో కాని, ఈ చెట్టు (శివుడు) గంగను తలలో చుట్టేశాడు. ఒకడి వల్ల చెట్టు కాలుతుందో లేదో కాని, కాలుడు (శివుడు) మన్మథుణ్ణి కాల్చేశాడు. గొడ్డలి చెట్టుని నరుకుతుందో లేదో కాని, శివుడు పరశువు అనే దైత్యుణ్ణి నరికేశాడు." దేవతలకు ఆయన ఫలవృక్షం కదా! అందుకే ఇక్కడ శివుణ్ణి వృక్షంతో పోల్చాడు.

ఉత్తర హరివంశం ఒక లోకోత్తర కావ్యం. కొద్దిపాటి కథలతో ప్రబంధ రచన చేయడం నాచన సోముడితోనే మొదలైంది. అయిదు కథల్లోని అంతరార్థాన్ని వివరించడంలో ఆయన మహాశిల్పాన్ని కనబరిచాడు. ప్రతి పద్యంలో శబ్దాలంకారమో చమత్కార వర్ణనో, పాండితీ శౌర్యమో మనకు గోచరిస్తుంది. మనసుకు హాయిని కలిగిస్తాయి సోముని పద్యాలు.

నాచన సోముడికి క్రమాలంకారం ఇష్టమని ఎన్నో పద్యాల వల్ల తెలుస్తుంది. అలా రాస్తూనే, చమత్కారాన్నీ, విరోధాభాసనీ ప్రదర్శిస్తాడు. మచ్చుకి:

పన్నగంబులరాజు పగవాడు కూడి నీ శయనంబు పయనంబు సంతరింప
దుగ్ధ వారాశి కూతురు అలు కూడి శరణంబు చరణంబు సవదరింప
తామర పగవాడు దయితుండు కూడి నీ బడిచూపు కుడిచూపు పరిఢవింప
చందురు చెలికాడు సయిదోడు కూడి నీ ఉల్లంబు మొల్లంబు ఉపచరింప
కంపమాన మనోధ్యానగతుల మానకేకతంబున్న మునులకు ఏకతంబు
లేక పొడగాన వచ్చు నీ లీల కాన అన్యులేనాట ధన్యులే అంబుజాక్ష!

మునులు కృష్ణుణ్ణి స్తుతించే పద్యం ఇది. ఇందులో శబ్దాల్ని ఒక ఆట ఆడించాడు సోమన. యథాసంఖ్యాలంకారంతో అలంకరించాడు. దీని భావం ఇది– "శత్రువులైన సర్పరాజు, గరుత్మంతుడు నీకు పాన్పు వాహనం అయ్యారు. తల్లీ కూతుళ్లైన లక్ష్మి, గంగ నీ వక్షస్థలాన్ని పాదాల్ని ఆశ్రయించారు. విష్ణువుకు సూర్యచంద్రాదులు కళ్లు. రెండింటికీ పడని తామరలు, కలువలు నీ చూపులు అయ్యాయి. మన్మథుడు, కౌస్తుభం నిన్ను సేవిస్తున్నాయి– రెండూ తోబుట్టువులు. నీ లీలలు ధ్యానించే మునులకు నిర్హేతుకంగా ఇలా తోస్తున్నాయి."

సుకుమార మధుర శైలితో మనల్ని అలరించే నాచన సోముడిని ఆలంకారికులు, లాక్షణికులు ఎన్నో విధాలుగా శ్లాఘించారు. అయితే, రావాల్సినంత కీర్తిప్రతిష్ఠలు ఆయనకు రాలేదు. వస్తుకళ, సమకాలీన జీవన చిత్రణ, శబ్దార్థాల చిత్రరచన వున్న 'ఉత్తర హరివంశం' అసంపూర్తిగా వుండటం దీనికి కారణం కావచ్చు. కాగా, సాహిత్యోపాసకులు, భాషాభిజ్ఞులు తప్పక చదవాల్సిన కావ్యం ఇది.



ఉత్తర హరివంశం ఒక లోకోత్తర కావ్యం. కొద్దిపాటి కథలతో ప్రబంధ రచన చేయడం నాచన సోముడి తోనే మొదలైంది. సోమన ప్రతి పద్యంలో శబ్దాలంకారమో చమత్కార వర్ణనో, పాండితీ శౌర్యమో మనకు గోచరిస్తుంది. సోమన రాసిన 1487 సద్యాల్లో సామెతలు, జాతీయలు, పలుకుబళ్ళు మనకు బళ్ళనిండా దొరుకుతాయి.

■ అప్పరుసు విజయ రామారావు
✆ 91770 86363

వాక్యం ఒక విత్తనాల మూట

ఎవరు రాసిన వాక్యాలో?
అద్భుతమైన శక్తివంతమైన వాక్యాలు,
ఎక్కడ ఎవరు రాస్తే మాత్రం?
ఏ సిరాతో రాస్తే మాత్రం?
వరుసలు వరుసలుగా కవాతు చేసే వాక్యాలు,
అడుగుల్లో పిడుగులు ధ్వనించే అరుదైన వాక్యాలు,
పగిలిన పాదాల కింద మెత్తని
పచ్చగడ్డి పరుపుల్లాటి వాక్యాలు,
పిల్లగాలి లాలిపాటలకు అలలు అలలుగా
ప్రవహించే నారుమళ్ళలాటి వాక్యాలు,
వానాకాలపు వరదలప్పుడు ఎగిసిపడే
నాగావళి కెరటాల్లాటి వాక్యాలు,
ఎప్పుడు ఏ కలంతో రాస్తే మాత్రం?
ఏ గుండెల్లో ఐతేనేం? ఏ బండల్లో ఐతేనేం?

+++

అక్షరాల పుట్టుక కుట్ర కాదు
పదాలు ప్రాణగీతాలు కావడం కుట్ర కాదు,
అక్షరాలు పదాల్లో ఒదగడమూ కుట్ర కాదు,
పదాలు వాక్యాలు వాక్యాలుగా ప్రవహించడం
కుట్ర కానే కాదు,
వాక్యరహిత సమాజాన్ని ఊహించడమే అసలు కుట్ర.

+++

చీకటి గుండెల్లో మండే సూర్యుడై ప్రకాశించాలనే
తపన పడుతుంది ప్రతిసిరాచుక్కా,
పదంలో పదం కలిపి కదంతొక్కి
నినాదమైన వాక్యాన్ని ప్రేమించనిదెవరు?
అమితమైన విద్వేషాన్ని గుండెలో నింపుకున్నవాడు తప్ప.

ఎత్తుపల్లాల్ని సరిచేసి హృదయకేదారాల్లో
పాటల పంటలు పండించాలనుకునే వాక్యాల్ని
ముక్కలు ముక్కలుగా నరికి, ఉక్కుపాదాల కింద నలిపి,
వికటాట్టహాసం చేసే కుట్రదారులెప్పుడూ ఉంటారు,
అక్షరాలెక్కడైనా మిగిలివుంటే అవి
ప్రశ్నలకొడవళ్ళై కళ్ళముందు వేలాడుతాయని
వాటిని చీకటిగుహల గోడలకు వేలాడదీసి
ఆనందిస్తుంటారు,
అక్షరాల్లేని కాలాన్ని కలగంటుంటారు.

ప్రశ్నలై కళ్ళకడ్డంపడే వాక్యాల్ని తునాతునకలు చేసి,
ఏకచత్రచ్ఛాయలో నిశ్చింతగా నిద్రపోవాలని
కొందరి ఆశ కావొచ్చు,
అక్షరరహిత సమాజాన్ని స్వప్నిస్తూ
వాక్యాల్ని చుట్టచుట్టి నేలపొరల్లోకి నెట్టేస్తూ
సాధించిన దానికి సంబరపడొచ్చు,
కెరటాలై ఎగిసిపడే వాక్యప్రవాహాల్ని ఎవరైనా
ఏ ఎడారుల్లో ఇంకింప జేయగలరు?
వాక్యాల్ని నిషేధించి అదృశ్యమైపోయినవారే గానీ
చిగుళ్ళు చిక్కినా, వేళ్ళు తెగనరికినా
వాక్యాలు మాత్రం చిగురిస్తూనే ఉంటాయి,
రాలిపడిన అక్షరం వాక్యాలుగా మొలకెత్తడం
సహజాతిసహజం.

అక్షరమంటే జీవం తొణికిసలాడే విత్తనం,
వాక్యం నిలవచేసిన విత్తనాల మూట
వాక్యం ఒక ముగింపు లేని పాట.

■ లాంగుల్య

నా మొదటి పుస్తకం

జ్వర లాలస లాంటి మైకాన్ని ఇచ్చిపోయింది!

రఘు

కవిత్వం లలిత సంగీతంలా అందరికీ అర్థం కావాలని తీర్మానించే మనుషుల్ని చూసి నవ్వుకోవటం, వాళ్ళను కవ్విస్తూ మరింత గాఢంగా రాయటం సరదా నాకు. వాక్యానికి వాక్యానికి మధ్య చీమలా దూరి పదాలను కొరకటంలోని మజా గుజ్జుమామిడి తిన్నా రాదని, పొడి వచనంతో కవిత పలచపడుతుందని నమ్ముతాను. అలా అని ప్రబంధ భాష కూడా వాడను. చకోరాలు, పక్షుల సంగీతాలు, పరిమళ జ్ఞాపకాలు నాకు వస్తువులు. వాటికి ఉద్వేగాలు జోడించి రాసుకుంటాను. దానికి సరిపోయే భాషనే వాడాలనుకుంటాను. ఈ నేపథ్యంతో నేను తెచ్చిన మొదటి కవితా సంపుటి 'ఒక స్వాప్నికుడి శ్వేత సంతకం'.



1997 జూన్ నెలలో జ్ఞాన్ బాగ్ వెళ్ళినప్పుడు నా పొయెట్రీ నోట్‌బుక్ శేషేంద్ర శర్మ గారి టీపాయ్ మీద పెట్టి, "దీనిని అచ్చేయమంటారా లేదా నిష్కర్షగా చెప్పండి," అన్నాను. అకవిత్వానికి ఆయన బద్ధశత్రువు కనుక అంతంత మాత్రంగా ఉంటే కవితల్ని తిరగరాయమని అడుగుతాడని తెలుసు. ఏ వాక్యమూ మార్చాల్సిన అవసరం లేదనుకున్నారేమో వారం తరువాత 'స్వాప్నికుడి జెండా' అనే టైటిల్‌తో ముందుమాట రాసి పంపారు. ఇలా: "ఆపాద మస్తకమూ భావావేశ విద్యుల్లతలు పాకుతున్న వ్యక్తి నుండి ఝుంఝూ మారుతంలా వీచే మాటలే పుడతాయి. అవి గొర్రె మందల్లాంటి మాటలుగా ఎప్పుడూ ఉండవు. రసోన్మిశ్రితంగా, శ్రోతల్ని చకచ్చకితులను చేసే అనుపమాన శక్తియుక్తాలై ఉంటాయి. ఎంత అద్భుత శక్తి ఉందో రఘు గొంతులో! ఆయన కవిత మనల్ని వశీకరించుకునే సాంద్ర చంద్రిక."



నా పొయెట్రీ నోట్‌బుక్ శేషేంద్ర శర్మ గారి టీపాయ్ మీద పెట్టి, "దీనిని అచ్చేయమంటారా లేదా నిష్కర్షగా చెప్పండి," అన్నాను. అకవిత్వానికి ఆయన బద్ధశత్రువు కనుక అంతంత మాత్రంగా ఉంటే కవితల్ని తిరగ రాయమని అడుగుతాడని తెలుసు.

ఆ ఉత్తరం నా అంతర్లోకాల్లో రేపిన తుఫాను నుండి తేరుకునేందుకు చాలా కాలం పట్టింది. శేషేంద్ర శర్మ అభిప్రాయం చెప్పకుంటే అచ్చు జోలికి పోయేవాడ్నే కాదు.

అప్పటికి ఖమ్మంలో జూనియర్ లాయర్‌ని. పావలా బేడా పోగేసుకొని బెజవాడ పోయి కవర్ పేజీకి బొమ్మేయమని బాలి గారిని అడిగాను. గంట తర్వాత ఆయన గీసిన ముఖచిత్రం చూసి కృతజ్ఞతతో చేతులు పట్టుకొని నొక్కినప్పుడు, "ఉద్వేగాలు బాగా పట్టుకుంటారు మీరు. దానినే బొమ్మ చేసే ప్రయత్నం చేశాను," అని మెచ్చుకున్నారు. కట్ చేస్తే ఆగస్ట్ 17. జిల్లా గ్రంథాలయంలో జ్వాలాముఖితో పుస్తకవిష్కరణ. వెన్నెల సొనకు పరవశించే రఘు కవిత్వానికి లావా లాంటి జ్వాలాముఖితో ఆవిష్కరణ సరిపడదని మిత్రులు పెదవి విరిచినా పట్టుపట్టి పిలిచాను. ఆ రోజు జ్వాలాముఖి ఉపన్యాసంలో శుద్ధ కవిత్వ ప్రేమికుడిని చూసింది ఖమ్మం. 70వ దశకంలో ఆయన ఉపన్యాసాలు విని ఉగ్రూత లూగిన తరం ఆ సభ లోనే ఉంది. వాళ్ళ ఎఱ్ఱ చొక్కాలకు, ఉద్యమ గీతాలకు జ్వాలాముఖి రెండో పార్శ్వం తెలీదు.

"ముడుచుకున్న మునివేళ్ళ కలం తంత్రులు బిగించాను కాలం పొత్తిళ్ళపై కొత్తగీతం రాద్దామని," వంటి నా పంక్తుల్ని ఉటంకిస్తూ నడిచింది సభ. ఆ తరువాత ఇంకో తొమ్మిది పుస్తకాలు వచ్చినా, వాటి గురించి వక్తలెంత గొప్పగా మాట్లాడినా మొదటి సభలోని తాజాదనం ఎప్పటికీ ప్రత్యేకం.

కొన్ని రోజుల్లో బోలెడు సమీక్షలు..! "ఇతని కవిత్వ శరీరం నిండా మెరుపులు గుబాళిస్తాయి. విరుపులు తళుక్కున మెరుస్తాయి. కొత్త కొత్త పదబంధాలు, భావగంధాలు అత్తరు వాసనలతో ప్రభాసిస్తాయి. ఈ కవిది నిజంగా అభివ్యక్తిలో కొత్త జెండా!" అని మెచ్చుకున్నారు నాగ భైరవ.

"రఘు అద్దం లాంటి కవి. పూలతీగ లాంటి కవి. అతనిలో ప్రతి క్షణాన్నీ కళాత్మకం చేసే కళాకారుడున్నాడు. ప్రపంచం లోని గొప్ప కవుల ఊహల్తో సమానమైన ఊహలు ఆయన చేశాడు," అని రాశారు సౌభాగ్య.

నా కవిత్వ జీవితానికి పునాదులు వేసిన శేషేంద్ర శర్మ గారికి మొదటి ప్రతిని భక్తితో సమర్పించుకున్నాను. ఒక జ్వర లాలస లాంటి మైకాన్ని ఇచ్చిపోయింది నా మొదటి సంపుటి.

✆ 96761 44904

చదువు ముచ్చట

"కవి అక్షరాల్లో పాఠకుడు దృశ్యాన్ని చూడగలగడం గొప్ప అనుభూతి"

జాబేర్ పాషా



మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

ఒక పుస్తకం అని చెప్పలేను కానీ, నిజానికి బాల్యం నుండే నాలో పుస్తక పఠనంపై అమితాసక్తిని పెంచింది మాత్రం వివిధ పత్రికల సండే మ్యాగజైన్స్. ఏ ఒక్క మ్యాగజైన్‌నూ విడిచి పెట్టకుండా చదివేవాడిని. అందులో వచ్చే కథలను కట్ చేసి దాచిపెట్టుకునే వాడిని. టీనేజ్‌లో యండమూరి 'యుగాంతం' నవల చదవడం గుర్తుంది. నేను అత్యంత ఇష్టంగా చదివిన మొదటి నవల అదే. ఆ నవలలోని పాత్రలూ సన్నివేశాలూ ఇంకా గుర్తున్నాయి. ఆ నవల చదివి 'ప్రాక్సిమా సెంటారీ' అనే నక్షత్రం గురించి అప్పటి మా స్కూల్ టీచర్ సుజాత నాంపల్లి (కవయిత్రి) గారిని అడిగి తెలుసుకున్న జ్ఞాపకం ఇప్పటికీ మెదులుతుంది.

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?


టీనేజ్ కథలు, నవలలు విరివిగా చదివే అలవాటుండేది. ఎప్పుడైతే కవితలు రాయడం మొదలయ్యిందో నన్ను నేను ఇంకాస్త సానబెట్టుకునే క్రమంలో, సమకాలీన కవులు కవిత్వాన్ని రాసే విధానాన్ని గమనిస్తూ, వస్తు ఎంపిక, శైలి, వాక్య నిర్మాణం ఇలాంటి వాటిపై అధ్యయనానికి ఉపయోగపడే పుస్తకాలను ఎక్కువగా చదువుతున్నాను.

ముస్లిం అస్తిత్వవాద కవిత్వపరంగా మీపై ఉన్న ప్రభావాలు ఏమిటి?

ఖాదర్ మొహియుద్దీన్ 'పుట్టుమచ్చ' కవితా సంపుటి నుంచి ఇటీవల స్కై బాబా సంపాదకత్వంలో వచ్చిన 'దర్ద్' సంకలనం వరకూ అనేక విపత్కర పరిస్థితుల్లోనూ అణచివేతపై తిరుగుబాటుగా రావాల్సిన మేరకు సాహిత్యం వచ్చిందనే భావిస్తున్నాను. నేను కవిత్వం రాసే ప్రారంభ దశలో ఈ ప్రభావం నాపై చాలా ఉండేది, ఆ స్ఫూర్తి తోనే 'నాపై ఎందుకీ కక్ష..?', 'బహిరంగ రహస్యం' లాంటి కవితల్ని రాయగలిగాను. ముస్లిం అమ్మలపై ప్రముఖ కవి అన్వర్ సంపాదకత్వంలో వచ్చిన 'అమ్మీజాన్' అనే ముస్లింవాద కవిత్వ సంకలనానికి ప్రేరణ నా కవిత 'అమ్మీజాన్' అని తెలిసినప్పుడు, ఆ విధంగా నేనూ ఎంతోకొంత ముస్లిం వాద కవిత్వంలో భాగమైనందుకు ఆనందంగా అనిపిస్తుంది. కానీ వివక్షను ఎండగడుతూ, పీడకుల్ని వ్యతిరేకించడ తోనే సమాజంలో సామరస్యాన్ని నెలకొల్పలేం అనే విషయం త్వరగానే అవగతమైంది. మతాల మధ్య సఖ్యత, మనుషుల మధ్య మమకారాలు చిగురించాలంటే భయాలు, అభద్రతను పక్కకునెట్టి, విద్వేషగాలులు ఎప్పుడూ లేనంత బలంగా వీస్తున్న ఈ తరుణంలోనూ అస్తిత్వాన్ని నిలుపుకుంటూనే, సమాజంలో సోదర భావాన్ని, లౌకికత్వాన్ని పెంచే దిశగా కలాలు కదలాల్సిన సందర్భమిది.

రీసెంట్‌గా ఏ పుస్తకాన్ని చదివి ఇష్టపడ్డారు?

కవికుల గురువు కె. శివారెడ్డి సర్ రాసిన 'ode to love అను ప్రేమ గీతం' అనే కవితా సంపుటి అమితంగా ఆకట్టుకుంది. మనసుల్ని ప్రేమతో ఎలా జయించవచ్చో, భుజం మీద చెయ్యేసి పక్కనే నడుస్తూ బోధించినట్టనిపించిన గొప్ప సందేశాత్మక కవిత్వం. అలాగే ఈ మధ్య కాలంలో నాగిళ్ళ రమేష్ అన్న రాసిన 'నల్లకొడిసె వన్నెకాడు' అనే కవితా సంపుటి కూడా బాగా నచ్చింది. కనుమరుగవుతున్న పల్లె పదాలను, మట్టి మనుషులు మాట్లాడుకునే స్వచ్ఛమైన యాసను సజీవంగా ముందు తరాలకు అందించే ప్రయత్నం ఈ పుస్తకం ద్వారా జరిగింది.



ఏ తరహా కవిత్వం మీకు నచ్చుతుంది? మీరు ఎక్కువసార్లు చదువుకున్న కవిత్వ సంపుటి?

తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని సునిశితంగా పరిశీలిస్తూ, ప్రతిస్పందనగా తన భావోద్వేగాలను సృజనాత్మకంగా ప్రకటించే సందర్భంలో కవి రాసిన అక్షరాల్లో పాఠకుడు దృశ్యాన్ని చూడగలగడం ఒక గొప్ప అనుభూతి. అలాంటి కవిత్వానికి నేను త్వరగా ఆకర్షితుడినవుతాను. సరళమైన పదాల్లోనే లోలోపలి సంఘర్షణను తాత్వికంగా వ్యక్తపరిచే కవిత్వంతో పాటు, చూస్తున్న, అనుభవిస్తున్న జీవితాలను లయాత్మకంగా వర్ణించగలిగే కవిత్వం నాకు బాగా నచ్చుతుంది.

సుంకర గోపాలయ్య 'మా నాయిన పాట' పుస్తకాన్ని ఎక్కువసార్లు చదివిన జ్ఞాపకముంది.

మీరు తరచు మననం చేసుకునే కవిత్వ పంక్తులు?

ఈ ప్రశ్న చదివిన వెంటనే మదిలో మెదిలిన కవిత– అఫ్సర్ రాసిన 'అసమ్మతి వాచకం'. ఐదున్నరేళ్ళ క్రితం 'వివిధ'లో అచ్చయిన ఈ కవితను కట్ చేసి పేపర్ ముక్కను నా పర్సులో దాచుకున్నాను. కాస్త నిరుత్సాహంగా అనిపించిన ప్రతిసారీ ఈ కవితను తీసి చదువుకోవడం అలవాటు. ఐదు భాగాలుగా సాగే ఈ కవిత, జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా మొండిగా బతికి, విజయాన్ని సాధించాలనే కాంక్షను రేకెత్తిస్తుంది. కవితలోని ఈ వాక్యాలు తరచుగా గుర్తొస్తూ ఉంటాయి: "నడుస్తూ, నడుస్తూ పడిపో, దెబ్బ తగల్నే లేదని సంతోషిస్తూ కూర్చోకు, ఇంకాసింత దూరం నడిచి ఈసారి కచ్చితంగా దెబ్బ తగిలేట్టే పడిపో.. పడిపోవడంలోని భయం అనేదొకటి ఉందే, దాని కళ్ళల్లోకి పది చూపుల బాణాలు వదులు."

(జాబేర్ పాషా తొలి కవితా సంపుటి 'అగరు ధూపం, ఊదు పొగ' ఇటీవల విడుదలైంది)

✆ 95730 43596

శరణు శరణు బీరన్న!!

- ఉర్సు, కరీమాబాద్‌లో ఘనంగా బోనాల పండుగ
- ఆకట్టుకున్న డిల్లెం-బల్లెం నృత్య, ఖడ్గ విన్యాసాలు
- 'గావు' తంతు చూసేందుకు ఎగబడిన భక్త జనం
- హాజరైన పలువురు రాజకీయ ప్రముఖులు

7



గావుపట్టిన గొర్రె మీది నుంచి దాటుతున్న మహిళలు



కరీమాబాద్‌లో బోనాల వేడుకలను తిలకిస్తున్న ప్రజలు



ఖిలావరంగల్‌లో పీరీల వేడుకలను తిలకిస్తున్న ప్రజలు

కోటలో పీరీల సందడి

- ఊరేగించిన ముస్లిం యువకులు
- పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, మేయర్ సుధారాణి

7



కేయూ ఆడిటోరియం స్టేజీపై ఏర్పాట్లను చూస్తున్న అధికారులు

పట్టాభిషేకానికి సర్వం సిద్ధం

7

- నేడు కేయూ 23వ స్నాతకోత్సవం
- హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ముస్తాబైన క్యాంపస్ ఆడిటోరియం
- భారీ ఎత్తున ఏర్పాట్లు చేసిన అధికారులు
- పకడ్బందీగా పోలీసుల బందోబస్తు



పట్టాల పండుగకు కాకతీయ విశ్వవిద్యాలయం ముస్తాబైంది. 23వ స్నాతకోత్సవానికి వర్సిటీలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం ప్రారంభమయ్యే కాన్వకేషన్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరై పట్టాలు, బంగారు పతకాలు అందజేయనున్నారు. ఆయనతోపాటు ముఖ్య అతిథిగా సీఎస్ఐఆర్ - ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాసరెడ్డి హాజరుకానున్నారు. కాగా, కేయూలోని 8 విభాగాల్లో 2020 నుంచి 2025 జూలై అఖరు వరకు డాక్టరేట్ సాధించిన 387 మందికి డాక్టరేట్‌లు అందిస్తారు. అలాగే 2015-16 నుంచి 2020-21 ఆరేళ్లకాలంలో 373 మందికి 564 బంగారు పతకాలను అందచేస్తారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో క్యాంపస్‌లో భారీ బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేశారు. - ఆంధ్రజ్యోతి, కేయూ క్యాంపస్



- కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్న సమస్యలు
- పరిష్కరించడంలో పాలకవర్గం, అధికారుల ఉదాసీనత
- నేడు గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశం
- ఈ సారైనా సుదీర్ఘ చర్చ జరిగేనా?



నగరాభివృద్ధికి నడుం బిగిస్తారా?!

వరంగల్ కార్పొరేషన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మహానగర ప్రజల సమస్యలు ఎక్కడివక్కడే ఉంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఖర్చు చేయడంలో పాలకవర్గం, అధికారులు అలసత్వం వహిస్తున్నారు. పరిష్కారం కోసం ఏర్పాటు చేసే కౌన్సిల్ సమావేశం తూతూ మంత్రంగా సాగుతోందనే విమర్శలున్నాయి. ముందస్తుగా అనుకున్న అంశాలను ప్రవేశ పెట్టి ముగిస్తున్నారనే అపవాదు ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం జరిగే గ్రేటర్ కౌన్సిల్ సమావేశంపై నగర ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కౌన్సిల్

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యుఎంసీ) కౌన్సిల్ సమావేశం సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కొత్త కౌన్సిల్‌హాల్‌లో జరుగనుంది. ఇందు కోసం అధికారులు అన్ని ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. కౌన్సిల్ సమావేశంలో మేయర్‌తోపాటు మంత్రి, ఎక్స్ అఫీషియో సభ్యులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతోపాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు పాల్గొననున్నారు. ఈ మేరకు బల్దియా అధికారులు ఐదు రోజుల ముందుగానే సభ్యులకు సప్లమెంటరీ ఎజెండా నోటీసులు జారీ చేశారు. ఉదయం 11.30గంటలకు బల్దియా కార్యాలయంలో నగరం మేయర్ గుండు సుధారాణి అధ్యక్షత కౌన్సిల్ సమావేశం జరుగనుంది.

అంశాలు ఇవే..

ప్రస్తుత సర్వసభ్య సమావేశంలో వరంగల్ నగర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలు ప్రస్తావించే అవకాశాలున్నాయని గ్రేటర్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ సారి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల పునర్నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, శానిటేషన్ పురోగతి, వర్షాకాల ప్రణాళిక, వరద ముంపు ప్రాంతాల గుర్తింపు, స్మార్ట్‌సిటీ పనులు, ఓనర్ కండ్రైవర్ల జీతాలపై చర్చ జరుగనుందని విశ్వసనీయ సమాచారం. ఇంకా ప్రజారోగ్య విభాగం అన్నపూర్ణ పథకం ద్వారా అందించే రూ.5 భోజనం కొనసాగింపు, వరద బాధితులకు సహాయంపై

(మిగతా 6వ పేజీలో...)

నకిలీ విత్తనాలు అంటగడితే కఠిన చర్యలు

- నష్టపోయిన రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- నేడు ములుగు జిల్లాలో పరిహార చెక్కుల పంపిణీ
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు నకిలీ విత్తనాలు అంటగడితే ఊరుకునేది లేదని, విత్తన సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు సుంకెట అన్వేష్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు చేరుకున్న అన్వేష్‌రెడ్డికి కాంగ్రెస్ కిసాన్ సెల్ వరంగల్ అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలను కొని నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ములుగు జిల్లాలో మొక్కజొన్న సాగుచేసిన రైతులు నకిలీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోతే ప్రభుత్వం తరఫున విత్తన కంపెనీల యజమానులతో మాట్లాడామన్నారు. ఈ మేరకు సోమవారం 658మంది రైతులకు రూ.3 కోట్ల78లక్షల చెక్కులను వాజేడులో అందించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రి సీతక్క హాజరవుతున్నట్లు తెలిపారు.



హరితహోటల్‌కు చేరుకున్న అన్వేష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 18 నెలలకాలంలో రైతుల సంక్షేమానికి రూ.1 లక్షా 4వేల కోట్లు ఖర్చు చేసిందని అన్వేష్‌రెడ్డి తెలిపారు. నకిలీ విత్తనాలను నిర్మూలించేందుకు ప్రభుత్వం రైతు రక్షణ కమిషన్ ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. గత ప్రభుత్వంలో రైతుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, ఒక్క రైతు భరోసా ఇచ్చి అన్ని సబ్సిడీలను ఎత్తివేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సబ్సిడీలతోపాటు రైతు భరోసా, రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయాలు జరిగితే విత్తన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలో మిర్చి రైతులు, నాగర్‌కర్నూల్ జిల్లాలో పల్లీ రైతులు, గద్వాలలో పత్తి రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోతే ప్రభుత్వం పరిహారం అందించిందని గుర్తు చేశారు.

రైతు రక్షణ కమిషన్ కమిటీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు. కొంత మంది రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నారని, అలాంటి వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ఈ సమావేశంలో రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గడుగు గంగాధర్ అన్నారు.

క్రీడలకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద పీట

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- సందడిగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు
- రాష్ట్ర వ్యాప్తంగా 581 మంది అథ్లెట్లు హాజరు

6



60మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న అథ్లెట్లు

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు



విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. రెండు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టూ ఆల్ బాలబాలికల విభాగంలో నిర్వహించిన చెస్ పోటీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 112 మంది బాలబాలికలు పాల్గొన్నారని క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల మధ్య జరిగిన పోరులో ఎత్తుకు పైఎత్తులు వేస్తూ విజయం సాధించడానికి అహర్నిశలు శ్రమించి పలువురు క్రీడాకారులు విజయాన్ని సొంతం చేసుకొని బహుమతులను సాధించారు. గండు రిత్విక్, దారా సాయినివాస్, జె.రంజిత్, నిక్కి ప్రహర్షలు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజయాన్ని సొంతం చేసుకొని త్వరలో ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ సీహెచ్.శ్రీనివాస్, రజనీకాంత్, ఫ్రాంక్లిన్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి గ్రేటర్ ప్రజావాణి కార్యక్రమం రద్దు

వరంగల్ కార్పొరేషన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతీ వారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం అనివార్య కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. పరిపాలనా విధమైన కారణాల వద్ద ప్రజావాణి రద్దు చేస్తున్నామని, ప్రజలు గుర్తించాలని సూచించారు. వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని కమిషనర్ వెల్లడించారు.

వరంగల్ డ్యాన్సర్లకు ప్రత్యేక గుర్తింపు

● ఉమ్మడి వరంగల్ జిల్లా డ్యాన్సర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రశాంత్



సెలెక్షన్స్‌లో పాల్గొన్న సీనియర్ డ్యాన్సర్లు

వరంగల్ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సినీ ఇండస్ట్రీలో ఉమ్మడి వరంగల్ జిల్లా డ్యాన్సర్లకు ప్రత్యేక గుర్తింపు ఉందని అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రశాంత్ మాస్టర్ అన్నారు. ఆదివారం వరంగల్‌లోని న్యాచురల్ నవీన్ డ్యాన్స్ స్టూడియోలో మెంబర్‌షిప్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన డ్యాన్సర్లకు ఒక వేదిక అవసరమని, రాబోయే రోజుల్లో డ్యాన్స్‌పై ఆధారపడి జీవిస్తున్న వారికి ఆర్థికంగా అండగా ఉండడం కోసం ఈ వేదిక ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం సెలక్షన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ భరత్, కోశాధికారి సుభాష్, వైస్ ప్రెసిడెంట్ సందీప్, జాయింట్ సెక్రటరీ చంటితో పాటు సీనియర్లు, జూనియర్ డ్యాన్సర్లు పాల్గొన్నారు.

క్రీడలకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- సందడిగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు
- రాష్ట్ర వ్యాప్తంగా 581 మంది అథ్లెట్లు హాజరు



క్రీడల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక బడ్జెట్ కేటాయించడంతోపాటు క్రీడాకారులను ప్రోత్సహిస్తూ పెద్దపీట వేస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల అథ్లెటిక్స్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వతహాగా క్రీడాకారుడైన సీఎం రేవంత్‌రెడ్డికి క్రీడాకారుల కష్టాలు తెలుసన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికి తీసేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. క్రీడాకారులు పట్టుదల, క్రమశిక్షణతో సాధన చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి జిల్లాకు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల విభాగాల్లో ఒక్క రోజు నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలతో పాటు పలు అకాడమీలు, స్పోర్ట్స్ పాఠశాలల నుంచి 581 మంది అథ్లెట్లు పాల్గొన్నారన్నారు. అండర్-10, 12, 14 బాలబాలికలకు 60, 600 మీటర్ల పరుగు పందెం, కిడ్స్ జావెలిన్‌త్రో, స్టాండింగ్ బ్రాడ్ జంప్, ట్రైథ్లాన్ లాంగ్ జంప్, షాట్‌పుట్, హైజంప్, విభాగాల్లో పోటీలను నిర్వహించామన్నారు. కాగా, వివిధ జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్లు గెలుపే లక్ష్యంగా శ్రమిస్తూ పతకాలను కొల్లగొట్టారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ చైర్మన్ వరదరాజేశ్వర్‌రావు, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, ఉసిరికపెల్లి నిశాంత్‌రావు, పీడీలు వాసు, మనోజ్‌కుమార్, రజినీకాంత్, కోచ్‌లు, సీనియర్ అథ్లెట్లు తదితరులు పాల్గొన్నారు.

15, 17న విద్యుత్ సమస్యలపై లోకల్ కోర్టులు

రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 15, 17 తేదీల్లో భూపాలపల్లి, జనగామ సర్కిళ్లలో సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో లోకల్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎన్.వి.వేణుగోపాల్‌చారి తెలిపారు. 15న భూపాలపల్లి సర్కిల్‌లోని కాటారం సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న పలిమెల సబ్‌స్టేషన్‌లో, 17న జనగామ సబ్‌డివిజన్‌లోని బచ్చన్నపేట సబ్‌స్టేషన్ ఆవరణలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు లోకల్ కోర్టులు నిర్వహిస్తామన్నారు. విద్యుత్ సమస్య ఉన్న వినియోగదారులు లోకల్ కోర్టులో ఫిర్యాదుచేసి సమస్య పరిష్కరించుకోవచ్చని వేణుగోపాల్‌చారి తెలిపారు.

రైస్‌మిల్లు ఆపరేటర్ ఆత్మహత్య



సదానందం (ఫైల్)

హసన్‌పర్తి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి భరించలేక మనస్తాపంతో రైస్‌మిల్ ఆపరేటర్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం ఉదయం ఎల్లాపూర్ శివారు పెరవెల్లి వెంచర్‌లో వెలుగులోకి వచ్చింది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన బండి సదానందం అలియాస్ సదయ్య(44) - రజిత దంపతులకు ఇద్దరు సంతానం. ఇద్దరు పిల్లల్ని బీటెక్ చదివించారు. సదయ్య వర్ధన్నపేట మండలం ఇల్లంద రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతడు రెండు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆపరేటర్‌గా చేస్తున్నా వచ్చిన ఆదాయం సరిపోక ఆస్పత్రి ఖర్చులకోసం తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. ఈక్రమంలోనే శనివారం సాయంత్రం కడుపునొప్పితో బాధపడుతూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలోనే సదయ్య కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతుకుతుండగా ఎల్లాపూర్ శివారు పెరవెల్లి వెంచర్‌లో ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించినట్లు కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు వేణుప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించగా పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

● కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు టీరైల్వే జేఏసీ వినతి



కేంద్ర మంత్రి బండికి వినతిపత్రం ఇస్తున్న రైల్వే జేఏసీ నాయకులు

కాజీపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు 68 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కాజీపేటను రైల్వే డివిజన్‌గా ఉన్నతీకరించాలని కేంద్రమంత్రి బండి సంజయ్‌కు టీరైల్వే జేఏసీ వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్‌లోని మంత్రి బండి సంజయ్ నివాసంలో ఆదివారం రైల్వే జేఏసీ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో రైల్వే జేఏసీ పోరాటనికి రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా సహకరించడం వల్లే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం సాధ్యమైందని పేర్కొన్నారు.

కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభానికి ప్రధాని మోదీని జిల్లాకు తీసుకురావడానికి బీజేపీ ఎంపీలు, నాయకులు సహకారం ఉందన్నారు. ఇప్పటికే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం 80 శాతం పూర్తైందని, అందులో స్థానికులకు, భూ నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సికింద్రాబాద్ డివిజన్‌లో అత్యధికంగా లాభాలు తీసుకువచ్చే కాజీపేటను డివిజన్‌గా ఉన్నతీకరించాలని కోరారు. రైల్వే జేఏసీ కోరిన విషయాలను రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, ప్రధాని మోదీ దృష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి బండి సంజయ్ తెలిపారని రైల్వే జేఏసీ నాయకులు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు, నాయకులు పి.రమేశ్, నమిండ్ల మనోహర్, చిరువ్యాపారులు నాయకులు టోని, రాజు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ నరేశ్‌కుమార్

నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ దాడులు

వరంగల్ మెడికల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నకిలీ వైద్యులు, వైద్య కేంద్రాలపై తెలగాణ మెడికల్ కౌన్సిల్ శనివారం రాత్రి దాడులు నిర్వహించింది. హనుమకొండ గోపాల్‌పూర్, యాదవనగర్ ప్రాంతాల్లో నకిలీ వైద్యులు నడుపుతున్న కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో టీజీఎంసీ సభ్యుడు డాక్టర్ వి.నరేశ్‌కుమార్ నేతృత్వంలో డాక్టర్ అన్వర్‌మియా, యాంటీ క్వాకరీ చైర్మన్ డాక్టర్ కె.వెంకటస్వామి పాల్గొన్నారు. గోపాల్‌పూర్‌లోని సాదుల్లా మెడికల్ స్టోర్ నిర్వాహకుడు ఎం.డి.అక్బల్ షరీఫ్ అనే వ్యక్తి, అంజలి రెడ్డి క్లినిక్ పేరిట సీహెచ్.వెంకట్‌రెడ్డి, యాదవనగర్‌లో డి.క్రాంతికుమార్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరిట ఎలాంటి అర్హతలు లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్ మెడికల్ ప్రాక్టీషనర్‌గా పేర్కొంటూ క్లినిక్‌ను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేశ్‌కుమార్ మాట్లాడుతూ.. నకిలీ వైద్యులను నమ్మిమోసపోవద్దని సూచించారు. ఆర్ఎంపీలు, నకిలీ వైద్యులు ఇంజక్షన్లు వేస్తున్నా, మందులు రాసినా వెంటనే టీజీఎంసీ వాట్సాప్ నెంబరు 9154382727కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

కేంద్రియ విద్యాలయం ప్రొఫెసర్‌గా తిరుపతి



పర్వతగిరి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక కేంద్రియ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పర్వతగిరి మండలం కొంకపాక వాసి భూక్య తిరుపతి బాధ్యతలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తిరుపతి అంచెలంచెలుగా ఎదిగి కేంద్రియ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా తెలుగు శాఖలో పదోన్నతి పొందారు. ఇప్పటి వరకు తిరుపతి 8 పుస్తకాలు రచించి, ప్రచురించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. వివిధ అంశాలపై సాహిత్య పత్రికలలో 50 వరకు వ్యాసాలు, దాదాపు 100 వరకు జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పత్ర సమర్పణ చేశారు. భూక్య తిరుపతి పర్యవేక్షణలో ఇప్పటి వరకు ఏడుగురు విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తిచేశారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కమిటీలలో ఇప్పటి వరకు పని చేసి పలువురి మన్ననలు పొందారు.

ప్రాచీన దేవాలయాలను అభివృద్ధి చేస్తా

- నిధుల మంజూరుకు సీఎంతో మాట్లాడుతా..
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- వేయిస్తంభాల గుడిలో ఘనంగా తొలిఏకాదశి వేడుకలు



జ్యోతిప్రజ్వలన చేసి తొలి ఏకాదశి పూజలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమ దంపతులు

హనుమకొండ, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పురాతన దేవాలయాల పునరుద్ధరణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలందరితో మాట్లాడి వాటి పునరుద్ధరణకు తీసుకోవలసిన చర్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని, అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. హనుమకొండలోని వేయిస్తంభాల గుడిలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే నాయిని దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, ఉత్తిష్ఠ గణపతికి హరిద్ర, కుంకుమ విలేపనంతో అభిషేకం, అర్చనాదికాలు నిర్వహించారు. అనంతరం రుద్రేశ్వర స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకం జరిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, హనుమకొండ సీఐ శివరామక్రిష్ణ, ఆలయ ఈవో డి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. వేలాది భక్తులు ఆలయాన్ని సందర్శించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

నిట్ ప్రొఫెసర్లకు రూ.2.39 కోట్ల గ్రాంట్



హనుమకొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎన్ఐటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ టి.తేజస్వి, డాక్టర్ ఉమేష్ బసప్ప, డాక్టర్ అనితా ప్రియదర్శినిలకు ఒక పరిశోధనా ప్రాజెక్టు గ్రాంట్ కింద రూ.2.39 కోట్లు మంజూరైంది. డీఆర్‌డీవో-కార్స్ పథకం కింద చేపట్టిన డిటర్మినేషన్ ఆఫ్ స్ట్రెంత్ అండ్ డ్యామేజ్ పారామీటర్స్ ఫర్ మెటల్స్ సెరామిక్స్ అండ్ హై స్ట్రెయిన్ రేట్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఫోమ్స్ అనే పరిశోధనా ప్రాజెక్టుకు ఈ గ్రాంట్‌ను వీరు అందుకున్నారు.

నగరాభివృద్ధికి నడుంబిగిస్తారా?!

(5వ పేజీ తరువాయి)

చర్చిస్తారు. అర్బన్ మలేరియా విభాగంలో పనిచేస్తున్న 90 మంది కార్మికులకు రోజుకు రూ.651 చొప్పున ఆరు నెలలకు రూ.91.61 లక్షలను సాధారణ నిధుల నుంచి చెల్లింపు, స్వచ్ఛ ఆటో ఓనర్ కం డ్రైవర్లకు వచ్చే ఆగస్టు మరో మూడు మాసాల పాటు అగ్రిమెంట్ పొడిగింపు జరుగుతుంది. స్వచ్ఛ సర్వేక్షన్ 2020 నుంచి 2024 వరకు ప్రముఖ నటుడు రచ్చ రవి బ్రాండ్ అంబాజిడర్‌గా ఉన్నందున రూ.1లక్ష చెల్లింపు జరుగుతుంది. స్వచ్ఛభారత్ మిషన్, లెగెసీ మిషన్‌కు రూ.4.60 కోట్ల నిధులు కేటాయించేందుకు కౌన్సిల్ ఆమోదం జరుగుతుంది. వీధిలైట్ల టెండరు ముగియడంతో ఐదేళ్ల పాటు స్వయంగా ఆర్ఎఫ్‌పీ టెండరును ఆమోదిస్తారు. అమృత్ 2.0పథకంపై ప్రతిపాదన, ఆమోదం తెలుపుతారు. అలాగే 66 డివిజన్‌లలో జరిగే అభివృద్ధి పనులకు టెండర్లను పిలవనున్నారు.

సమస్యలు ఇలా..

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై ప్రధానంగా చర్చ జరపాల్సి ఉంది. ఇంకా నగరంలోని 66 డివిజన్లలో వీధి దీపాల సమస్య ఉంది. నగరంలో చాలాచోట్ల వీధి లైట్లు వెలగడం లేదు. ప్రధానంగా కొందరు అనుభవం లేని కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు అలసత్వం వల్ల నగరంలో చాలాచోట్ల తాగునీరు వృథాగా పోతోంది. కాంట్రాక్టర్లు సరిగా మరమ్మతు పనులు చేయకపోవడం వల్ల సుమారు 50 శాతం నీరు వృథా అవుతోంది. నగరంలోని మురుగు కాల్వల్లో తొలగించాల్సిన పూడికతీత పనులు పారదర్శకంగా నిర్వహించలేదు. దీంతో కాల్వలలో గుర్రపుడెక్క, చెత్త, చెదారం పేరుకు పోయింది. శానిటేషన్ సిబ్బంది రోడ్లు, మరుగు దొడ్లు, డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదు. రోడ్లు శుభ్రం చేయడానికి కోట్లు వెచ్చించి దిగుమతి చేసిన అధునాతన వాహనాలు మూలకుపడ్డాయి. ఇంకా చాలా కాలనీలలో అర్బన్ మలేరియా సిబ్బంది నిర్లక్ష్యం వల్ల దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో డెంగీ, మలేరియా కేసులు నమోదవుతున్నాయి. దోమల మందు, ఫాగింగ్ చేయకపోవడం వల్ల దోమలు వృద్ధి చెందిన ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొన్నిచోట్ల ప్రజలు విషజ్వరాల బారిన పడి ప్రాణాలను సైతం పోగొట్టుకున్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. ఇంటి నెంబర్లు, మ్యుటేషన్ కోసం ఆర్ఐలు లంచం ఇవ్వనిదే పనిచేయడం లేదు. కమిషనర్ సీసీల పనితీరు వివాదాస్పదంగా మారింది. ఇంజనీరింగ్ అధికారులు ప్రతీ అభివృద్ధి పనికి కాంట్రాక్టర్ల నుంచి లంచాలు స్వీకరించి ఎంబీలు రికార్డు చేస్తున్నారు.

అధికారులు, పాలకుల వైఫల్యం

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు ప్రకటించినా ఇక్కడి అధికారులు, పాలకులు ఖర్చు చేయడంతో విఫలం కావడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. అలాగే నగరంతో పాటు విలీన గ్రామాలలో చాలా కాలంగా సమస్యలు స్వైరవిహారం చేస్తుంటే పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. గ్రీవెన్స్ ఫిర్యాదులపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో కాలనీలలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

ఈ సారైనా చర్చ కొనసాగేనా..?

గ్రేటర్ వరంగల్ పాలక వర్గం కౌన్సిల్ సమావేశంలో వరంగల్ నగర పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ జరిపి పరిష్కార మార్గం చూపాలి. కానీ సమావేశం 2గంటల కంటే ఎక్కువ జరగడం లేదు. దీనిపై ప్రతిపక్ష నేతలు గొంతెత్తినా ఫలితం ఉండడం లేదని విమర్శిస్తున్నారు. ఈ సారైనా సమస్యలపై దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

వెలమలు సంఘటితం కావాలి

- ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న నడిపల్లి వెంకటేశ్వర్‌రావు

ములుగు టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : వెలమ కులస్థులు సంఘటితం కావాలని ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నడిపల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సామాజిక వర్గంలో వెనుకబడిన వెలమ కులస్థులను ఆదుకునేందుకు సంఘం ద్వారా అనేక సంక్షేమ కార్య క్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ కలిగిన పేద, తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతో పాటు వృద్ధులకు ఉచిత వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ములుగు జిల్లా సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు జలగం మోహన్‌రావు, కన్వీనర్ వేల్పూరి సత్యనారాయణరావు, ఉమ్మడి జిల్లా సంక్షేమ సంఘం ఈసీ సభ్యులు లింగంపల్లి పాపారావు, ప్రభాకర్‌రావు, శ్రీధర్‌రావు, గోపాల్‌రావు, అమృతరావు, వెంకటేశ్వర్ రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనా, నీలపతాకాగా..

- భక్తులకు దర్శనమిచ్చిన భద్రకాళి అమ్మవారు
- పదకొండో రోజుకు చేరిన శాకంబరీ వేడుకలు



ఘనా, నీలపతాకా క్రమంలో దర్శనమిస్తున్న భద్రకాళి దేవి

వరంగల్ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్రసిద్ధిగాంచిన భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో శాకంబరీ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం 11వ రోజు ఉత్సవాల్లో భాగంగా ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం కార్యక్రమాన్ని పూర్తిచేసిన అర్చకులు కాళీ క్రమాన్ని అనుసరించి ఉత్సవమూర్తిని ఘనా రూపంలో.. శోడషీ క్రమాన్ని అనుసరించి అమ్మవారిని నీలపతాకా రూపంలో అలంకరించి భక్తుల దర్శనానికి ఏర్పాటు చేశారు. ఘనా మాతను ఆరాధిస్తే మేఘాలను రంజింపచేసి వర్షాలు కురిపిస్తారని, నీల పతాకా అమ్మవారిని పూజిస్తే అసుర శక్తులను ధ్వంసంచేసి అతివృష్టి, అనావృష్టి లేకుండా లేకుండా చేస్తారని అర్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. కాగా, ఆదివారం సెలవుతో పాటు తొలి ఏకాదశి పర్వదినం కావడంతో వేలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వీఐపీల తాకిడి పెరిగింది. డోనర్స్, సేవాకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఈవో శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిషేకానికి సర్వం సిద్ధం

» నేడు కేయూ 23వ స్నాతకోత్సవం
» హాజరు కానున్న గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ



విద్యార్థులకు సూచనలిస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ వర్సిటీ సోమవారం జరిగే స్నాతకోత్సవానికి సిద్ధమైంది. కొన్నిరోజులుగా ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పట్టాల పండగకు సమయం ఆసన్నమైంది. గవర్నర్, వర్సిటీ చాన్సలర్ జిష్ణుదేవ్‌వర్మ చేతులమీదుగా తమ పీహెచ్‌డీ పట్టాలు, బంగారు పతకాలు అందుకునేందుకు విద్యార్థులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కేయూలో నేడు 23వ కాన్వకేషన్ జరుగనుంది. కేయూలోని 8 విభాగాలైన ఆర్ట్స్, సోషల్ సైన్స్, సైన్స్, ఫార్మసీ, ఇంజనీరింగ్, న్యాయశాస్త్రం, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్ విభాగాల్లో 2020 నుంచి 2025 జూలై అఖరు వరకు డాక్టరేట్ సాధించిన 387 మందికి గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాలను అందిస్తారు. అలాగే 2015-16 నుంచి 2020-21 ఆరేళ్లకాలంలో 373 మందికి 564 బంగారు పతకాలను అందచేస్తారు. ఆర్ట్స్ విభాగంలో 60, సైన్స్‌లో 161, ఫార్మసీలో 48, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో 66, సోషల్ సైన్స్‌లో 88, ఎడ్యుకేషన్‌లో 25, న్యాయశాస్త్రంలో 72, ఇంజనీరింగ్ విభాగంలో 44 మందికి బంగారు పతకాలను ఇస్తారు.

స్టీరింగ్‌తో పాటు సబ్ కమిటీలు పనులు

కాన్వకేషన్ పనుల కోసం ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి చైర్మన్‌గా, సభ్యులుగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి మనోహర్, ప్రొఫెసర్ వరలక్ష్మి, డీవో ప్రొఫెసర్ వాసుదేవారెడ్డిలతో కమిటీని నియమించారు. అలాగే 10 విభాగాలుగా కాన్వకేషన్ పనులను విభజించి ప్రొఫెసర్ నేతృత్వంలో ప్రత్యేక సబ్ కమిటీలు ఏర్పాటు చేసి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా జాగ్రత్తలు చేపట్టారు.

అడుగడుగునా వలంటీర్లు

ఆడిటోరియంలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వలీంటర్లను అడుగుఅడుగునా నియమించారు. ఆడిటోరియం లోపల అతిథులకు సహాయపడేందుకు ఎన్‌సీసీ కేడెట్లతో పాటు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను నియమించారు. ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ డాక్టర్ బి.మంజుల సూచనలు చేశారు. క్యాంపస్‌లోకి వచ్చే వారికి మంచినీటితో పాటు ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.

2వేల మందికి భోజనాలు

కాన్వకేషన్‌లో పాల్గొనే పీహెచ్‌డీ, బంగారు పతకాలు పొందనున్న అభ్యర్థులందరికీ భోజనాలను ప్రొఫెసర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌ల నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు. సుమారు2 వేల మందికి పైగా భోజనాలు చేస్తారని భావిస్తున్నారు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, డాక్టర్ డి.శ్రీనివాస రెడ్డి, వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు కేయూ గెస్ట్‌హౌస్‌లో భోజనాలు చేస్తారు. అలాగే అతిథులతో పాటు విద్యార్థులు, ఇతర సిబ్బందికి కేయూ స్పోర్ట్స్ బోర్డు కాంప్లెక్స్‌లో, వర్సిటీ పాత అడ్మిషన్ల డైరెక్టరేట్‌లో ఏర్పాట్లు చేశారు.

సర్వాంగ సుందరంగా ఆడిటోరియం

కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆడిటోరియం చుట్టూరా రంగు రంగుల వర్సిటీ జెండాలతో కళకళలాడుతోంది. అలాగే ఆడిటోరియం చుట్టూరా కట్టెలతో కంపౌండ్ ఏర్పాటు చేశారు. డాక్టరేట్ పొందే అభ్యర్థులనే ఆడిటోరియంలోనికి అనుమతిస్తారు. అభ్యర్థులతో వచ్చే వారు కాన్వకేషన్‌ను తిలకించేందుకు భారీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే కరెంట్ కోసం ప్రత్యామ్నాంగా జనరేటర్లను ఏర్పాటు చేశారు.

భారీగా పోలీస్ బందోబస్తు

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన నేపథ్యంలో వర్సిటీలో పోలీస్ బందోబస్తును భారీగా ఏర్పాటు చేశారు. గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసేందుకు జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. ప్రొటోకాల్, పోలీసులు గౌరవవందనం చేయనున్నారు. ఆడిటోరియం వద్ద పోలీసులు పాస్‌లు ఉన్నవారిని లోనికి పంపేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

వెబ్ చానల్ ఏర్పాటు

కేయూ ఆడిటోరియంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగే కాన్వకేషన్ ప్రోగ్రామ్‌ను ప్రత్యేకంగా వీక్షించేందుకు లైవ్ వెబ్ చానల్‌ను ఏర్పాటు చేశారు. https://www.youtube.com/live/ NXJFo 9IN2v4? అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఏర్పాట్లు పూర్తి..

కేయూ ఆడిటోరియంలో స్టేజీ అరేంజ్‌మెంట్లు పూర్తయ్యాయి. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో పాటు ముఖ్య అతిథి సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాసరెడ్డి, వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంతో పాటు అకడమిక్ సెనెట్ సభ్యులు, పాలక మండలి సభ్యులు, 8 విభాగాల డీన్లు స్టేజీపై కూర్చుంటారు. ఈ మేరకు సీట్లపై స్టిక్కరింగ్ చేశారు. ఆడిటోరియం మొత్తంలో వీవీఐపీలు, వీఐపీలు, పీహెచ్‌డీ అందుకునే అభ్యర్థులు, గోల్డ్ మెడల్స్ పొందనున్న విద్యార్థులు కూర్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్టేజీపై పట్టాలతో పాటు, బంగారు పతకాలను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయా విభాగాల డీన్లు పీహెచ్‌డీ అందుకునే అభ్యర్థులతో ప్రత్యేక ప్రమాణాలు చేయిస్తారు.

షెడ్యూల్ ఇదే..

కేయూలో సోమవారం ఉదయం 9.30 గంటలకు డాక్టరేట్‌తో పాటు బంగారు పతకాలు పొందనున్న అభ్యర్థులందరూ ఆడిటోరియం వద్ద రిపోర్ట్ చేయాలి. 10.30 గంటలకు గేట్‌ను మూసివేస్తారు. 11 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ వర్సిటీకి చేరుకుంటారు. 11.25 గంటలకు గవర్నర్‌కు గౌరవ వందనం చేస్తారు. 11.30 గంటలకు ఆడిటోరియంలో అకడమిక్ సెనెట్ సమావేశం జరుగుతోంది. 11.35 గంటలకు గ్రూప్‌ఫొటో, ప్రొఫెషన్, 11.40 గంటలకు కాన్వకేషన్‌ను ప్రారంభిస్తారు. 11.45 గంటలకు అడ్మినిస్ట్రేటివ్ ఓత్(ప్రమాణం), 11.50 గంటలకు వైస్‌చాన్స్‌లర్ రిపోర్టు, 12 గంటలకు ముఖ్యఅతిథి శ్రీనివాసరెడ్డి ప్రసంగం, 12.10 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రసంగం, 12.20 గంటలకు పీహెచ్‌డీ డిగ్రీలు, బంగారు పతకాల ప్రదానోత్సవం ఉంటుంది. 1.05 కృతజ్ఞతలు, 1.10 కాన్వకేషన్ ముగింపు, 1.12 గంటలకు జాతీయ గీతాలపాలతో కార్యక్రమం ముగుస్తోంది.



ఎన్‌సీసీ కేడెట్లు, వలంటీర్లకు సూచనలిస్తున్న అధ్యాపకులు



వేడుకలను తిలకిస్తున్న ప్రజలు



బోనం ఎత్తుకున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

శరణు శరణు బీరన్న!

» ఉర్సు, కరీమాబాద్‌లో ఘనంగా బోనాల పండుగ
» ఆకట్టుకున్న డిల్లెం-బల్లెం నృత్య, ఖడ్గ విన్యాసాలు
» బోనాలతో తరలి వచ్చిన మహిళలు
» 'గావు' తంతు చూసేందుకు ఎగబడిన భక్త జనం
» హాజరైన పలువురు రాజకీయ ప్రముఖులు

కరీమాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలిఏకాదశి పర్వదినాన కురుమల ఆరాధ్య దైవమైన బీరన్నస్వామికి కురుమలు ఘనంగా బోనాలు సమర్పించారు. ఆదివారం ఉర్సు, కరీమాబాద్ ప్రాంతాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచి ఎంతో నియమ నిష్టలతో ఉపవాస దీక్షలతో ఉన్న మహిళలు భక్తిభావంతో బోనాలను ఎత్తుకొని సాయంత్రం ఆలయాలకు బయలుదేరారు. చిన్న పెద్ద అంతా కలసికట్టుగా బీరన్నకు బోనం సమర్పించేందుకు తరలి రావడంతో ఉర్సు, కరీమాబాద్ ప్రాంతాలు జనంతో నిండిపోయాయి. వేడుకలను తిలకించేందుకు వచ్చిన అశేష భక్త జనంతో దారులన్నీ బీరన్న నామస్మరణతో మారుమోగాయి. బీరన్నకుంటలోని ఆలయ ప్రాంగణాలు బోనాలతో నిండిపోయాయి. ఉదయం నుంచే బీర న్న, కామరతి, అక్క మహంకాళి దేవతామూర్తుల దర్శనం కోసం ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. బోనాలతో ఆలయానికి చేరుకున్న కురుమలు తమ ఆరాధ్యదైవం బీరన్నస్వామి, కామరతి, అక్కమహంకాళిలను తన్మయత్వంతో కొలిచి, నిండు మనస్సుతో బోనాలు సమర్పించారు. మొక్కులు చెల్లించి పిల్లపాపలను సల్లంగ సూడాలని ప్రార్థించారు.

ఉర్సులో కురుమల కులపెద్ద మరుపల్ల రవి ఇంటి నుంచి ఉదయం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలో బీరన్నకు, కామరతి దేవతా మూర్తులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్య సమాజ్ జెండాను చేతబూని పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకువచ్చి బీరన్నకుంటలోని ఆలయానికి చేరుకున్నారు. ఒగ్గు కళాకారులు ఆచారం ప్రకారం సుంకు బియ్యం పిడికెడు తీసుకొని ఇంటింటికి తిరుగుతూ బోనాలను చేయల్సిందిగా చాటింపు చేశారు. ఆ సుంకు బియ్యానికి తమ బియ్యాన్ని కలిపి బీరన్నకు బోనం సిద్ధం చేశారు. బోనాలు బయలుదేరిన సందర్భంలో చెట్లవారి గడ్డ నుంచి బీరన్నలు చేసిన నృత్య విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

అలాగే కరీమబాద్ కురుమల భవనం నుంచి ఆనవాయితీ ప్రకారం ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరె కృష్ణ, కమిటీ బాధ్యులు పట్టు వస్త్రాలు, జాతీయ జెండాను చేతబూని పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని, జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతం ఆలపించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. బీరన్నలు ఇంటింటికీ తిరుగుతూ బోనాలను చేయాల్సిందిగా చాటింపు చేశారు. బోనాలను అన్ని సిద్ధం చేశాక సాయంత్రం మహిళలు భక్తి పారవశ్యంతో తలపై బోనాలతో కరీమాబాద్ పురవీధులు గుండా ఆలయానికి బయలుదేరారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళలు బోనాలతో ముందుకు కదిలారు. ఈ సందర్భంగా బీరన్నలు చేసిన డిల్లెం.. బల్లెం నృత్యాలు, ఖడ్గ విన్యాసాలు, బొమ్మలగుడి సమీపంలో బొడ్రాయి వద్ద గొర్రెపిల్లను గావు పట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ గావుపట్టే తంతును చూసేందుకు భక్తులు, ప్రజలు పోటీపడ్డారు. గావు పట్టిన రక్తాన్ని భక్తులు నుదుటన తిలకంగా దిద్దుకున్నారు. బోనమెత్తిన మహిళలు ఒకరి తరువాత ఒకరు గావు పట్టిన గొర్రెపిల్లను దాటుతూ ఆలయానికి చేరుకున్నారు.



బోనంతో యువతి

భారీ పోలీసు బందోబస్తు

వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు ఉన్నతాధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బోనాలతో వస్తున్న మహిళలకు రక్షణగా రోప్ పార్టీని ఏర్పాటు చేశారు. ఏఎస్పీ శుభం ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, సీఐలు బొల్లం రమేష్, గోపి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

బీరన్న బోనాలు ఎంతో ప్రత్యేకం : మంత్రి కొండా సురేఖ

ఉర్సు, కరీమాబాద్ ప్రాంతంలో బీరన్న బోనాల పండుగకు ఎంతో ప్రత్యేకత ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం ఆమె మేయర్ గుండు సుధారాణితో కలిసి కరీమాబాద్ బొడ్రాయి వద్ద బోనం ఎత్తుకొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేవాదాయ శాఖమంత్రిగా తాను ఈ కార్యక్రమంలో పాల్గొనం ఆనందంగా ఉందన్నారు. శతాబ్దాల కిందట ఇక్కడ కలరా వచ్చి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న తరుణంలో పెద్దలు.. "ఈ వ్యాధి నుంచి మమ్మల్ని కాపాడు బీరన్న, నీకు బోనం సమర్పించుకుంటాం" అంటూ శరణు వేడుకోగా సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాడని.. అప్పటి నుంచి ఈ బోనాల ఉత్సవాలు, గావు పట్టే కార్యక్రమాలు క్రమం తప్పకుండా కురుమలు నిర్వహిస్తూ వస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో తొలి బోనం వరంగల్ భద్రకాళిదే అనుకున్నా కానీ.. కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ సంకల్పం నెరవేరలేదని, త్వరలో పునరాలోచన చేస్తామని అన్నారు. బోనాల జాతరకు తాను సహకారం అందిస్తానని, బీరన్న కృపతో ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. కురుమలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్‌రాజ్, మీసాల ప్రకాష్ తదితరులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సైతం వేడుకలకు హాజరై మొక్కులు చెల్లించారు.



బోనం ఎత్తుకున్న మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి

కోటలో పీరీల సందడి

» భక్తిశ్రద్ధలతో ఊరేగించిన ముస్లిం యువకులు
» పాల్గొన్న మంత్రి సురేఖ, మేయర్



ఖిలా వరంగల్‌లో పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు



పీరీలకు పూలమాల వేసి, కుడుకలు కడుతున్న ముస్లింలు

ఖిలావరంగల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అల్లా దయ ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం ఖిలావరంగల్ మధ్యకోటలోని ఆశూర్‌ఖానా దర్గాలో ఏర్పాటుచేసిన పీరీల వద్ద ఆమె ప్రార్థన చేశారు. ముందుగా మతపెద్దలు దట్టీ కట్టి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పీరీలను ఊరేగించారు. మంత్రి సురేఖ, మేయర్ గుండు సుధారాణిని శాలువాలతో సన్మానించారు. ముస్లిం యువకులు పీరీల చుట్టూ చేరి 'అసైదులా' అంటూ ఊరేగింపు నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు ఖిలావరంగల్‌తో పాటు శివారు ప్రాంతాలైన చింతల్, శంభునిపేట, ఉర్సు, కరీమాబాద్, వరంగల్ నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు తరలివచ్చారు. పీరీలకు బుక్క, గులాలు, కుడుకలు, పూలమాలలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యకోటలోని ఆశూర్‌ఖానాదర్గా నుంచి పిల్లల పార్కు, ముస్లిం కాలనీ, ఖిలావరంగల్ చెమన్, పడమర కోట నుంచి పీరీలను ఊరేగించి ఖమ్మంరోడ్‌లోని బావిలో నిమజ్జనం చేశారు. మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ సీఐలు బండి రమేష్, గోపి, ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్, మీసాల ప్రకాశ్, కార్పొరేటర్లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా-దామోదర్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు బోయిని దూడయ్య, నలిగంటి బెబ్బులి, కాంగ్రెస్ నాయకులు బెడిద వీరన్న, పోశాల సారంగపాణి, బైరబోయిన రవీందర్, సంగరబోయిన చందర్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ జరిగేనా?

వర్షాకాలం ప్రారంభమైనా చర్యలు శూన్యం » ఎదురుచూస్తున్న మత్స్యకారులు



మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరికి సమస్యను వివరిస్తున్న మత్స్య సహకార సంఘాల నాయకులు (ఫైల్)



బాలసముద్రం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులను చిన్నచూపు చూస్తోందని పలువురు మత్స్య సహకార సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైనా మత్స్యకారులకు అందించే చేపపిల్లల పంపిణీ పట్ల ఇంతవరకు ప్రభుత్వం దృష్టి సారించడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. గత ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం అభివృద్ధి కోసం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీంతో రాష్ట్రంలో ప్రజలకు పౌష్టికాహారం సమకూర్చే మత్స్య సంపద ఎంతగానో పెంపొందింది. గతంలో చేపలను ఇతర రాష్ట్రాలను దిగుమతి చేసుకోగా ప్రస్తుతం రాష్ట్రంలోనే సమృద్ధిగా చేపలు లభిస్తున్నాయి.

విత్తన పెట్టుబడి మినహా ఎలాంటి వ్యయం లేకుండా జలాశయాల్లో చేపలు ఎదిగి పెట్టుబడికి సుమారు వంద రేట్ల సంపద సమకూరుతోంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగా గత సంవత్సరం చేపపిల్లల సరఫరాకు టెండర్లను పిలవడం ఆలస్యం కావడంతో చేపపిల్లల ఉత్పత్తి ఆలస్యంగా ప్రారంభమై అక్టోబరులో చేప ప్లిలలను పంపిణీ చేశారు. సాధారణంగా జూలై, ఆగస్టు నెలల్లో భారీ వర్షాలు కురిసి జలాశయాల్లో నీరు చేరుతుంది. కనీసం సెప్టెంబరు నెలలోనైనా చేప పిల్లలను నీటిలో వదిలితే పూర్తిస్థాయిలో చేపలు ఎదిగి మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మత్స్య మంత్రిత్వ శాఖ సీఎం రేవంత్‌రెడ్డి ఆధీనంలో ఉండడంలో నిత్యం బిజీగా ఉండే ఆయన సరైన దృష్టి సారించలేకపోయారని ఇటీవల నూతనంగా మత్స్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వాకిటి శ్రీహరి చొరవ తీసుకోవాలని మత్స్యకార్మిక నాయకులు కోరుతున్నారు.

కాగా, ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల నాయకులు మత్స్య శాఖ మంత్రిని హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో కలిసి సమస్యలను విన్నవించారు. చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ఆలస్యం అవుతోందని, వెంటనే చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల మత్స్యసహకార సంఘాలను ఏర్పాటు చేయగా కేవలం 12 జిల్లా సహకార సంఘాలకే ఎన్నికలు నిర్వహించారని, మిగతా 21 జిల్లా సంఘాలకు ఇంత వరకు ఎన్నికలు నిర్వహించలేదని నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 1200 పైచిలుకు గల ప్రాథమిక మత్స్య సహకార సంఘాలకు కూడా ఇంత వరకు ఎన్నికలు నిర్వహించలేదని అన్నారు. సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించినా ఇంత వరకు ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. మంత్రి వెంటనే చర్యలు చేపట్టి సకాలంలో చేపపిల్లల పంపిణీతో పాటు సహకార సంఘా లకు ఎన్నికలు నిర్వహించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

బీటెక్ విద్యార్థినికి
చేయూత

» రూ.1.07 లక్షల సాయం అందించిన విద్యా ఫౌండేషన్

హనుమకొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నిరుపేద బీటెక్ విద్యార్థినిని విద్యా ఫౌండేషన్ ఆదుకున్నది. ఆర్థిక సాయం అందజేసింది. అనంత సాగర్‌లోని ఎస్ఆర్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కొంగల హాసినికి కళాశాల ఫీజు నిమిత్తం అమెరికాలో ఉంటున్న కొండపల్లి దీప్తి ఆర్థిక సహకారంతో రూ.1,07,000ల చెక్‌ను విద్యాఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్, ఒయాసిస్ ఆశ్రమ నిర్వాహకులు ఒద్దిరాజు ప్రకాశ్ చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. ఫౌండేషన్ విజ్ఞప్తి మేరకు హాసినిని దత్తత తీసుకొని యేటా ఫీజు చెల్లిస్తూ విద్యాభివృద్ధి కోసం పాటు పడడం అభినందనీయం అన్నారు. బాలికల సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తున్న దీప్తికి ఫౌండేషన్ పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారులు గురిజాల తిరుపతి రెడ్డి, సభ్యులు వెల్దండి లీల, టి.నర్సింగరావు, వైద్యుల వాణీరాణి, కడుదుల సోమన్న, ఉదయ్, కార్తీక రాజు, కాంచనపల్లి అనిత, మహ్మద్ రఫీ, కొక్కుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో ఇన్‌చార్జిలే దిక్కు

» 6 జిల్లాలకు ఇన్‌చార్జి డీఈవోలే..
» 76 మండలాలకూ ఇన్‌చార్జి ఎంఈవోలే ..
» పర్యవేక్షణ లోపించడంతో కుంటుపడుతున్న విద్యా వ్యవస్థ



వరంగల్ డీఈవో కార్యాలయం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో ఇన్‌చార్జిల పాలనతో విద్యాభివృద్ధి కుంటుపడుతోంది. పర్యవేక్షణ చేయాల్సిన డీఈవోలు, ఎంఈవోల పోస్టుల్లో ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. జిల్లాల పునర్విభజన జరిగి తొమ్మిదేళ్లు గడుస్తున్నా.. విద్యాశాఖలో ఇప్పటికీ ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, జయశంకర్ భూపలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారులుగా ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని 76 మండలాల్లోనూ ఇన్‌చార్జి ఎంఈవోలే పర్యవేక్షణ బాధ్యతలు కొనసాగిస్తున్నారు. అసలే ఇన్‌చార్జిల పాలన అంటే... అందులోనూ అన్‌క్వాలిఫైడ్ డీఈవోలతో విద్యాశాఖకు తీరని నష్టం వాటిల్లుతోందని విద్యారంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంతా ఇన్‌చార్జిల పర్యవేక్షణే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యాశాఖ మొత్తం ఇన్‌చార్జిల పర్యవేక్షణలో కొనసాగుతోంది. వరంగల్ జిల్లాలో 13 మండలాలు ఉండగా అన్ని మండలాల్లో హెడ్మాస్టర్లే ఇన్‌చార్జి ఎంఈవోలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. హనుమకొండలో 14 మండలాలకు, జనగామలో 12 మండలాలకు, జయశంకర్ భూపాలపల్లిలో 12 మండలాలకు, ములుగులో 9 మండలాలకు, మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 16 మండలాలకు హెడ్మాస్టర్లే ఇన్‌చార్జి ఎంఈవోలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే 76 మండలాల్లో ఒక్క పూర్తిస్థాయి ఎంఈవో లేకపోవడం గమనార్హం.

తూతూ మంత్రంగా తనిఖీలు

జిల్లా స్థాయిలో ఎఫ్ఏసీ డీఈవోలు, మండల స్థాయిలో ఇన్‌చార్జిలతో ఎంఈవోలతో తూతూ మంత్రపు తనిఖీలతోనే వెల్లబుచ్చుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలియని అయోమయంలో విద్యాశాఖ ఉందంటే అతిశయోక్తి కాదు. డిప్యూటీ ఈవోలు, ఏడీలు, డైట్ లెక్చరర్లకు డీఈవోలుగా బాధ్యతలు అప్పగించడం, హెచ్‌ఎంలకు ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది.

ఆరుగురు ఇన్‌చార్జిలే..

ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలకు ఎఫ్ఏసీ డీఈవోలే దిక్కుగా మారారు. వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ జిల్లాలకే అసిస్టెంట్ డైరెక్టర్ల(ఏడీ)లకు డీఈవోలుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పజెప్పగా, హనుమకొండలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌కు, మహబూబాబాద్‌లో డైట్ లెక్చరర్‌కు, ములుగు జిల్లాలో డీఐఈవో (ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి)కు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. వీరిలో వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు అన్‌క్వాలిఫైడ్ ఏడీలు ఎఫ్ఏసీ డీఈవోలుగా వ్యవహరిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా ఎఫ్ఏసీ డీఈవో మరో రెండు నెలల్లో ఉద్యోగ విరమణ పొందనుండగా ములుగు జిల్లా ఎఫ్ఏసీ డీఈవోగా బాధ్యతలు చేపట్టేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. దీంతో ములుగు జిల్లా కలెక్టర్ తాత్కాలికంగా డీఐఈవోకు ఎఫ్ఏసీ డీఈవోగా బాధ్యతలు అప్పగించారు.

ఘనంగా శ్యామ్ ముఖర్జీ జయంతి

రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం హంటర్‌రోడ్డులోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారావుకు శుభాకాంక్షలు

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా నియామకమైన మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావును ఆదివారం రాంనగర్‌లోని ఆయన నివాసంలో 64వ డివిజన్ బీజేపీ నాయకుడు నాగవెల్లి గోపికృష్ణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు పోనుగోటి వెంకట్రావ్, గుర్రాల రాజు, తోట రాజేశ్ కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

రజక విద్యార్థులు విద్యలో రాణించాలి

» ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య » అవార్డులు అందజేత



ప్రతిభ కనబరిచిన రజక విద్యార్థులతో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

న్యూశాయంపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రజక విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ న్యూశాయంపేటలోని రజక భవనంలో 10వ తరగతిలో 560 మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కార అవార్డులు అందించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరై 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు శాలువాలు కప్పి సన్మానించి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొమురెల్లి, ఉపాధ్యక్షులు బాబు, గౌరవ అధ్యక్షులు సదానందం, సలహాదారులు చిట్యాల భిక్షపతి, ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, ప్రచార కార్యదర్శి ధర్మారం శోభన్, కోశాధికారులు సోమయ్య, వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధించాలి

కాకతీయ యూనివర్సిటీ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, తదితరులు

కేయూ క్యాంపస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధించాలని కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. ఆదివారం జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతిని పురస్కరించుకుని కేయూ దూరవిద్యకేంద్రం వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్‌లతో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ అజ్మీరా రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు, డాక్టర్ బి.రమ, డాక్టర్ కొట్టే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో ఆదివారం మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. మాదిగ మహాజనుల వేదిక కన్వీనర్ గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఉప ప్రధానిగా, సామాజిక సంఘ సంస్కర్తగా ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఆరూరి సాంబయ్య, బొక్క స్వామి, కుమ్మరి కోటిలింగం, గడ్డం నరహరి, కొడవటి రవి, సంచు కృష్ణ, పాలడుగుల వివ, తేలు సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

మన తెలంగాణ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ

వడ్డెపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నాలుగు రకాల నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాలు ఇచ్చిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఇసంపెల్లి సంజీవ పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మన తెలంగాణ, కాకతీయ, టీఏడీయూ, సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇసంపెల్లి సంజీవ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా నిర్వహిస్తున్న సమ్మెలో ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఈ నెల 9న ఆటోల బంధును పాటించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాకతీయ ఆటోడ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు మొగుసాల దేవేందర్‌రెడ్డి, మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కలకోట్ల జయరాం, మడికొండ బాబు, సీఐటీయూ జిల్లా నేత ధరావత్ భాను నాయక్, మంద శ్రీధర్‌రెడ్డి, కృష్ణమూర్తి, జిలకర స్వామి, బొల్లం సంజీవ, చుంచు రంజిత్, భూక్య రామకృష్ణ, మందల శ్రీను, ఎర్రం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్‌మాల్‌లకు సమ్మె నోటీసులు

రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఈ నెల 9న చేపట్టబోయే అఖిల భారత సమ్మె జయప్రదంలో భాగంగా నయీంనగర్‌లోని పలు షాపింగ్ మాల్స్‌కు సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య మాట్లాడుతూ.. రద్దు చేసిన కార్మిక చట్టాలను వెంటనే పునరుద్ధరించి, అసంఘటిత కార్మికులందరికీ కనీస వేతనం నెలకు రూ. 26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు రవీందర్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎన్. రజిత, సీఐటీయు నాయకులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణయ్‌భాస్కర్ ఆశయాలను కొనసాగించాలి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



ప్రణయ్ భాస్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, దాస్యం అభినవ్ భాస్కర్



లెప్రసీకాలనీలో పండ్లను పంచుతున్న మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, పులి రజనీకాంత్

వడ్డెపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ మంత్రి దాస్యం ప్రణయ్ భాస్కర్ ఆశయాలను కొనసాగించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ప్రణయ్ మిత్రమండలి, ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ మంత్రి దాస్యం ప్రణయ్‌భాస్కర్ జయంతి, వర్థంతిలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రణయ్‌భాస్కర్ నివాసంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర నేత, 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ తదితరులు ప్రణయ్ భాస్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తొలుత వడ్డెపల్లి ప్రణయ్‌మార్గ్‌లోని చిత్రపటానికి ప్రణయ్‌భాస్కర్ సతీమణి దాస్యం సబిత భాస్కర్, కూతురు అపూర్వ భాస్కర్, అల్లుడు రంజిత్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వడ్డెపల్లి రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించి వడ్డెపల్లిలోని సహృదయ అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, బీజేపీ శ్రేణులు నాగపురి అశోక్, గుండె అశోక్, రేకుల సతీష్, మట్టెపల్లి రాంరాజ్, యాదగిరి, జనగాం వెంకటేశ్వర్లు, కేశబోయిన కోటేశ్వర్‌రావు, కేశబోయిన విపుల్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ చౌరస్తా : మాజీ మంత్రి దాస్యం ప్రణయ్‌భాస్కర్ జయంతి, వర్ధంతులను హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆదివారం హనుమకొండ 10వ డివిజన్ లెప్రసీకాలనీలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణయ్‌భాస్కర్ చిత్ర పటానికి వినయ్‌భాస్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించి పండ్లను పంపిణీ చేశారు. అనంతరం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. పేద ప్రజల పెన్నిధిగా ఉంటూ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని అసెంబ్లీ సాక్షిగా వినిపించిన గొప్ప తెలంగాణ వాది ప్రణయన్న అని కొనియాడారు. నాటి హనుమకొండ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ పేద ప్రజలకు అండగా నిలిచాడని వినయ్‌భాస్కర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉడుతల సారంగపాణి, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మాడిశెట్టి వరుణ్, పొదిలి అనీల్, సారంగం, సంపతి రఘు, ఖలీల్, కాలనీవాసులు సుబ్బారావు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ టౌన్: మాజీ మంత్రి దాస్యం ప్రణయ్ భాస్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాన్ని హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ హాజరై దాస్యం ప్రణయ్ భాస్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట: కాజీపేట ఫాతిమానగర్‌లో హౌస్ ఆఫ్ జాయ్ హోమ్‌లో ఆదివారం మాజీ మంత్రి దాస్యం ప్రణయ్‌భాస్కర్ వర్ధంతి, జయంతి వేడుకలు జరిగాయి. 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు ఆధ్వర్యంలో అనాథలకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ హాజరై పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేశ్, తండమల్ల వేణు, సుంచు కృష్ణ, దువ్వ కనుకరాజు, సోని, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమే ధ్యేయం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



కొబ్బరికాయ కొట్టి ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడమే ప్రభుత్వ ధ్యేయమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం 52వ డివిజన్‌లోని రాంనగర్ (బంజారకాలనీ)లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం భూమి పూజలో ఎమ్మెల్యే నాయిని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులు ఇంకా మిగిలి ఉంటే ప్రభుత్వాన్ని ఒప్పించి మరిన్ని ఇళ్లను తీసుకువస్తానన్నారు. లబ్ధిదారుల ఎంపికలో జాప్యం జరుగుతోందని, అధికారులు పారదర్శకతను పాటిస్తూ అర్హుల ఎంపికను వేగవంతం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో దళారులను నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి, బంక సంపత్, సుగుణాకర్‌రెడ్డి, బాలు నాయక్, దేవేందర్‌రెడ్డి, మోహన్‌నాయక్, వీరు, సాయి తదితరులు పాల్గొన్నారు.

పండుగలు

స్నేహాన్ని పెంపొందిస్తాయి..

వక్ఫ్ బోర్డు ముతవళి హబీబున్నిసాబేగం

హసన్‌పర్తి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పండుగలు మనుషుల మధ్య స్నేహాన్ని పెంపొందిస్తాయని, మతవిద్వేషాలకు కాదని వక్ఫ్ బోర్డు ముతవళి హబీబున్నిసాబేగం అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రంలో ఆదివారం వక్ఫ్ బోర్డు ముతవళి హబీబున్నీసాబేగం ఆధ్వర్యంలో ఇస్లామిక్ నెల మొహర్రంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముతవళి మాట్లాడుతూ.. మన పూర్వీకుల నుంచి అనాదిగా వస్తున్న ఆచారాన్ని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. కులమతాలకతీతంగా జరుపుకునే పండుగలలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని సంతోషంగా నిర్వహించుకోవడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ముతవళి కుటుంబ సభ్యులు సయ్యద్ అబ్జల్, కరీం, సయ్యద్ సుభాని, సయ్యద్ అబ్దుల్ ఖయ్యూమ్, సయ్యద్ సదీమ్, మహ్మద్ జావిద్ అలీ, మహ్మద్ రియాన్ అలీ, సయ్యద్ ఫసియొద్దిన్, మహ్మద్ జయిద్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం శాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గ కాలనీ, వాసవి కాలనీ, అంజనేయస్వామి టెంపుల్ ఏరియా, హంటర్‌రోడ్డు, టెంపుల్ ట్రీ విల్లాస్ ఏరియాలో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు, బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని బస్‌స్టేషన్, మల్లికాంబ, రాజ్‌పుత్‌వాడ, పద్మాక్షికాలనీ, ఎస్ఆర్ కళాశాల, జయ నర్సింగ్ కళాశాల ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

పొగాకు ఉత్పత్తులు పట్టివేత

వరంగల్ క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నయీంనగర్ రంగ్‌బార్ సమీపంలోని కిరాణం షాపులో రూ.4,500 విలువ చేసే నిషేధిత పొగాకు ఉత్పత్తులను ఆదివారం పట్టుకున్నట్లు హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు. నిర్వాహకుడు గోడిశాల మహేందర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. పొగాకు ఉత్పత్తులను పట్టుకున్న ఎస్సై కిశోర్‌ను అభినందించారు.

మొక్కలతో పర్యావరణ రక్షణ

» నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి
» ఎన్ఐటీలో కెనరా బ్యాంక్ ప్లాంటేషన్



ప్లాంటేషన్‌లో పాల్గొన్న నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి, కెనరా బ్యాంక్ అధికారులు

హనుమకొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ అని, చెట్లు లేకపోతే మానవాళికి మనుగడే లేదని వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి అన్నారు. ఆదివారం కెనరా బ్యాంక్ 120వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాజీపేటలోని జాతీయ సాంకేతిక విద్యాసంస్థ (ఎన్ఐటీ)లో మెగా ప్లాంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ సుబుధి మొక్క నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్తు తరాలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కెనరా బ్యాంకు అధికారులు, సిబ్బందికి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయం అన్నారు. హనుమకొండలోని కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌తో పాటు ప్రొఫెసర్లు, కెనరా బ్యాంకు అధికారులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ డివిజన్ మేనేజర్ పంకజ్ కుమార్, సంజీవ్‌కుమార్, బీజే శంకర్ నారాయణ్, బి.రాజేశ్, ఎన్ఐటీ ప్రొఫెసర్లు డి.శ్రీనివాసాచార్య, పీవీ సురేష్, కిరణ్ కుమార్, మురళీ మోహన్, వి.రాంసాగర్, కేఎస్ రాజ్ మోహన్, కెనరా బ్యాంక్ మేనేజర్లు తలారి శ్రీనివాస్, బిశ్వజిత్, రాజ్‌నారాయణ, రాజ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ లిఫ్ట్ ఎలివేటర్ ప్రారంభం

బాలసముద్రం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని శ్రీరామకృష్ణా సేవా మందిరంలో ఏర్పాటు చేసిన సోలార్ లిఫ్ట్ ఎలివేటర్‌ను బహూకరించిన దాతలు గాజులపల్లి గోపాల్‌రెడ్డి ఆయన కుమారుడు రవీందర్‌రెడ్డి (ఎన్ఆర్ఐ) 10 కిలో వాట్ల సోలార్ సౌకర్యం కల్పించిన వరంగల్ క్రెడాయ్ ఛైర్మన్ ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. గోపాల్‌రెడ్డి సతీమణి గాజుల సత్తెమ్మ జ్ఞాపకార్థంగా సుమారు రూ.6.50లక్షల వ్యయంతో మందిరానికి లిఫ్ట్‌ను బహూకరించారు. జీ ప్లస్3 అంతస్థుల్లో నిర్మించిన మందిరానికి లిఫ్ట్ సౌకర్యం ఎంతగానో ఉపయోగపడనుంది. ప్రారంభోత్సవంలో క్రెడాయ్ అధ్యక్షుడు నాయిని అమరేందర్‌రెడ్డి, శివానంద కల్చరల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు త్రిపురనేని గోపిచంద్, చింతగట్టు గోశాల నిర్వాహకులు సజ్జన రమేశ్, శ్రీసాయి ఆనంద సేవాట్రస్టు అధ్యక్షుడు చిన్నాల రంగయ్య, హనుమకొండ శ్రీసాయిబాబా దేవాలయ ట్రస్ట్ పీఆర్వో నిమ్మల శ్రీనివాస్, ఓరుగల్లు హోమియో మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, యోగా గురువు దేవం సత్తయ్య, శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు కటంగూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ పదవిని వెంకట్‌రెడ్డికి కేటాయించాలి



పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌తో ఎమ్మెల్యే నాగరాజు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి, తదితరులు

హసన్‌పర్తి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిని జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డికి ఇవ్వాలని కోరుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదివారం పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు వెల్లడించారు. ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిసిన వారిలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు విన్నింటి అనిల్‌రావు, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, బొమ్మిడి నాగేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాభివృద్ధి కమిటీ ఎన్నిక



శ్రీనివాసరావు



సరోత్తంరెడ్డి

వడ్డెపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులోని కల్యాణ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ అశోక కాలనీలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు బాల్నే రామయ్య, వెంకటేశ్వర్‌రావు, సోమేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింత శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా మంద సరోత్తంరెడ్డి, కోశాధికారిగా వింజమూరి సుధాకర్‌స్వామిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అశోక కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మందల కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బూర రాంచందర్‌రావు పాల్గొన్నారు.

చెరువుల్లో గుర్రపు డెక్క

» మృత్యువాత పడుతున్న చేపలు
» నష్టపోతున్న మత్స్యకారులు
» గుర్రపు డెక్క, తుంగను తొలగించాలని కోరుతున్న మత్స్యకారులు

వడ్డెపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : చెరువుల్లో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క మత్స్యకారులకు గుదిబండగా మారింది. చేపలు ఎదగక పోవడంతో చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు నష్టపోతున్నారు. ప్రభుత్వమే చెరువుల్లో పెరిగిన గుర్రపు డెక్కతో పాటు తుంగను ఇతర మొక్కలను తొలగించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క

హనుమకొండ నగరాన్ని ఆనుకొని ఉన్న వడ్డెపల్లి చెరువు, బంధం చెరువు, గోపాల్‌పూర్ ఊర చెరువు, గోపాల్‌పూర్ శివారులోని అరకల సాయికుంటలో గుర్రపు డెక్కతోపాటు తుంగ మొక్కలు ఏపుగా పెరిగాయి. గుర్రపు డెక్కతోపాటు ఇతర నిరుపయోగమైన మొక్కలు పెరిగి చేపలు ఎదగడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. నిరుపయోగమైన తుంగ మొక్కలు, గుర్రపు డెక్క తదితర మొక్కలు చెరువులను ఆవరించి పెరగడంతో చేపల వేట కోసం తాము వేస్తున్న వలలు దెబ్బ తింటున్నాయని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. వడ్డెపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో 300 మంది సభ్యులు ఉన్నారు. వీరంతా చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ మత్స్యకారులంతా హనుమకొండ నగర శివారులోని వడ్డెపల్లి చెరువు , బంధం చెరువు, గోపాల్‌పూర్ ఊర చెరువు, అరకల సాయికుంటలలో చేపలను వేటాడుతూ జీవనం సాగిస్తున్నారు. గత మూడేళ్ల నుంచి చెరువుల్లో నిరుపయోగమైన మొక్కలు ఏపుగా పెరిగి చేపలు వృద్ధి చెందకుండా ఉండడంతోపాటు వలలు సైతం మొక్కల వలన దెబ్బతినడంతో తాము ఉపాధి కోల్పోతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. చెరువుల్లో కొంత మంది చికెన్ సెంటర్ వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను సైతం వేయడం వలన అవి మురిగిపోయి దుర్వాసతో చేపలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంటనే ప్రభుత్వం తొలగించి తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.



వడ్డెపల్లి చెరువులో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క, తుంగ

గుర్రపు డెక్కను తొలగించాలి



వడ్డెపల్లి చెరువులో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క, తుంగ మొక్కలు, నాచును వెంటనే తొలగించాలి. వీటితో చెరువుల్లోని చేపలు ఎదగక పోవడంతో పాటు వలలు సైతం దెబ్బతిని మత్స్యకారులు నష్టపోతున్నారు. కోళ్ల వ్యర్థాలను చెరువుల్లో వేయకుండా జీడబ్ల్యూఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలి. పూర్తి రాయితీపై వలలు, మోపెడ్‌లను ప్రభుత్వం మత్స్యకారులకు అందించి వృత్తిని ప్రోత్సహించి ఆదుకోవాలి.

మట్టేపల్లి నర్సింగం, వడ్డెపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు



బంగారం మొక్క!

ఈ ప్రకృతిలో అనేక అద్భుతాలు ఉన్నాయి. చాలా సార్లు అవి మన కళ్ల ముందే కనిపిస్తూ ఉంటాయి. కానీ వాటి ప్రాముఖ్యం తెలియక పట్టించుకోం. అలాంటి ఒక మొక్క ఉచ్చి ఉసిరిక. ఈ మొక్క ఆకులలో నానో బంగారు కణాలు ఉంటాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఆ మొక్క గురించి మరిన్ని వివరాలు తెలుసుకుందాం.

నీళ్ల ఎక్కువగా లభించని ప్రాంతాల్లో ఉచ్చి ఉసిరిక మొక్క ఎక్కువగా పెరుగుతుంది. ఈ మొక్కకు ఫిలంథస్ విర్గాటస్ అనే శాస్త్రీయ నామం ఉంది. ఈ మొక్క 30 నుంచి 60 సెంటీమీటర్ల ఎత్తు పెరుగుతుంది. పొదలా గుబురుగా వ్యాపిస్తుంది. దీని ఆకులు చిన్నగా ఉంటాయి. ఈ మొక్కకు ఎర్రటి పువ్వులు పూస్తాయి. ఈ పూల నుంచి చిన్న చిన్న కాయలు కాస్తాయి. మొదట పచ్చగా ఉన్నా.. బాగా పండిన తర్వాత బ్రౌన్ రంగులోకి మారతాయి. ఈ మొక్కను ఆయుర్వేద వైద్యంలో కొన్ని వేల ఏళ్లుగా కామెర్లు, జీర్ణ కోశ సమస్యలు, చర్మ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తున్నారు. ఇక ఈ మొక్క ఆకుల నుంచి నానో బంగారం కణాలు సంగ్రహించవచ్చని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ దిశగా అనేక ప్రయోగాలు జరుగుతున్నాయి. నీళ్ల సదుపాయం ఎక్కువగా లేని ప్రాంతాల్లో ఈ మొక్కను పెంచుకోవటం వల్ల అనేక రకాల ప్రయోజనాలు ఉంటాయి.

• డాక్టర్ శ్రీనాథ్,
ఫోన్: 94930 02124
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్





మమ్మల్ని అలా చూడొద్దు

అందరు పిల్లాల్లానే బాల్యం ఆడుతూ పాడుతూ సాగిపోయేది. కానీ... వయసు పెరుగుతున్నకొద్దీ చూపు మందగించింది. దీంతో అన్నింటా వెనకడుగు... అది ఆమెను కుంగదీసింది. అయితే తల్లిదండ్రుల సహకారంతో ప్రతికూలతలను అనుకూలంగా మార్చుకుంది. అంధుల క్రికెట్‌తో పాటు పారా క్రీడల్లోనూ రాణిస్తోంది.. సిద్దిగాడ్రి హంసిక. తన ఈ ప్రయాణంలో ఎదురైన సవాళ్లు, సమస్యలు, వాటిని అధిగమించిన తీరును ఆమె 'నవ్య'తో పంచుకుంది.

"ఎన్నో ఆశలు.. అందమైన ఊహలు.. జీవితంలో ఏవేవో సాధించాలని కలలు కన్నాను. కానీ అవన్నీ కల్లల య్యాయి. ఇకపై నేను మునుపటిలా చూడలేనని వైద్యులు చెప్పడంతో ఎంతో కుమిలిపోయా. కానీ అంతటి తోనే ఆగిపోవాలని అనుకోలేదు. నాలాగా చూపు లేని వారు ఎందరో అద్భుతాలు చేస్తున్నారు. అలాంటివారి స్ఫూర్తితో అడుగు ముందుకు వేశాను. మాది దిగువ మధ్య తరగతి కుటుంబం. నాన్న ప్రభు.. పాలకోవా తది తర పాల ఉత్పత్తులు విక్రయించి కుటుంబాన్ని పోషి స్తారు. అమ్మ గాయత్రి... నాన్నకు చేదోడు వాదోడుగా ఉంటోంది. ముగ్గురు సంతానంలో నేనే పెద్దదాన్ని. చెల్లి హాసిని, తమ్ముడు అర్జున్ నాకు అన్ని విషయాల్లో తోడుగా ఉంటారు. సికింద్రాబాద్ పద్మారావునగ ర్‌లో ఒక చిన్న ఇంట్లో అద్దెకు ఉంటున్నాం. నాలుగో తరగతి వరకు నేను చదువు, క్రీడల్లో ముందుండేదాన్ని. పాఠశాలలో, ఇంటర్ స్కూల్ పోటీల్లో... పాల్గొన్న ప్రతి ఈవెంట్‌లో ఫస్ట్ వచ్చేదాన్ని. ఆ తర్వాత నాకున్న కంటి చూపు సమస్యతో అన్నింట్లో వెనకబడడం మొదలైంది. తొలుత సాధారణంగా వచ్చే చూపు మాంద్యం అని వైద్యులు ఇచ్చిన కళ్లద్దాలు ఉపయోగించా. నాకు 13 ఏళ్లు వచ్చేసరికి సమస్య మరీ ఎక్కువ కావడంతో హైపవర్ లెన్స్ వాడాను. అవి పెట్టుకున్నాక మైగ్రేన్ నొప్పి, కళ్లల్లో నుంచి విపరీతంగా నీళ్లు కారడంతో ఆ కళ్లద్దాలు పక్కన పెట్టేశాను.

ఆస్పత్రికి వెళితే..

కొందరి సలహా మేరకు సరోజినీ దేవి కంటి ఆస్పత్రికి అమ్మా నాన్న నన్ను తీసుకెళ్లారు. కళ్లలోని రెటీనాలో చుక్కలు ఉండడంతో ఒక అడుగు దూరానికి మించి ఏమీ చూడలేవని వైద్యులు చెప్పారు. అది విని నా గుండె ఆగి నంత పనైంది. మా కుటుంబం షాక్‌లోకి వెళ్లిపోయింది. ఇది చాలా అరుదైన సమస్య అని, దీనికి చికిత్స లేదని వైద్యులు చెప్పారు. నాకు 80 శాతం పైగా అంధత్వం ఉందని సర్టిఫికెట్ ఇచ్చారు. ఆయుర్వేదంతో పాటు పలు రకాల వైద్యం చేయించుకున్నా ఫలితం కనిపించలేదు.

ఎగతాళి చేసేవారు..

నేను ఏదైనా ఒక వస్తువునే చూడగలను. దాని చుట్టూ ఉన్నవి అలికినట్టు కనపడతాయి. బాల్యంలో నా సమ స్యను ఎవరికీ చెప్పుకోలేకపోయాను. ఒకసారి స్కూల్‌లో పరుగెడుతున్నప్పుడు మధ్యలో స్తంభం అడ్డుంటే నాకు కనిపించక.. దాన్ని ఢీకొట్టా. ముక్కు నుంచి తీవ్ర రక్తస్రా వమైంది. నాకు క్రీడలంటే ఇష్టమున్నా అప్పటి నుంచి ఆటలకు దూరమయ్యా. చదువులోనూ వెనకపడ్డా. బోర్డు పైన అక్షరాలు సరిగ్గా కనిపించక, నోట్స్ రాయలేకపోయే దాన్ని. విన్న పాఠాలనే నెమరేసుకుని, అవే పరీక్షల్లో రాశాను. మంచి మార్కులు రానివారిని వెనుక బెంచీల్లో కూర్చొబెట్టేవారు. ఎందుకు సరిగ్గా చదవడం లేదని టీచర్లు తిట్టేవారు. నాకు కళ్లజోడు పెట్టుకున్నా ఏం కని పించదని తోటి విద్యార్థులు ఎగతాళి చేసేవారు. ఎనిమిదో తరగతికి వచ్చాక కానీ నా కంటి సమస్య గురించి ఉపాధ్యాయులకు తెలియలేదు. తర్వాత స్కూల్‌లో ఉపా ధ్యాయులు నా గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

అనుకోని మలుపు..

నాకున్న అంధత్వంతో సాధారణ స్కూల్‌లో చదవడం కష్టమనిపించి తొమ్మిదో తరగతి తర్వాత బేగంపేటలోని దేవనార్ అంధుల పాఠ శాలలో చేరా. అంతవరకు ఒక తరహా విద్యా విధానానికి అలవాటు పడిన నాకు, ఈ స్కూల్‌లో అంతా కొత్తగా అనిపించింది. దాంతో ఇంటర్మీడియేట్‌కు వచ్చేసరికి మళ్లీ సాధారణ కాలేజ్‌లో చేరి ఎంఈసీ పూర్తి చేశా. ఆ తర్వాత చినజీ యార్ స్వామి నేత్ర విద్యాలయ ట్రస్టులో బీకాం కంప్యూ టర్స్ చదివా. ఇక్కడకు వచ్చాక నా జీవితం అనుకోని మలుపు తిరిగింది. స్వామివారి సహకారంతో క్రికెట్, పవర్ లిఫ్టింగ్‌ల్లో శిక్షణ తీసుకోవడం ప్రారంభించా.

టీమిండియా ప్రాబబుల్స్‌లో..

నాకు క్రికెట్ అంటే బాగా ఇష్టం. నేత్ర విద్యాలయలో చేరిన తర్వాత క్రికెట్ అంటే ఆసక్తి ఉన్నవారితో కలిసి టీమ్ తయారు చేశా. నేను పేస్ ఆల్‌రౌండర్‌ని. ఎడమ చేతివాటం బౌలర్, కుడి చేతివాటం బ్యాటర్‌ని. రాష్ట్ర స్థాయిలో వివిధ అంధ పాఠశాల జట్లతో తలపడ్డాం. మా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాను. 2023లో జాతీయ స్థాయి అంధుల క్రికెట్ పోటీల్లో తెలం గాణ జట్టుకు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించా. ఈ టోర్నీలో ఉత్తమ బ్యాటర్, బౌలర్ అవార్డులతో పాటు బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ అవార్డు కూడా గెలుచుకున్నా. వచ్చే నవం బరులో ప్రపంచ మహిళల అంధుల క్రికెట్ వరల్డ్‌కప్ ఉంది. దాని కోసం టీమిండియాకు ఎంపిక చేసిన 29 మంది ప్రాబబుల్స్‌లో తెలంగాణ నుంచి నాకు మాత్రమే చోటు లభించింది. టీమిండియాకు ప్రాతినిథ్యం వహించా లనేది నా చిరకాల స్వప్నం. జట్టులో స్థానమే లక్ష్యంగా కఠోర సాధన చేస్తున్నా. 'క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లయిండ్'లో కర్ణాటకకు చెందిన శిఖా మేడమ్ నన్ను ఎంతో ప్రోత్సహిస్తున్నారు.

> **జాలి... దయ చూపించొద్దు...**
>
> 
>
> గుడ్డివాళ్లు అనగానే కొందరు జాలి, దయ చూపిస్తారు. మరికొందరు ఈసడిం చుకుంటారు. దయచేసి అలా ఎవరూ చూడవద్దు. ఇలా వ్యవహరించడం వల్ల తెలియకుండానే మాలో ఏదో ఆత్మనూన్యత భావన ఏర్పడతుంది. మమ్మల్ని సాధారణ వ్యక్తులుగానే చూడండి. అలానే ఆదరిం చండి. మా బంధువులు చాలా మంది నేను ఎదు రుపడినప్పుడు ఎక్కడలేని జాలి చూపిస్తారు. నేను కొంచెం పక్కకి వెళ్లాక 'ఇంట్లో ఒక మూల కూర్చోక ఈ గుడ్డి దానికి ఈ ఆటలు, పాటలు ఎందుక'ని నా వెనకాల తిడుతుంటారు. ఇలాంటి వాటిని పట్టించుకుంటే జీవితంలో ముందుకు వెళ్లలేం. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడడం పెద్ద తప్పు. మన కష్టం ఏదో మనమే పడాలి. ఎవరైనా సహాయం చేసినా అది కొంతవరకే. చివరి వరకు ఎవరూ తోడు ఉండరు. కాబట్టి ఒకరిపై ఆధారపడ కుండా మన కాళ్లపై మనమే నిలబడాలి.

పవర్‌లిఫ్టింగ్‌లో...

నా శరీర దారుఢ్యం బట్టి క్రికెట్‌తో పాటు అథ్లెటిక్స్‌లో కూడా పాల్గొనమని నేత్ర విద్యాలయలో కృష్ణ కుమారి మేడం ప్రోత్సహించారు. అలా 2020లో జరిగిన రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్, డిస్కస్ త్రో, 100 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించా. తాజాగా తొలిసారిగా జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో పాల్గొన్నా. గత నెల ఉడుపీలో జరిగిన ఈ పోటీల్లో 69 కిలోల విభాగంలో 155 కిలోల బరువెత్తి స్వర్ణ పతకం సాధించి, జాతీయ చాంపియన్‌గా నిలిచా. ఎల్బీ స్టేడియంలో శాట్ కోచ్‌లు రవి, ప్రవీణ్ సార్‌లు అతితక్కువ కాలంలో నన్ను ఈ పోటీలకు సిద్ధం చేశారు. ఇప్పటివరకు నేను ఏ పోటీల్లో బరిలోకి దిగాలన్న చినజీ యర్ స్వామి ట్రస్టు సాయంతోనే పాల్గొనగలిగా. ఆ విష యంలో స్వామివారికి జీవితాంతం రుణపడి ఉంటా.

రోడ్డు ప్రమాదంతో..

మూడేళ్ల కిందట నేను ముచ్చింతల్ నేత్ర విద్యాల యంలో చదువుతున్నప్పుడు రోడ్డు ప్రమాదంలో నేను నాన్న గాయపడ్డాం. నాన్నతో బైక్ మీద విద్యాలయంకు వెళుతుండగా. వేరే వాహనం ఢీకొట్టింది. నా మోకాలికి దెబ్బ తగిలింది. నాన్న వెన్నులో ఎముకలు విరగడం వల్ల శస్త్రచికిత్స చేశారు. అప్పటి నుంచి నాన్న మూడేళ్లు మంచానికే పరిమితమయ్యారు. దీంతో మా కుటుంబ ఆర్థిక పరిస్థితి తలకిందులైంది. అమ్మపైనే కుటుంబ భారం పడింది. ఇప్పుడిప్పుడే నాన్న కాస్త నడవగలుగు తున్నారు. నా లక్ష్యం ఒక్కటే క్రికెట్‌లో బాగా రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలి. తర్వాత సొంతంగా ఏదైనా వ్యాపారం చేయాలి. మంచి వ్యాపారవేత్తగా గుర్తింపు పొందాలి."

• ఎస్.ఎస్.బి.సంజయ్

ఆశయం సమున్నతం

స్ఫూర్తి

క్రికెట్‌లో అంపైరింగ్ అనగానే మనకు వెంటనే గుర్తుకువచ్చేది మగ వారే. కానీ ఇప్పుడిప్పుడే ఆడవారు కూడా ఆ పాత్రలోకి ఒదిగి పోతున్నారు. కేవలం మహిళల మ్యాచ్‌లకే పరిమితం కాకుండా... పురుషుల ఆటకు కూడా అంపైరింగ్ చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తు న్నారు. అలాంటి ఔత్సాహికుల్లో ఒకరు... వెంకటేశన్ కృతిక. చెన్నైకు చెందిన ఆమె... ఇటీవల క్రికెటర్ అశ్విన్ వివాదంతో వార్తల్లో వ్యక్తి అయ్యారు. అంపైర్లుగా అంతర్జాతీయ క్రికెట్‌లో తమదైన ముద్ర వేసిన బృందా రతి, గాయత్రి వేణుగోపాలన్ స్ఫూర్తితో అడుగులు వేస్తున్న కృతిక జర్నీ ఇది.



క్రికెట్ అంటే కృతికకు చిన్నప్పటి నుంచీ చాలా ఇష్టం. బ్యాటింగ్, బౌలింగ్.. రెండింటిలో ఆమెకు మంచి ప్రవేశం ఉంది. తమిళనాడు మహిళల జట్టు తరఫున ఎన్నో మ్యాచ్‌లు ఆడారు. ఆటకు సంబంధిం చిన ప్రతి అంశాన్నీ కూలంకషంగా పరిశీలించడమే కాదు... చక్కగా వివరించగలగడం ఆమె ప్రత్యేకత. మహిళల టీ20 లీగ్ మ్యాచ్‌లకు వ్యాఖ్యాతగా ఆమె అందరికీ సుపరిచితురాలు. తమిళనాట నిర్వహించిన పురుషుల టీ20 సహా పలు ఇతర మ్యాచ్‌లకూ అంపై ర్‌గా వ్యవహరించారు. నైపుణ్యం ఉన్న క్రీడాకారిణు లను గుర్తించే టాలెంట్ స్కౌట్‌గా కూడా పని చేశారు. 2023 మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెం జర్స్ బెంగళూరు జట్టుకు క్రీడాకారిణులను ఎంపిక చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారు. గత ఏడాది తమిళనాడు ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌కు రిజర్వ్ అంపై ర్‌గా వ్యవహరించారు. ఈ క్రమంలో ఆమె ఎన్నో ఒదు దొడుకులను ఎదుర్కొన్నారు. 'ఆడవారికైనా... మగవారి కైనా అంపైరింగ్ అనేది ఒకేలా ఉంటుంది. నియమ నిబంధనల్లో తేడా ఉండదు. అంపైరింగ్‌లో తీవ్ర ఒత్తి డిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. కొన్ని మ్యాచ్‌లు చాలా గంభీరంగా ఉంటాయి. కొన్ని అహ్లాదకరంగా సాగిపో తుంటాయి. ఆట తీరు ఎలా ఉన్నా అంపైర్ మాత్రం స్థిరంగా ఉండాల్సిందే" అంటారు కృతిక.

కుటుంబమే బలం...

'మగవారికి మాత్రమే పరిమితం అనే భావనను అధిగమించి ఇక్కడి దాకా ఎదిగానంటే అందుకు నా కుటుంబం అందించిన తోడ్పాటు మరువలేనిది. రాష్ట్రాలు దాటి ప్రయాణించడం నా వృత్తిలో భాగం. దీనికి తల్లిదండ్రులు, అత్తమామలు, భర్త, పిల్లలు సహకరించడం నా అదృష్టం. మొదట్లో పురుషుల మ్యాచ్‌లకు ఒక మహిళ అంపైర్‌గా వ్యవహరించడం అనేది సందేహాత్మకంగా ఉండేది. రానురానూ ఈ ధోరణి మారింది. క్రమేణా ఆటగాళ్లందరూ మమ్మల్ని అంగీకరించి సహకరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అభినందిస్తున్నారు కూడా. ఈ పరిస్థితి... అంపైర్లుగా రాణించాలనుకునే మహిళలకు ప్రోత్సాహాన్ని, ధైర్యాన్ని అందిస్తుంది. తమిళనాడు ప్రీమియర్ లీగ్ పురుషుల మ్యాచ్‌కు అంపైర్‌గా పనిచేయడం నాకు మంచి గుర్తింపునిచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో జరిగే మ్యాచ్‌లకు అంపైరింగ్ చేయాలన్నదే నా కల. దానిని నెరవేర్చుకోవడం కోసం అహర్నిశలూ శ్రమి స్తూనే ఉంటాను" అంటూ తన భావాలు పంచుకు న్నారు కృతిక.

> 'మగవారికి మాత్రమే పరి మితం అనే భావనను అధిగమించి ఇక్కడి దాకా ఎదిగానంటే అందుకు నా కుటుంబం అందించిన తోడ్పాటు మరువలేనిది. రాష్ట్రాలు దాటి ప్రయాణించడం నా వృత్తిలో భాగం. దీనికి తల్లిదండ్రులు, అత్త మామలు, భర్త, పిల్లలు సహకరిం చడం నా అదృష్టం.

ఆ వివాదంతో...

తమిళనాడు ప్రీమియర్ లీగ్ సీజన్‌లో దిండిగల్ డ్రాగన్స్, ఐడ్రీమ్ తిరుప్పూర్ తమిళియన్స్ మధ్య జరి గిన మ్యాచ్‌లో వివాదాస్పద సంఘటన చోటు చేసు కుంది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొడుతోంది. దిండిగల్ డ్రాగన్స్ జట్టుకు సారథ్యం వహించిన స్టార్ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్... సాయి కిషోర్ వేసిన బంతిని స్వీప్ షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. కానీ బంతి ప్యాడ్‌లకు తగిలింది. దీంతో అంపైర్ కృతిక ఎల్‌బీడబ్ల్యూగా ప్రకటించారు. వెంటనే అశ్విన్ కోపంగా అంపైర్ దగ్గరకు వెళ్లి బంతి లెగ్‌స్టంప్ బయట పిచ్ అయిందంటూ వాదించాడు రీప్లేలో అది నిజమని తేలినా... అప్పటికే డ్రాగన్స్ జట్టు రెండు రివ్యూలూ కోల్పోవడంతో అశ్విన్ రివ్యూకు వెళ్లలేకపో యాడు. అయితే కృతిక.. ఇవేమీ పట్టించుకోకుండా మౌనంగా ఉన్నారు. మైదానాన్ని వీడుతూ అశ్విన్ కోపంగా బ్యాట్‌తో తన ప్యాడ్‌లను కొట్టుకున్నాడు. గ్యాలరీలోకి గ్లౌవ్స్ విసిరేశాడు. ఒక మహిళ అంపైర్‌పై అశ్విన్ ఇలా కోపం ప్రదర్శించడంతో సర్వత్రా విమ ర్శలు వెల్లువెత్తాయి. అశ్విన్ కోపాన్ని అర్థం చేసుకుని అంపైర్ కృతిక హుందాగా ప్రవర్తించారంటూ నెటి జన్లు అభినందిస్తున్నారు.

ఆసనాలతో పొట్ట తగ్గిద్దాం!

మారిన జీవనశైలి, ఎక్కువ సేపు కూర్చుని పనిచేయడం వంటి కారణాలతో ఈ రోజుల్లో పొట్ట పెరగడం సాధారణం అయిపోయింది. అయితే కొన్ని యోగా ఆసనాలతో ఆ పొట్టను తగ్గించుకోవచ్చు. అవేంటో తెలుసుకుందాం..



నౌకాసనం : ముందుగా నేలమీద కాళ్లను చాపి కూర్చో వాలి. తర్వాత చేతులను తొడల కింద పెట్టి రెండు కాళ్లను పైకి లేపాలి. అలా లేపుతూ శరీరాన్ని కొంచెం వెనక్కి వంచాలి. ఇలా శరీరం V ఆకారంలోకి వచ్చేలా చేయాలి. తర్వాత చేతులను నిటారుగా చాపాలి. ఇప్పుడు శరీరం బరువంతా పిరుదుల మీద ఉంటుంది. 10-20 క్షణాల పాటు ఇలానే ఉండాలి. కొన్ని రోజులు అలవాటు అయిన తరువాత సమయం పెంచుకోవాలి. ఈ ఆసనం వలన పొట్టభాగంలోని కండరాలు కదిలి కొవ్వు తగ్గి పొట్ట తగ్గుతుంది. అలాగే జీర్ణక్రియ పెరుగుపడుతుంది. పొట్ట భాగానికి రక్తప్రసనరణ మెరుగుపడుతుంది.



సేతు బంధ సర్వాంగాసనం : ముందుగా నేలపై పడుకోవాలి. మోకాళ్లను మడిచి భూజాలు, చేతులను నేలమీద ఆధారం చేసి నడుమును పైకి లేపాలి. ఇలా 20-30 క్షణాల పాటు ఉండాలి. ఆ భంగిమ మెటబాలిజంను మెరు గుపరుస్తుంది. కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది.



కుంభకాసనం : చేతులను నేలకు ఆనించి పుష్-అప్స్ చేసే భంగిమలో ఉండాలి. ఇలా నడుపు, కాళ్లు వంచకుండా 20-30 క్షణాల పాటు ఉండాలి. ఈ ఆసనం వలన పొట్ట భాగం లోని కొవ్వు తగ్గుతుంది. అలాగే చేతులు, నడుము బలంగా మారుతాయి.




భుజంగాసనం : ముందుగా నేలపై బోర్లా పడుకోవాలి. అర చేతులను నేలకు ఆనించి వాటి ఆధారంతో మెడను పైకి ఎత్తాలి. అరచేతులు నడుము కింద భాగం మాత్రమే నేలకు ఆనాలి. ఇలా 20- 30 సెకన్ల పాటు ఉండి నెమ్మదిగా మాములు స్థితికి రావాలి. ఈ భంగిమ వలన పొట్ట, నడుము కండరాలు బలపడతాయి. ఒత్తిడి కూడా తగ్గుతుంది. పొట్ట భాగంలోని కొవ్వు తగ్గుతుంది.



త్రికోణాసనం : ముందు కాళ్లను దూరంగా పెట్టి నిల్చోవాలి. ఇప్పుడు కుడి కాలిని కొంచెం దూరంగా జరిపి ఆ పక్కకు వంగి కుడి చేతితో ఆ కాలి పాదాలను తాకాలి. ఈ సమయంలో ఎడమ చేతిని నిటారుగా పైకి లేపాలి. ఓ ఇరవై క్షణాల పాటు అలా ఉండి మాములు స్థితి రావాలి. ఇప్పుడు ఇలానే ఎడమ వైపు కూడా చేయాలి. ఈ ఆసనం పొట్టను తగ్గిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. నడుము, కాళ్లు, చేతులను బలోపేతం చేస్తుంది.

సగ్గు బియ్యంతో ఇన్ని ఉపయోగాలా!



సగ్గుబియ్యంతో చేసిన వంటలు ఇష్టపడని వారు ఉండకపోవచ్చు. జ్వరం, విరోచనాలు వంటి సమస్యలు పీడిస్తున్నప్పుడు సగ్గుబియ్యం జావ, పాయసం నీరసం నుంచి ఉపశమనం కలిగిస్తాయి.. అలాంటి సగ్గుబియ్యం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలివీ..

- బరువు తగ్గాలనుకునేవారికి సగ్గుబియ్యం ఓ వరంలాంటిది. ఇందులోని అధిక ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. అలాగే ఇందులో క్యాలరీలు కూడా తక్కువ కావడంతో బరువు తగ్గేందుకు బాగా సహాయపడుతుంది.
- సగ్గుబియ్యంలో ఉండే క్యాల్షియం ఎముకల ధృఢత్వానికి దోహదం చేస్తుంది.
- సగ్గుబియ్యం జావ శరీరంలో వేడిని తగ్గిస్తుంది.
- శరీరంలో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేయడంలో సగ్గుబియ్యం సహాయపడతాయి.
- సగ్గుబియ్యంలోని పొటాషియం అధిక రక్తపోటును నియంత్రిస్తుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

నేరేడు ప్రయోజనాలెన్నో!

నేరేడు పళ్ల సీజన్ వచ్చింది. నల్లగా నిగనిగలాడుతూ చూడగానే తినేయాలనిపించే ఈ పళ్ల వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఆ వివరాలు తెలుసుకుందాం..



- నేరేడు పళ్లలోని జాంబోలిన్, జాంబోసిన్ అనే ఫైటో కెమికల్స్ ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. దాంతో రక్తంలో చక్కెర స్థాయులు నియంత్రణలో ఉంటాయి.
- ఈ పళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది.
- నేరేడు పళ్లలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడతాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- ఈ పళ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.
- వీటిలోని విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఫ్రీ రాడికల్స్ నుంచి కణాలను రక్షిస్తాయి.
- నేరేడు పళ్లలోని ఐరన్ రక్తహీనతను దూరం చేస్తుంది.
- వీటిలోని పొటాషియం, కాల్షియంలు ఎముకలు, దంతాల ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- నేరేడు పళ్లలోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు నోటిలోని ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి. అలాగే మాడు మీద ఇన్ఫెక్షన్లను తగ్గించి, శిరోజాల పెరుగుదలకు సహాయపడతాయి.
- వీటిలోని విటమిన్ సి, యాంటి ఆక్సిడెంట్లు.. మచ్చలు, గాయాలను తగ్గించి చర్మం మెరిసేలా చేస్తాయి.

దిక్సూచి

ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్లు

భాళీలు 541

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 541 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎస్సీ: 80, ఎస్టీ: 73, ఓబీసీ: 135, ఈడబ్ల్యూఎస్: 50, యూఆర్: 203

అర్హత: గ్రాడ్యుయేషన్. ఫైనలియర్ విద్యార్థులూ దరఖాస్తు చేయొచ్చు. అయితే 2025 సెప్టెంబర్ 30వ తేదీ లోగా డిగ్రీ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. మెడిసిన్, ఇంజనీరింగ్, సీఏ తదితర విద్యార్థులూ అర్హులే.

వయస్సు: 2025 ఏప్రిల్ 1 తేదీ నాటికి వయస్సు 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్ అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

చివరి తేదీ: 2025 జూలై 14

వెబ్‌సైట్: https://sbi.co.in/

State Bank of India

బ్యాంకింగ్ ఉద్యోగాలు

ప్రొబేషనరీ ఆఫీసర్/ మేనేజ్‌మెంట్ ట్రైనీ

భాళీలు 5208



ప్రొబేషనరీ ఆఫీసర్లు/ మేనేజ్‌మెంట్ ట్రైనీల కోసం ఐబీపీఎస్ (ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్) నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 11 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో దాదాపు 5208 పోస్టులు ఉన్నాయి.

అర్హత: గ్రాడ్యుయేషన్

వయస్సు: 2025 జూలై 1 తేదీ నాటికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్ అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల కోసం ఈ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నారు.

చివరి తేదీ: 2025 జూలై 21

వెబ్‌సైట్: https://www.ibps.in/

Institute of Banking Personnel Selection

స్పెషలిస్ట్ ఆఫీసర్లు

భాళీలు 1007

పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో 1007 స్పెషలిస్ట్ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ కోసం ఐబీపీఎస్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఐబీపీఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: పోస్టులను అనుసరించి బీఎస్సీ, బీటెక్, ఎల్ఎల్‌బీ, ఎంఏ, ఎంఆర్క్, ఎంఈ/ ఎంటెక్, ఎంబీఏ/పీజీడీఎం, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయస్సు: 2025 జూలై 1 తేదీ నాటికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 జూలై 21

వెబ్‌సైట్: https://www.ibps.in/

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ జాబ్స్

మల్టీ టాస్కింగ్ స్టాఫ్(నాన్ టెక్నికల్)

పోస్టులు 1075

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ మల్టీ టాస్కింగ్ స్టాఫ్(నాన్ టెక్నికల్), హవల్దార్(సీబీఐసీ అండ్ సీబీఎన్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 1075 పోస్టులు ఉన్నాయి. పదో తరగతి పాసైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లలను అనుసరించి గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. శారీర సామర్థ్యం, రాత పరీక్షల ఆధారంగా ఎంపిక ఉంటుంది.

చివరి తేదీ: 2025 జూలై 24 **వెబ్‌సైట్:** ssc.gov.in

జూనియర్ ఇంజనీర్లు

పోస్టులు 1340

వివిధ డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న 1340 జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీ కోసం ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంజనీరింగ్ డిప్లొమా, గ్రాడ్యుయేషన్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఖాళీల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రిల్ ఇంజనీర్ల పోస్టులు ఉన్నాయి(డిపార్ట్‌మెంట్ వారీగా ఖాళీల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు). **వయస్సు:** పోస్టులను బట్టి కొన్నింటికి 30, మరికొన్నింటికి 32 సంవత్సరాలు గరిష్ఠ వయోపరిమితి ఉంది. **చివరి తేదీ:** 2025 జూలై 22

వెబ్‌సైట్: ssc.gov.in/

కోర్ బ్రాంచెస్‌లో కీలకం మెకానికల్ ఇంజనీరింగ్

కోర్ ఇంజనీరింగ్‌లో ప్రధానమైన వాటిలో మెకానికల్ ఒకటి. యాంత్రీకరణతో కలిగిన ప్రయోజనాలు ఎన్నో. మానవ నాగరికతలో అది చెప్పుకోదగ్గ మైలురాయి. యంత్రం ఎలా పనిచేస్తుందో తెలియాలంటే మెకానికల్ ఇంజనీరింగ్‌పై అవగాహన ఉండాలి. ఈ డిసిప్లిన్‌పై అవగాహనకు తోడు అధ్యయనంతో వచ్చే ఉద్యోగాలు, కెరీర్ పరంగా ఎదుగుదల ఎలా ఉంటుందో చూద్దాం.

కదలిక ఉన్న పరికరాల డిజైన్, అభివృద్ధి, ఏర్పాటు, నిర్వహణ, మరమ్మతులు సహా సమస్తం మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి వస్తాయి. రోజువారీ జీవితం ఈ సబ్జెక్టుతో ముడిపడి ఉంది. బహుళ అంతస్తుల భవనం మొదలుకుని డ్రైవ్ చేసే వాహనం వరకు మెకానికల్ ఇంజనీరింగ్ ఉనికికి ఉదాహరణలే. ప్రాబ్లమ్ సాల్వింగ్ కూడా ఇందులో భాగం. సైన్స్, మేథ్స్ ఉపయోగించి మెకానికల్ ఇంజనీర్లు పలు సమస్యలకు పరిష్కారాన్ని కనుగొంటారు. ఫీల్డ్‌లో ఎదురయ్యే సమస్యలకు టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్‌తో మంచి పరిష్కారం చూపిస్తారు. అందుకే మెకానికల్ ఇంజనీర్లు బయోమెడికల్, మాన్యుఫాక్చరింగ్, కన్‌స్ట్రక్షన్, ఆటోమేటివ్ రంగాల్లో ఉపాధిని పొందగలుగుతున్నారు.



వివిధ బ్రాంచ్‌లు

మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి పలు బ్రాంచీలు వస్తాయి. అడిటివ్ మాన్యుఫాక్చరింగ్, అడ్వాన్స్‌డ్ మెకట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఆటోమేషన్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్, ఆటోమొబైల్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఆటోమేటివ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, మెకానికల్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్(అడిటివ్ మాన్యుఫాక్చరింగ్), మెకానికల్ అండ్ రైల్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్(ఆటోమొబైల్), మెకానికల్ ఇంజనీరింగ్(ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), మెకానికల్ ఇంజనీరింగ్(మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్), మెకానికల్ ఇంజనీరింగ్(ప్రొడక్షన్), మెకానికల్ ఇంజనీరింగ్(వెల్డింగ్ టెక్నాలజీ), మెకానికల్ ఇంజనీరింగ్ ఆటోమొబైల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిజైన్, మెకట్రానిక్స్ ఇంజనీరింగ్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, ఆటోమేటివ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, ఆటోమొబైల్ సర్వీసింగ్ వంటివన్నీ మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకే వస్తాయి.

కెరీర్ అవకాశాలు

కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్: పెద్ద పెద్ద నిర్మాణాల్లో కూడా మెకానికల్ ఇంజనీర్ అవసరం ఉంటుంది. వెంటిలేషన్, కూలింగ్, హీటింగ్ వంటి పనులు అక్కడ ఉండేవారికి ఎలాంటి అపాయం కలుగని రీతిలో ఉండేందుకు మెకానికల్ ఇంజనీర్ల సూచనలు, సలహాలు అవసరం.

ఆటోమేటివ్ ఇంజనీర్: ఆటోమోటివ్ ఇండస్ట్రీలో వివిధ వాహనాల ఉత్పత్తి, డిజైనింగ్‌లో వీరి సేవలు అవసరం. ఇందులో మళ్లీ కస్టమర్, మిలిటరీ వాహనాలంటూ ప్రత్యేకంగానూ ఉంటాయి. సురక్షితంగా కొత్త ఫీచర్లు, ప్రత్యామ్నాయ ఇంధనాలు, ఏరోడైనమిక్స్ తదితరాల్లో మెకానికల్ ఇంజనీర్ల పాత్ర ఉంటుంది.

రోబోటిక్ ఇంజనీర్: రోబోటిక్స్ నిర్మాణం, ప్లాన్, నిర్వహణలో పాలుపంచుకోవాలి. డిజైన్, టెక్నాలజీకి తోడు హెల్త్‌కేర్, మెడికల్ డివైజ్‌ల కోసం రోబోట్లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

ప్రాసెస్ ఇంజనీర్: తార్కికంగా ఆలోచించడం, సరికొత్తగా చేయాలన్న ఆలోచన - అమలుపై ఆసక్తి ఉన్న మెకానికల్ ఇంజనీర్లు బీటెక్ తరవాత ప్రాసెస్ ఇంజనీరింగ్‌ను ఎంచుకోవాలి. సంబంధిత విధానాల మెరుగుదలలో ప్రాసెస్ ఇంజనీర్ల పాత్ర ఇతోధికంగా ఉంటుంది. వాటర్ అండ్ పవర్ సప్లయ్, ఫార్మాస్యూటికల్స్, డ్రగ్ మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీలో వీరి అవసరం చాలా ఉంటుంది.

మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్: వస్తువుల ఉత్పత్తికి అవసరమైన మెషీన్ల డిజైనింగ్ మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్ పరిధిలోకి వస్తుంది. మెషీన్ విభాగాలు వేటినైనా వీరే రూపొందిస్తారు. అప్లయిన్సెస్ నుంచి ఫుడ్ వరకు వాటికి అవసరమైన పరికరాలను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

ప్రాజెక్ట్ మేనేజర్: వివిధ పనులను ప్రాజెక్టులుగా మలిచి టీమ్‌లను సదరు సంస్థలు నియమిస్తాయి. వారందరితో సక్రమంగా పనిచేయిస్తేనే సదరు ప్రాజెక్ట్ పని పూర్తవుతుంది. ప్రాజెక్టుకు మేనేజర్‌గా అనుభవం బాగా ఉన్న వ్యక్తులను నియమిస్తారు. తమ టీమ్‌లోని సభ్యులతో సమర్థంగా పనిచేయించడమే కాదు, ఫలితాలను రాబట్టే పనిని వీరు చేయాల్సి ఉంటుంది.

సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ ఇంజనీర్: కస్టమర్ బిల్డింగ్‌లో వీరుంటారు. యంత్రాలు సమర్థంగా, నిరంతరాయంగా పని చేసే విషయంలో నిమగ్నమై ఉంటారు. క్లయింట్ విజిట్స్, మెషీన్ల చెకింగ్, పనికిరానివాటిని తొలగించి కొత్తవాటిని ఉంచడం వంటి పనులు ఉంటాయి.

మెటీరియల్స్ ఇంజనీర్: వివిధ యంత్రాల ఉత్పత్తిలో మెటీరియల్ సేకరణ, పరీక్షించడం, మోడిఫై, ఎవాల్యుయేషన్ పనులు ఉంటాయి.

కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్: ఫ్యాక్టరీ లేదంటే పనిచేసే చోట పరిశోధన, డిజైన్, డెవలప్‌మెంట్, సిస్టమ్స్ ఇన్‌స్టలేషన్ పనులు ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ పక్కాగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వీరిదే.

ప్రొఫెసర్స్, లెక్చరర్స్: మెకానికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ లేదంటే యూజీసీ నెట్/ సీఎస్ఐఆర్ ఎగ్జామ్‌లో క్వాలిఫై అయితే ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో బోధకులుగా రాణించవచ్చు. అంటే అకడమిక్ వాతావరణంలో ఉండొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలు: యూపీఎస్సీ నిర్వహించే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్ రాసి ఎంపికైతే ఆరంభంలోనే మంచి జీతం, అధికారిక హోదా తద్వారా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను నిర్మించుకోవచ్చు. ప్రభుత్వంలో నీటిపారుదల వ్యవస్థలు మొదలుకుని పలు ఇతర విభాగాల్లో మెకానికల్ ఇంజనీర్లు అవసరమవుతారు.

ఆంత్రప్రెన్యూర్‌షిప్: బాస్‌గా మారడం అన్నమాట. సొంతంగా పైకి ఎదగాలన్న ఆకాంక్ష ఉంటే అందుకు సొంత ఆలోచనలు తోడైతే ఇండిపెండెంట్‌గా యూనిట్ పెట్టుకోవచ్చు. ఒకరి కింద పనిచేయాల్సిన అవసరం ఉండదు. తానే మరికొందరికి ఉపాధి కల్పించవచ్చు.



ప్రొ. ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

ప్రయోజనాలు

మనిషి దైనందిన జీవితంతో ముడిపడినది మెకానికల్ ఇంజనీరింగ్. అందులో భాగంగా వివిధ పరిశ్రమల్లో తలెత్తే సమస్యల పరిష్కారంలో మెకానికల్ ఇంజనీర్లు విశిష్ట పాత్రను పోషిస్తారు. మెషీన్స్‌కు సంబంధించి మాన్యుఫాక్చరింగ్, డిజైనింగ్, మెయింటెనెన్స్, అనాలిసిస్ కాన్సెప్టులు బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులో భాగం. ఈ నాలుగేళ్ళ కోర్సు మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఉజ్వల కెరీర్‌కు రహదారిని నిర్మిస్తుంది. మేథ్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, థియరీ ఆఫ్ మెకానిక్స్, మెషీన్ డ్రాయింగ్, కంప్యూటర్ గ్రాఫిక్స్ తదితరాలు కోర్సులో ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్, రీసెర్చ్, డిజైన్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించి నైపుణ్యాల పెంపునకు పై అంశాల అధ్యయనం ఉపయోగపడుతుంది. సంబంధిత నైపుణ్యాలకు పదునుపెట్టుకోవడం ద్వారా మాత్రమే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం లభిస్తుంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

యాక్షన్ థ్రిల్లర్



'సప్త సాగరాలు దాటి' చిత్రంతో చక్కని గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు హేమంత్‌రావు. ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో డాలీ ధనంజయ కథానాయకుడు. శివరాజ్‌కుమార్ కీలకపాత్ర పోషిస్తున్నారు. వైశాఖ్‌గౌడ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ మొదలైంది. ఈ సందర్భంగా డాలీ ధనంజయ లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. యాక్షన్‌తో పాటు ప్రేక్షకులను అలరించే అన్ని హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం, త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం అని మేకర్స్ తెలిపారు. పాన్ ఇండియా కంటెంట్‌తో రూపొందుతున్న చిత్రమిదని దర్శకుడు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్‌రాజ్, సినిమాటోగ్రఫీ: అద్వైత

కంటెంట్ ఉంటేనే కలెక్షన్లు

\- ఎస్‌కేఎన్



'ప్రస్తుతం సినిమాల్లో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్న ఏకైక అంశం మంచి కంటెంట్ మాత్రమే. సినిమా చిన్నదైనా, పెద్దదైనా ముందు కథ బావుండాలి. ప్రేక్షకుల అభిరుచి మారింది. ఎంత హంగామా చేసినా సినిమాలో కంటెంట్ లేకుంటే థియేటర్లకు రావడం లేదు. మంచి కథతో వచ్చిన సినిమాలే బాక్సాఫీసు దగ్గర నిలబడుతున్నాయి' అని నిర్మాత ఎస్‌కేఎన్ అన్నారు. ఆయన నిర్మిస్తున్న పలు చిత్రాల విశేషాలను ఆదివారం మీడియాతో పంచుకున్నారు.

- నిర్మాతను అవ్వాలని నేను ఇండస్ట్రీకి రాలేదు. అవకాశం వచ్చింది. అందిపుచ్చుకున్నాను. ఇప్పుడు హిందీలోనూ సినిమాలు చేస్తున్నాను. నిర్మాతగా నెగ్గుకు రావడం అంత సులభం కాదు. మన కష్టం అంతా ఒక్కరోజులో పోవచ్చు. పది రూపాయలు పెడితే ఇరవై రూపాయలు వస్తుందని నిర్మాణ రంగంలోకి అడుగుపెడితే నష్టపోతాం. ముందు ఈ రంగం పట్ల మక్కువ ఉండాలి.
- ప్రస్తుతం 'రాజాసాబ్' బ్యాలెన్స్ షూట్ పూర్తి చేసే పనిలో ఉన్నాం. కిరణ్ అబ్బవరంతో 'చెన్నై లవ్‌స్టోరీ' చేస్తున్నా. హిందీలో 'బేబీ' చిత్రం రీమేక్ చేస్తున్నాం. ఆగస్టులో చిత్రీకరణ మొదలుపెడతాం. దర్శకుడు మారుతి, సాయిరాజేశ్‌తో కూడా మా బేనర్‌లో సినిమాలు చేస్తున్నాం. ఇద్దరు కొత్త దర్శకులతో సినిమాలు చేయబోతున్నాం.
- నిర్మాతగా తక్కువ బడ్జెట్‌లో మంచి కథలతో సినిమాలు చేయడం, అవి ప్రేక్షకాదరణ పొందడం నాకు సంతోషాన్నిచ్చింది. ప్రస్తుతం పలు అగ్ర నిర్మాణ సంస్థలతో కలిసి సినిమాలు నిర్మిస్తున్నాను. ఇప్పటివరకూ కొందరు తెలుగమ్మాయిలను నా సినిమాల ద్వారా కథానాయికలుగా పరిచయం చేశాను. మరో ముగ్గురు తెలుగమ్మాయిలను పరిచయం చేయబోతున్నా. అలాగే మహిళా దర్శకులతోనూ సినిమాలు చేసేందుకు ప్లాన్ చేస్తున్నా.

తెలుగువారంటే వైల్డ్ ఫైర్

అమెరికాలో టాలీవుడ్ సినీ తారలు సందడి చేశారు. 'నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్)- 2025' వేడుకలో దర్శకులు రాఘవేంద్రరావు, సుకుమార్, హీరో అల్లు అర్జున్, హీరోయిన్ శ్రీలీల తదితరులు పాల్గొన్నారు.



తెలుగువారంటే ఫైర్ అనుకున్నారా... వైల్డ్ ఫైర్ అంటూ తన 'పుష్ప' చిత్రంలోని డైలాగ్‌తో ప్రసంగాన్ని ప్రారంభించిన అల్లు అర్జున్ సభికులను అలరించారు. 'ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎంతో సంతోషిస్తున్నా. ఇంతమంది తెలుగువారిని చూస్తుంటే హైదరాబాద్‌లోనో విశాఖపట్నంలోనో ఉన్నట్లు అనిపిస్తోంది. అమెరికాలో మనమంతా ఇలా కలవడం అదృష్టంగా భావిస్తున్నా. నన్ను ఇలాంటి అద్భుతమైన కార్యక్రమానికి ఆహ్వానించినందుకు నాట్స్‌కు ధన్యవాదాలు. నాట్స్ గురించి సరదాగా 'పుష్ప' స్టయిల్‌లో చెప్పాలంటే 'నాట్స్ అంటే నేషనల్ అనుకుంటివా... ఇంటర్నేషనల్'. మన తెలుగు సంస్కృతిని ముందు తరాలకు చేరవేస్తున్నందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. భారతీయులు ఎక్కడున్నా తగ్గేదేలే...అందులోనూ తెలుగోళ్లు అస్సలు తగ్గేదేలే. విదేశాల్లోనూ తెలుగువారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు' అని అల్లు అర్జున్ అన్నారు.

- దర్శకుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ 'నేను పరిచయం చేసిన బన్నీ, శ్రీలీల ఇక్కడ ఉన్నందుకు ఆనందంగా ఉంది. సుకుమార్‌కూ నాకూ ఒక పోలిక ఉంది. అదే గడ్డం. నేను 'అడవి రాముడు'లో అడవిని నమ్ముకున్నా. స్టార్ డైరెక్టర్‌ను అయ్యా. 'పుష్ప'లో అడవిని నమ్ముకున్న సుకుమార్ స్టార్ డైరెక్టర్ అయ్యారు. బన్నీని స్టార్ హీరోను చేశారు. శ్రీలీల సైతం దెబ్బలు పడతాయని అంటూ అందరినీ అలరిస్తోంది' అని అన్నారు.


నాకొక గుర్తింపును ఇచ్చారు

\- సమంత



'నేను ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా, ఏ పరిశ్రమలో పనిచేసినా ..తెలుగు ప్రేక్షకులు నన్ను చూసి గర్వపడాలని భావిస్తాను. ఇన్నేళ్ల ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచినందుకు ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాను. మీరంతా నాకంటూ ఒక గుర్తింపునూ, కుటుంబాన్నీ ఇచ్చారు' అంటూ భావోద్వేగానికి గురయ్యారు నటి సమంత. అమెరికాలో జరుగుతున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) వేడుకల్లో పాల్గొన్నారు సమంత. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ' తానా వేడుకల్లో పాల్గొనడానికి నాకు 15 ఏళ్ల పట్టిందంటే నమ్మలేకపోతున్నా. ప్రతి ఏటా ఇక్కడ జరిగే వేడుకలు, తెలుగువారి గురించి వింటూనే ఉన్నాను. నా తొలి చిత్రం 'ఏ మాయ చేసావే' నుంచి నన్ను మీ మనిషిలా భావించారు. నాపై ప్రేమను చూపించారు. మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు చెప్పడానికి నాకు ఇన్నేళ్లు పట్టింది. కెరీర్ పరంగా ముఖ్యమైన దశలో ఉన్నాను. ట్రాలాలా పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించాను. నిర్మాతగా 'శుభం'తో తొలి అడుగు వేశా. నార్త్ అమెరికాకు చెందిన తెలుగువారు నా చిత్రాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు' అని అన్నారు.

గ్యాంగ్‌స్టర్ డ్రామా



రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కుతోన్న భారీ చిత్రం 'దురంధర్'. సంజయ్‌దత్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాతో సారా అర్జున్ కథానాయికగా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు. గతంలో పలు విజయవంతమైన చిత్రాలను అందించిన ఆదిత్య ధర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డిసెంబరు 5న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్, టీజర్‌ని చిత్రబృందం రిలీజ్ చేసింది. ట్రైలర్‌ని చూస్తే ఇదొక గ్యాంగ్‌స్టర్ డ్రామా అని అర్థమవుతోంది. ఇటీవల వచ్చిన 'కిల్', 'జాన్ విక్'లను మించిన యాక్షన్ సన్నివేశాలు ఇందులో ఉన్నాయి.

కొత్తగా..

వినోదం పంచే బకాసుర



నటుడు ప్రవీణ్ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. వైవా హర్ష టైటిల్ రోల్ పోషిస్తున్నారు. ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌తో ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. లక్ష్మయ్య ఆచారి, జనార్దన్ ఆచారి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా టైటిల్ ర్యాప్‌సాంగ్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ గీతాన్ని వికాస్ బడిస స్వరపరిచారు. ఈ సందర్భంగా ఎస్‌జే శివ మాట్లాడుతూ "బకాసుర రెస్టారెంట్‌లో ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు వినోదం పంచడంతో పాటు థ్రిల్‌ను ఇస్తుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: బాల సరస్వతి, ఎడిటర్: మార్తాండ్ కే. వెంకటేశ్



ప్రేక్షకులను మెప్పించే ప్రేమకథ

సుహాస్ కథానాయకుడిగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళ నటి మాళవికా మనోజ్ కథానాయికగా పరిచయమవుతున్నారు. రామ్‌జీ దర్శకుడు. హరీశ్ నల్ల నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు హరీశ్ శంకర్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఈనెల 11న 'ఓ భామ అయ్యోరామ' విడుదలవుతోంది. ఇటీవలె నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'సుహాస్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రమిది. చక్కని ప్రేమకథతో రూపొందించాం. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను అలరిస్తుంది. కొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'సినిమా మేకింగ్‌లో రాజీ పడలేదు. మంచి అవుట్‌పుట్ వచ్చింది. పాటలు, ఆకట్టుకునే రొమాంటిక్ సన్నివేశాలు, అందరినీ కట్టిపడేసే భావోద్వేగాలు ఈ చిత్రంలో మిళితమై ఉన్నాయి' అని చెప్పారు.

అన్ని హంగులతో అలరించేందుకు



యూత్‌ఫుల్ సబ్జెక్ట్‌తో తెరకెక్కిన చిత్రం వర్జిన్‌బాయ్స్. మిత్రశర్మ, గీతానంద్, శ్రీహాన్, రోనిత్ ప్రధాన తారాగణం. దయానంద్ గడ్డం దర్శకత్వంలో రాజా దారపునేని నిర్మించారు. ఈనెల 11న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సినిమా టికెట్లు కొన్నవారిలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిన 11 మందికి ఐఫోన్లు బహుమతిగా ఇస్తామని చిత్రబృందం తెలిపింది. దర్శకుడు దయానంద్ మాట్లాడుతూ 'నా కళాశాల అనుభవాలను ఆధారంగా చేసుకొని తెరకెక్కించిన చిత్రమిది. 'వర్జిన్‌బాయ్స్' అనే టైటిల్‌కు కచ్చితంగా సరిపోయేలా కథ ఉంటుంది' అని చెప్పారు. రాజా దారపునేని మాట్లాడుతూ 'ఈ సినిమాలో పాపులర్ నటీనటులు ఎవరూ లేరు. కథే ఈ చిత్రానికి హీరో. ప్రేక్షకులను అబ్బురపరిచే కంటెంట్‌తో వస్తున్నాం' అని తెలిపారు. గీతానంద్ మాట్లాడుతూ 'ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లి ఎంటర్‌టైన్ చేస్తుంది. మంచి సినిమా చూసిన ఫీల్‌తో ప్రేక్షకులు థియేటర్ నుంచి వెళ్తారు' అని అన్నారు.

మిస్టీరియస్ కథతో...



పాతతరం నటుడు నాగభూషణం మనవడు అబిద్ భూషణ్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'మిస్టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో ఉషా, శివాని నిర్మించారు. రోహిత్ సహాని కీలకపాత్ర పోషిస్తున్నారు. రియాకపూర్, మేఘనా రాజ్‌పుత్ కథానాయికలు. ఇటీవలె నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ 'సస్పెన్స్ జానర్‌లో వస్తున్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అన్నారు. భారీ బడ్జెట్, హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా నిర్మించిన చిత్రమిది, భవిష్యత్‌లో మరిన్ని మంచి చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొస్తామని నిర్మాతలు తెలిపారు.

స్పోర్ట్స్

క్యాన్సర్‌తో బాధపడుతున్న నా సోదరికి ఈ ప్రదర్శన అంకితం

ఆకాశ్ దీప్

"ఇప్పటి వరకు నేనీ విషయం ఎవరికీ చెప్ప లేదు. కానీ రెండు నెలల క్రితం నా సోదరికి క్యాన్సర్ సోకింది. బంతి చేతికి తీసుకున్న ప్రతీ సారి తన ఆలోచనలే నా మదిలో కదలాడేవి. ఈ ప్రదర్శన ఆమెకే అంకితమిస్తున్నా. అలాగే ఈ సందర్భంగా తనకో విషయం చెప్పదల్చుకున్నా. మేమంతా మీ వెంటే ఉంటాం."

క్వార్టర్స్‌లో సబలెంక

వింబుల్డన్

లండన్: టాప్ సీడ్ అర్యానా సబలెంక వింబుల్డన్ టైటిల్ దిశగా మరో అడుగు వేసింది. ఈ బెలారస్ భామ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. పురుషుల ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్, 17వ సీడ్ ఖచనోవ్ కూడా రౌండ్-8కి చేరారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో ప్రపంచ నెంబర్ వన్ సబలెంక 6-4, 7-6 (4)తో 24వ సీడ్ మెర్టెన్స్‌పై గెలుపొందింది. ఇతర మ్యాచ్‌ల్లో లారా సిగ్మండ్ 6-3, 6-2తో సీరాపై, పల్యుచెన్కోవా 7-6 (3), 6-4తో సోనె కర్తాల్‌పై నెగ్గారు. పురుషుల సింగిల్స్‌లో ఫ్రిట్జ్ 6-1, 3-0తో జోర్డాన్‌పై ఆధిక్యంలో ఉన్నప్పుడు గాయంతో ప్రత్యర్థి వైదొలిగాడు. దాంతో ఫ్రిట్జ్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరాడు. 17వ సీడ్ ఖచనోవ్ 6-4, 6-2, 6-3తో మచ్‌జక్‌ని ఓడించాడు.

సాక్షీ ధండా పసిడి పంచ్



అస్తానా (కజకిస్థాన్): రెండుసార్లు యూత్ వరల్డ్ చాంపియన్ సాక్షీ ధండా ప్రపంచ బాక్సింగ్ కప్‌లో పసిడి పంచ్ విసిరింది. ఆదివారం జరిగిన మహిళల 54 కిలోల విభాగం ఫైనల్లో అమెరికా బాక్సర్ యాస్లిన్ పెరెజ్‌ను ఓడించి సాక్షి స్వర్ణ పతకం సాధించింది. మీనాక్షి (48 కి), పూజా రాణి (80 కి), జుగ్ను (85 కి) రజత పతకాలు అందుకున్నారు.

గుకేష్‌కు మూడో స్థానం

విజేత కార్ల్‌సన్

జాగ్రెబ్ (చెక్ రిపబ్లిక్): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరిగిన సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో వరల్డ్ చాంపియన్ గుకేష్ ఓవరాల్‌గా 19.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలవగా.. ప్రజ్ఞానంద 15 పాయింట్లతో 9వ స్థానం దక్కించుకొన్నాడు. కార్ల్‌సన్ 22.5 పాయింట్లతో టోర్నీ విజేతగా నిలవగా.. సో వెస్లీ (20)కి రెండోస్థానం దక్కింది. బ్లిట్జ్‌లో కార్ల్‌సన్ (12.5) అగ్రస్థానాన్ని దక్కించుకొన్నాడు. కాగా, ర్యాపిడ్‌లో 14 పాయింట్లతో విజేతగా నిలిచిన గుకేష్.. బ్లిట్జ్‌లో 18 రౌండ్ల నుంచి 5.5 పాయింట్లతో చివరిస్థానానికే పరిమితమయ్యాడు.

ముల్డర్ 'డబుల్'.. దక్షిణాఫ్రికా 465/4

బులవాయో: కెప్టెన్ ముల్డర్ (264) అజేయ ద్విశతకంతో చెలరేగిన వేళ..జింబాబ్వేతో రెండో టెస్టు తొలిరోజే దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 465/4 స్కోరు చేసింది. బెడింగ్‌హామ్ (82)తో కలిసి మూడో వికెట్‌కు 184 పరుగులు జోడించిన ముల్డర్..ప్రిటోరియస్ (78)తో నాలుగో వికెట్‌కు 217 రన్స్ జత చేశాడు.



ఆకాశ్‌దీప్ (6/99)కు సహచరుల అభినందన

దిగ్గజ క్రికెటర్లు జట్టుకు దూరమయ్యారు.. గెలవాల్సిన తొలి టెస్టును అనుభవలేమితో కోల్పోయారు.. ఇక రెండో టెస్టులో స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చి ఏం సాధిస్తారంటూ విమర్శలు.. అయినా అందరి సందేహాలను పటాపంచలు చేస్తూ యువ భారత్ ఎడ్జ్‌బాస్టన్‌లో సగర్వంగా నిలిచింది. దాదాపు ఆరు దశాబ్దాల నుంచి భారత్ ఈ వేదికపై దండయాత్ర చేస్తున్నా గెలుపు రుచి చూసిందే లేదు. ఇదిగో.. ఇన్నాళ్లకు కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలోని యువ ఆటగాళ్లు కలిసికట్టుగా చరిత్రాత్మక విజయాన్ని కళ్లముందుంచారు. 608 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్‌ను పేసర్ ఆకాశ్ దీప్ ఆరు వికెట్లతో దెబ్బతీయడంతో మరో సెషన్ ఉండగానే జట్టు సంబరాలు చేసుకుంది. అంతకుముందు గిల్ బాదిన డబుల్ సెంచరీ, భారీ శతకం ఈ విజయంలో అత్యంత కీలకంగా నిలిచాయనడంలో సందేహం లేదు.

గిల్ సేన విజయ గర్జన

మధురాతి మధురం!



ఇంగ్లండ్ గడ్డపై భారత జట్టు టెస్టు మ్యాచ్ గెలిచి దాదాపు నాలుగు సంవత్సరాలైంది. కరోనా మహమ్మారి సమయంలో ఆ దేశంలో పర్యటించిన టీమిండియా..ఆ సిరీస్ నాలుగో టెస్టులో 157 పరుగుల తేడాతో నెగ్గింది. ఇక ఈసారి గెలుపు జట్టుకు ఎంతో..ఎంతో ప్రత్యేకం. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్ వంటి దిగ్గజ ఆటగాళ్లు లేకుండా ఇంగ్లండ్‌లో టీమిండియా పర్యటిస్తోంది. పైగా..కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్, జట్టులోనూ అంతా కుర్రాళ్లు. జట్టు పరివర్తన దిశగా సాగుతోంది. మరోవైపు స్టోక్స్, రూట్స్, వోక్స్‌లాంటి క్రికెటర్లతో ఇంగ్లిషు జట్టు పటిష్టంగా ఉంది. అలాంటి జట్టును వారి గడ్డపై ఓడించడం అంటే మామూలు విషయం కాదు. పైగా తొలి టెస్టు ఓటమి నుంచి త్వరగా కోలుకొని రెండో మ్యాచ్‌లో ప్రత్యర్థిని మట్టి కరిపించడం యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టుకు మరెంతో విశేషం. ముఖ్యంగా సారథి గిల్ జట్టును నడిపించిన తీరు అద్భుతం. మొదటి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో శతకంతో విజయంలో కీలక భూమిక పోషించాడు. అంతేకాదు..కెప్టెన్సీ భారం కాదని రెండు ఇన్నింగ్స్‌ల్లో తన ఆటతీరుతో నిరూపించాడు. యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, పంత్ తమవంతు పాత్ర సమర్థంగా నిర్వర్తిస్తే, బుమ్రా లేని లోటును మరిపిస్తూ సిరాజ్, ఆకాశ్‌దీప్ ప్రత్యర్థిని గడగడలాడించారు. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాదీ సిరాజ్ ఆరు వికెట్లతో చెలరేగితే..నేనేమన్నా తక్కువ తిన్నానా..అంటూ ఆకాశ్‌దీప్ రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. మొత్తంగా సమష్టితత్వంతో దక్కిన ఈ విజయం భారత్‌కు మధురాతి మధురం. ఈ గెలుపు దరిమిలా లభించిన ఆత్మవిశ్వాసంతో విశ్వవిఖ్యాత లార్డ్స్ మైదానంలో జరిగే మూడో టెస్టుకు భారత్ ఇనుమడించిన ఉత్సాహంతో బరిలో దిగుతుందనడంలో సందేహం లేదు. ఇదే ఊపులో మనోళ్లు టెస్టు సిరీస్ సొంతం చేసుకోవాలని ఆశిద్దాం.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

టీమిండియాదే రెండో టెస్టు

- 336 పరుగులతో ఇంగ్లండ్ చిత్తు
- రెండో ఇన్నింగ్స్‌లో 271 ఆలౌట్
- ఆరు వికెట్లతో ఆకాశ్‌దీప్ విజృంభణ
- ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌కు తొలి గెలుపు



గిల్

బర్మింగ్‌హామ్: టీమిండియా విజయ లాంఛనాన్ని ముగించింది. చివరి రోజు ఆదివారం ఇంగ్లండ్ డ్రా కోసం ప్రయత్నిస్తుందనుకున్నా.. భారత బౌలర్లు వారి ఆటలు సాగనీయలేదు. తొలి ఇన్నింగ్స్‌లో సిరాజ్ సత్తాచాటితే, రెండో ఇన్నింగ్స్‌లో పేసర్ ఆకాశ్‌దీప్ (6/99) స్టోక్స్ సేన భరతం పట్టాడు. దీంతో ఇంగ్లండ్‌పై 336 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. ఐదు టెస్టుల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. ఎడ్జ్‌బాస్టన్‌లో 58 ఏళ్ల తర్వాత భారత్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 1967 నుంచి ఇప్పటిదాకా ఆడిన ఎనిమిది టెస్టుల్లో ఏడింటిలో ఓడిన భారత్, ఓ మ్యాచ్‌ను డ్రాగా చేసుకుంది. ఇక.. 608 పరుగుల ఛేదనలో ఆతిథ్య ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 271 పరుగులకే కుప్పకూలింది. జేమీ స్మిత్ (88), బ్రైడన్ కార్స్ (38), సారథి బెన్ స్టోక్స్ (33) రాణించారు. మ్యాచ్ మొత్తమ్మీద పేసర్ ఆకాశ్‌కు పది వికెట్లు దక్కాయి. కెప్టెన్‌గా తొలి విజయం అందుకున్న శుభ్‌మన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

ఆరంభంలోనే రెండు వికెట్లు: చివరి రోజు ఆటకు ముందు వర్షం కురవగా, తొలి సెషన్‌కు గంటా 40 నిమిషాలపాటు అంతరాయం కలిగింది. ఈ కారణంగా మూడు సెషన్లను 80 ఓవర్లకు కుదించారు. ఇక 608 పరుగుల అసాధ్య ఛేదన కోసం 72/3 ఓవర్‌నైట్ స్కోరుతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. అయితే ఆకాశ్ చక్కటి సీమ్‌తో వీరిని కుదురుకోనీయలేదు. సెషన్ నాలుగో ఓవర్‌లోనే పోప్ (24)ను బౌల్డ్ చేశాడు. తన తర్వాతి ఓవర్‌లోనే బ్రూక్ (23)ను ఎల్బీ చేయడంతో ఇంగ్లండ్ 83/5 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ ఊపులో వికెట్ల పతనం సాగుతుందనిపించినా.. స్టోక్స్-స్మిత్ జోడీ నిలువరించింది. స్పిన్నర్ జడేజా మాత్రం వీరిని ఇబ్బందిపెట్టాడు. కానీ సిరాజ్ ఓవర్లలో మాత్రం స్టోక్స్ బౌండరీలు రాబట్టాడు. లంచ్ బ్రేక్‌కు మరో రెండు నిమిషాలు ఉండగా బంతి తీసుకున్న జడేజా 100 సెకన్లలోనే ఆ ఓవర్‌ను ముగించాడు. దీంతో మరో ఓవర్‌కు సమయం మిగిలింది. ఈ ఓవర్‌ను స్పిన్నర్ సుందర్ వేసి స్టోక్స్ వికెట్ తీయడంతో ఇంగ్లండ్‌కు గట్టి ఝలక్ తగిలింది. అలాగే ఆరో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

కూల్చారు..: విజయానికి కేవలం నాలుగు వికెట్ల దూరంలో భారత్ రెండో సెషన్‌ను ఆరంభించింది. అయితే వోక్స్ (7) డిఫెన్స్‌కు పరిమితం కాగా స్మిత్ ఎదురుదాడికి దిగాడు. సుందర్ ఓవర్‌లో అతడు 6,4,6తో 17 రన్స్ రాబట్టాడు. అటు వోక్స్‌ను ప్రసిద్ధ్ అవుట్ చేసి ఇంగ్లండ్‌పై ఒత్తిడి పెంచాడు. కాసేపటికే ఆకాశ్ ఓవర్‌లో స్మిత్ వరుసగా రెండు సిక్సర్లు బాదాడు. అయితే అదే ఓవర్‌లో స్లో బాల్‌కు స్మిత్ ఆడిన పుల్ షాట్ సుందర్ చేతుల్లో పడింది. దీంతో ఆకాశ్ తొలిసారి ఐదు వికెట్ల ఫీట్ సాధించాడు. అటు జడేజా ఓవర్‌లో కార్స్ ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో ఉన్న రాహుల్ వదిలేశాడు. కానీ టంగ్ (2) క్యాచ్‌ను షార్ట్ మిడ్ వికెట్‌లో సిరాజ్ తన కుడి వైపునకు డైవ్ చేస్తూ ఒంటి చేత్తో అందుకున్నాడు. ఇక చివరి వికెట్‌ను త్వరగా తీద్దామనుకున్న భారత్‌ను కార్స్-బషీర్ కాసేపు విసిగించారు. పైగా బషీర్ (12 నాటౌట్) ఓ సిక్స్ బాదగా.. ఆకాశ్ ఓవర్‌లో కార్స్ మూడు ఫోర్లు సాధించాడు. చివరకు పదో వికెట్‌కు 25 పరుగుల భాగస్వామ్యం అందించాక కార్స్‌ను ఆకాశ్ అవుట్ చేయడంతో భారత్ అద్భుత విజయం దక్కించుకుంది.

ఒకే టెస్టులో ఎక్కువ పరుగులు (272) సాధించిన ఇంగ్లండ్ వికెట్ కీపర్‌గా జేమీ స్మిత్. స్టివార్ట్ (204)ను అధిగమించాడు.

ఇంగ్లండ్‌లో జరిగిన సిరీస్‌లో ఇరు జట్ల వికెట్ కీపర్లు (పంత్-స్మిత్) కలిసి అత్యధిక పరుగులు (697) సాధించడం ఇదే తొలిసారి. గతంలో స్టివార్ట్-హీలీ (674 రన్స్) పేరిట ఈ రికార్డు ఉండేది.

1

భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన ఓ టెస్టు మ్యాచ్‌లో ఎక్కువ పరుగులు (1692) నమోదవడం ఇదే తొలిసారి.

ఇంగ్లండ్‌లో జరిగిన టెస్టు మ్యాచ్‌లో అత్యధిక సిక్సర్లు (30) నమోదవడం ఇదే మొదటిసారి.

'సేనా' దేశాలపై భారత టెస్టు జట్టుకిదే భారీ విజయం (336 రన్స్ తేడాతో).

2

ఇంగ్లండ్‌లో పది వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా ఆకాశ్ దీప్. గతంలో చేతన్ శర్మ (1986లో 10/188) ఈ ఫీట్ సాధించాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 587; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 407; భారత్ రెండో ఇన్నింగ్స్: 427/6 డిక్లేర్;

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: డకెట్ (బి) ఆకాశ్‌దీప్ 25, క్రాలే (సి/సబ్) సాయి సుదర్శన్ (బి) సిరాజ్ 0, పోప్ (బి) ఆకాశ్‌దీప్ 24, రూట్ (బి) ఆకాశ్‌దీప్ 6, బ్రూక్ (ఎల్బీ) ఆకాశ్‌దీప్ 23, స్టోక్స్ (ఎల్బీ) వాషింగ్టన్ 33, జేమీ స్మిత్ (సి) వాషింగ్టన్ (బి) ఆకాశ్‌దీప్ 88, వోక్స్ (సి) సిరాజ్ (బి) ప్రసిద్ధ్ 7, కార్స్ (సి) గిల్ (బి) ఆకాశ్‌దీప్ 38, టంగ్ (సి) సిరాజ్ (బి) జడేజా 2, బషీర్ (నాటౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 68.1 ఓవర్లలో 271 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-11, 2-30, 3-50, 4-80, 5-83, 6-153, 7-199, 8-226, 9-246, 10-271; **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 21.1-2-99-6, సిరాజ్ 12-3-57-1, ప్రసిద్ధ్ 14-2-39-1, జడేజా 15-4-40-1, వాషింగ్టన్ సుందర్ 6-2-28-1.

కంపెనీలకు మేకిన్ ఇండియా ఊతం

- 2035 నాటికి రూ.837 లక్షల కోట్ల జీవీఏ
- పీడబ్ల్యూసీ ఇండియా

న్యూఢిల్లీ: దేశీయ పారిశ్రామిక రంగానికి భారత్‌లో తయారీ (మేకిన్ ఇండియా) బాగానే ఉపకరిస్తోంది. దీంతో 2035 నాటికి దేశీయ కంపెనీల స్థూల విలువ జోడింపు (జీవీఏ) 9.82 లక్షల కోట్ల డాలర్ల (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ..837.15 లక్షల కోట్లు) వరకు ఉంటుందని అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ప్రైస్‌వాటర్ హౌస్ కూపర్స్ (పీడబ్ల్యూసీ) ఇండియా ఒక నివేదికలో తెలిపింది. ఇందులో తయారీ, పారిశ్రామిక రంగాలది అగ్రస్థానమని పేర్కొంది. 2023 నాటికి 94,500 కోట్ల డాలర్లుగా ఉన్న ఈ రెండు రంగాల జీవీఏ 2035 నాటికి 2.75 లక్షల కోట్ల డాలర్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. 'నావిగేటింగ్ ది వాల్యూ షిఫ్ట్' పేరుతో పీడబ్ల్యూసీ ఇండియా ఈ నివేదిక విడుదల చేసింది. వాతావరణ మార్పులు, సాంకేతిక అవాంతరాలు, మారుతున్న ప్రజల అభిరుచులతో సంప్రదాయ పరిశ్రమల సరిహద్దులు చెరిగిపోతూ అదనపు విలువ జోడింపు జరగనుందని పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక తెలిపింది.

పీఎస్‌బీల్లో కొలువుల జాతర

- ఈ సంవత్సరం 50,000 పోస్టుల భర్తీ
- ఒక్క ఎస్‌బీఐలోనే 20 వేల నియామకాలు

న్యూఢిల్లీ: దేశంలోని 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు రూటు మార్చాయి. పెద్ద ఎత్తున నియామకాలకు సిద్ధమవుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం దాదాపు 50,000 నియామకాలు చేపట్టనున్నాయి. ఇందులో 21,000 ఉద్యోగాలు ఆఫీసర్ పోస్టులు. మిగతా 29,000 క్లరికల్ పోస్టులు. ఇవే బ్యాంకులు గతంలో ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందనే పేరుతో 2001లో స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్) పథకం ద్వారా లక్ష మంది పైగా ఉద్యోగులను ఇంటికి పంపించాయి. అప్పట్లో 26 పీఎస్‌బీలుంటే విలీనాలతో ఇపుడు వాటి సంఖ్య 12కు తగ్గిపోయింది. అయినా పీఎస్‌బీలు మళ్లీ పెద్ద ఎత్తున నియామకాలకు దిగడం విశేషం. పెరుగుతున్న వ్యాపారం, శాఖల విస్తరణ, ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఈ నియామకాలకు ప్రధాన కారణంగా



కనిపిస్తోంది.

ఎస్‌బీఐదే పెద్ద వాటా


పీఎస్‌బీలు ఈ ఆర్థిక సంవత్సరం భర్తీ చేసే 50,000 ఉద్యోగాల్లో ఎస్‌బీఐ వాటానే దాదాపు 20,000 వరకు ఉంది. ఇందులో 505 ప్రొబేషనరీ ఆఫీసర్ (పీఓ) పోస్టులు; 13,455 జూనియర్ అసోసియేట్స్ పోస్టుల ఎంపిక ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేసింది. ఈ ఏడాది మార్చి నాటికి ఎస్‌బీఐ ఉద్యోగుల సంఖ్య 2,36,226కు చేరింది. ఇందులో అధికారుల సంఖ్య 1,15,066 వరకు ఉంది. గత ఆర్థిక సంవత్సరం ఒక్కో కొత్త ఉద్యోగి నియామకం కోసం ఎస్‌బీఐ రూ.40,440.59 చొప్పున ఖర్చు చేసింది. ఎస్‌బీఐతో పాటు పీఎన్‌బీ 5,500 మందిని, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 4,000 మందిని తాజాగా ఉద్యోగాల్లోకి తీసుకోనున్నాయి.

ఎందుకంటే?

పీఎస్‌బీలకు ప్రస్తుతం దాదాపు 15 వరకు అనుబంధ లేదా జాయింట్ వెంచర్ కంపెనీలున్నాయి. వీటి కార్యకలాపాలను మరింత విస్తరించి ఐపీఓల ద్వారా వాటిల్లో పెట్టుబడులు కొంతైనా వెనక్కి తీసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవల పీఎస్‌బీలను కోరింది. ఇందుకోసం కూడా పీఎస్‌బీలు నియామకాలు పెంచుతున్నాయని భావిస్తున్నారు.

బిజినెస్

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	570
వరంగల్	562	గోదావరి	535
చిత్తూరు	633	విశాఖపట్నం	560
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	102
వరంగల్	105	గుంటూరు	107
కరీంనగర్	105	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	102
కర్నూలు	105	నెల్లూరు	107
విశాఖపట్నం	86	అనంతపురం	107
గోదావరి	102		


స్మార్టెన్ పవర్ సిస్టమ్ ఇష్యూ నేడే

న్యూఢిల్లీ: సోమవారం ప్రారంభం కానున్న స్మార్టెన్ పవర్ సిస్టమ్ పబ్లిక్ ఇష్యూలో షేరు ధరను రూ.100గా ప్రకటించింది. బుధవారం ముగియనున్న ఈ ఇష్యూ ద్వారా రూ.50 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. రూ.40.01 కోట్ల విలువ గల తాజా షేర్లు జారీ చేయడంతో పాటు 10 లక్షల ఈక్విటీ షేర్లు ఓఎఫ్ఎస్ విధానంలో జారీ చేయనున్నట్టు కంపెనీ ప్రకటించింది.

రెండు కంపెనీల దరఖాస్తు: సోలార్ ఫొటో వోల్టాయిక్ మాడ్యూళ్లు తయారుచేసే ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్ లిమిటెడ్, స్మార్ట్ ఎనర్జీ మీటర్ తయారీ కంపెనీ అలైడ్ ఇంజనీరింగ్ వర్క్స్ ఐపీఓల జారీకి అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు చేశాయి. ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్ రూ.3,000 కోట్లు, అలైడ్ ఇంజనీరింగ్ వర్క్స్ రూ.400 కోట్లు సమీకరించనున్నట్టు ప్రకటించాయి.

ఈడీ జప్తు చేసిన ఆస్తుల విడుదల కుదరదు

ఎన్‌సీఎల్‌ఏటీ



న్యూఢిల్లీ: జాతీయ కంపెనీల చట్టం అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) బ్యాంకులు, ఆర్థిక సంస్థల సొమ్ముతో మజా చేసే ఘరానా వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు చెంప పెట్టులాంటి తీర్పు ఇచ్చింది. దివాలా చట్టాన్ని (ఐబీసీ) అడ్డు పెట్టుకుని అక్రమ నగదు లావాదేవీల చట్టం (పీఎంఎల్‌ఏ) నుంచి తప్పించుకోవడం కుదరదని స్పష్టం చేసింది. పీఎంఎల్‌ఏ చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్వాధీనం చేసుకున్న ఆస్తులను విడుదల చేయడం కుదరదని తేల్చి చెప్పింది. అక్రమంగా సంపాదించిన ఆస్తులు ఐబీసీ పరిష్కార ప్రక్రియలోకే రావని ప్రకటించింది.

ఇదీ కేసు: తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయిన డునార్ ఫుడ్స్ కంపెనీ నుంచి తమకు రావలసిన రూ.758.73 కోట్లు రాబట్టుకునేందుకు ఎస్‌బీఐ నాయకత్వంలోని బ్యాంకుల కన్సార్షియం ఎన్‌సీఎల్‌టీ, ముంబై బెంచ్‌ను ఆశ్రయించింది. ఈ లోపు పీఎల్‌ఏ చట్టం కింద డునార్ ఫుడ్స్ ఆస్తులను ఈడీ జప్తు చేసింది. దాంతో ఈ ఆస్తులను విడిపించాలని ఎన్‌సీఎల్‌టీ, ముంబై బెంచ్‌ను ఆ కంపెనీ కోరింది. కేసును విచారించిన ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ ఈడీ చర్యను సమర్థిస్తూ డునార్ ఫుడ్స్ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. దీంతో డునార్ ఫుడ్స్ కంపెనీ దీనిపై ఎన్‌సీఎల్‌ఏటీకి అప్పీల్ చేసింది. కంపెనీకి ఎన్‌సీఎల్‌ఏటీలోనూ చుక్కెదురైంది. ఈ తీర్పు ఐబీసీని అడ్డుపెట్టుకుని బ్యాంకుల అప్పులతో మజా చేసే మాయగాళ్లకు చెంప పెట్టని భావిస్తున్నారు.

25850 పైన బుల్లిష్

(జూలై 7-11 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 25461 (-177)

నిఫ్టీ గత వారం 25639-24332 పాయింట్ల మధ్యన కదలాడి 177 పాయింట్ల నష్టంతో 25,461 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,850 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25449, 25491, 25232, 25037 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25850 బ్రేక్‌డౌన్ స్థాయి: 25100


నిరోధ స్థాయిలు : 25675, 25775, 25875 (25575 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 25250, 25150, 25050 (25350 దిగువన బేరిష్)

ఆస్ట్రో టెక్

పెట్రోకెమికల్స్ రంగంలోకి అదానీ

గుజరాత్‌లో పీవీసీ ప్లాంట్



న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరిస్తోంది. కొత్తగా పెట్రో రసాయనాల (పెట్రో కెమికల్స్) రంగంలోకి ప్రవేశిస్తోంది. ఇందులో భాగంగా గుజరాత్‌లోని ముంద్రా వద్ద ఏటా 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న పోలీవినైల్ క్లోరైడ్ (పీవీసీ) ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. 2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ ప్లాంటు నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని అదానీ గ్రూప్ భావిస్తున్నట్టు సమాచారం. దీంతో ఇప్పటికే ఈ రంగంలో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు గట్టి పోటీ ఏర్పడుతుందని భావిస్తున్నారు.

భారీ డిమాండ్

సింథటిక్ పాలిమర్ అయిన పీవీసీని అనేక రంగాల్లో విస్తృతంగా ఉపయోగిస్తారు. ప్రస్తుతం మన దేశంలో దీనికి ఏటా 40 లక్షల టన్నుల వరకు డిమాండ్ ఉంది. ఇందులో 15.9 లక్షల టన్నులు మాత్రమే దేశీయంగా ఉత్పత్తి అవుతోంది. అందులో రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటా 7.5 లక్షల టన్నులు. దేశంలో పీవీసీ డిమాండ్ ఏటా 8-10 శాతం చొప్పున పెరుగుతోంది. ఈ అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకే అదానీ గ్రూప్ పీవీసీ ఉత్పత్తిలోకి ప్రవేశిస్తోందని భావిస్తున్నారు.

మధ్యలో ఆటంకం

నిజానికి ఐదేళ్ల క్రితమే అదానీ గ్రూప్ ఈ ప్రాజెక్టు తలపెట్టింది. అయితే హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో 2023 మార్చిలో ఈ ప్రాజెక్టును పక్కన పెట్టింది. పరిస్థితులు కుదుటపడడంతో మళ్లీ ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించింది. డిమాండ్‌ను బట్టి ఈ ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 20 లక్షల టన్నులకు విస్తరించాలని అదానీ గ్రూప్ యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

టెక్ వ్యూ: మానసిక అవధి 26000



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 25,650 వద్ద రియాక్షన్‌తో ప్రారంభమై వారం అంతా మైనర్ బలహీనత కొనసాగించింది. శుక్రవారం మైనర్ రికవరీతో 25,460 వద్ద ముగిసింది. అయినా వారం మొత్తం మీద 300 పాయింట్ల మేరకు పరిమిత పరిధిలోనే కదలాడి చివరికి 176 పాయింట్లు నష్టపోయింది. ముందు వారం 25,000 వద్ద బ్రేకౌట్ సాధించిన అనంతరం ఏర్పడిన పుల్‌బ్యాక్ రియాక్షన్ ఇది. ఈ రియాక్షన్‌లో కూడా ప్రధాన మద్దతు స్థాయిల కన్నా పైనే ఉండడం తక్షణ ముప్పు లేదనేందుకు సంకేతం. టెక్నికల్‌గా మార్కెట్ పాజిటివ్ ధోరణిలోనే ఉంది. తదుపరి నిరోధం 26,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ సాధించినట్టయితే ప్రధాన నిరోధం 25,600 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. తదుపరి మానసిక అవధి 26,000. ఇక్కడ కన్సాలిడేషన్ ఉండవచ్చు. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత పాజిటివ్‌గా పురోగమిస్తుంది.

బేరిష్ స్థాయిలు: రియాక్షన్ సాధించి మైనర్ మద్దతు స్థాయి 25,400 కన్నా దిగజారితే మైనర్ బలహీనతలో పడుతుంది. స్వల్పకాలిక మద్దతు స్థాయి 25,000. అంత కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 57,600 వద్ద రియాక్షన్ సాధించి వారంలో 412 పాయింట్ల నష్టంతో 57,000 వద్ద నిలకడగా ముగిసింది. అప్‌ట్రెండ్‌ను కొనసాగించాలంటే ప్రధాన నిరోధం 57,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధం 58,000. బలహీనతలో ప్రవేశించినా 57,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. ఈ స్థాయిలో విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

పాటర్న్: మరింత అప్‌ట్రెండ్ కోసం 25,600 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి. అలాగే మార్కెట్ 25 డీఎంఏ కన్నా పైనే ఉండడం ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. గత వారం మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకున్నట్టు కనిపిస్తోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25550, 25600
మద్దతు	25400, 25320

'పేలుడు పదార్థాల' కేసులో టీపీసీసీ నేత చంద్రశేఖర్‌రెడ్డికి రిమాండ్

» జిలెటిన్ స్టిక్స్ నిల్వ ఉంచడంపై కేసు నమోదు

» పరారీలో ఉన్న ఆయన సోదరుడి కోసం గాలింపు

కామారెడ్డి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పేలుడు పదార్థాలైన జిలెటిన్ స్టిక్స్‌ను అక్రమంగా నిల్వ ఉంచారంటూ కామారెడ్డికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే విషయమై ఆయన సోదరుడు సురేందర్‌రెడ్డిపై సైతం కేసు నమోదవ్వగా.. పరారీలో ఉన్న ఆయన కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. స్థానిక కేపీఆర్ కాలనీలో ఓ ఖాళీ స్థలంలో బండరాళ్లను పగలగొట్టేందుకు పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలైన జిలెటిన్ స్టిక్స్‌ను నిల్వ ఉంచారని పోలీసులకు సమాచారమందడంతో రెండ్రోజుల క్రితం విచారణ చేపట్టి నలుగురిని అరెస్టు చేశారు. విచారణలో వారిచ్చిన సమాచారంతో చంద్రశేఖర్‌రెడ్డికి సంబంధించిన ఓ వెంచర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద మొత్తంలో నిల్వ చేసిన జిలెటిన్ స్టిక్స్, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. శనివారం చంద్రశేఖర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అయితే భర్త చంద్రశేఖర్ రెడ్డిని అరెస్టు చేయడాన్ని ఆయన భార్య, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ ఆదివారం తీవ్రంగా ఖండించారు. తన భర్తపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి రిమాండ్ చేశారంటూ మండిపడ్డారు.

పూరీ తింటుండగా పొలమారి యువకుడి మృతి

» మహబూబ్ నగర్ జిల్లాలో ఘటన

రాజాపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అతడి పేరు కుమార్ (27). ఆయన ఒక రైతు వద్ద పాలేరుగా పని చేస్తున్నాడు. రోజువారీ పనిలో భాగంగా తాను పని చేస్తున్న రైతు పొలానికెళ్లాడు. అక్కడికి వెళ్లాక వెంట తెచ్చుకున్న పూరీలు తింటుండగా.. ఒక పూరీ ముక్క అడ్డం పడి గొంతు పొలమారింది. ఊపిరాడక ఆ యువకుడు అక్కడికక్కడే మరణించిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం తిర్మలాపూర్ గ్రామ శివారుల్లో చోటు చేసుకుంది. ఈ విషయం గమనించిన స్థానికులు పొలం రైతుకు సమాచారం ఇచ్చారు. దీనిపై స్థానిక ఎస్ఐ శివానందం గౌడ్.. 'ఆంధ్ర జ్యోతి'తో మాట్లాడుతూ.. ఈ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఫాల్కన్ స్కామ్‌లో కంపెనీ సీవోవో అరెస్టు

» పంజాబ్‌లోని భటిండాలో పట్టుకున్న సీఐడీ అధికారులు

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) ఫాల్కన్ గ్రూప్ స్కామ్ కేసులో సీఐడీ అధికారులు మరొకరిని అరెస్ట్ చేశారు. కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీవోవో) ఆర్యన్ సింగ్ చాబ్రాను పంజాబ్ రాష్ట్రంలోని భటిండాలో అదుపులోకి తీసుకున్నారు. దాదాపు రూ.792 కోట్ల మోసానికి సంబంధించిన ఫాల్కన్ స్కామ్‌లో ఇప్పటి వరకు ఆర్యన్ సింగ్‌తోపాటు 9 మందిని సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ అప్లికేషన్ ద్వారా దేశవ్యాప్తంగా 7056 మంది డిపాజిట్‌దారుల నుంచి రూ.4,215 కోట్లు ఈ గ్రూపు వసూలు చేసింది. ఈ గ్రూపుపై ఆరోపణలు వస్తున్న క్రమంలో కొందరి డిపాజిట్లను కంపెనీ తిరిగి చెల్లించింది. 4,065 మంది డిపాజిట్‌దారులకు సంబంధించిన రూ.792 కోట్లను ఈ కంపెనీ యజమానులు సొంతానికి వాడుకున్నారు. ఫాల్కన్ గ్రూపుపై తెలంగాణలో 3, వివిధ రాష్ట్రాల్లో మరో 8 కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే కంపెనీ ఎండీ అమర్‌దీప్ కుమార్, అతని సోదరుడు, తండ్రి, భార్యను సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో కేసు నమోదైన వెంటనే ఆర్యన్ సింగ్ కంపెనీ ఖాతాల నుంచి రూ.1,62,55,619 తన ఖాతాలకు మళ్లించుకున్నాడు. డిపాజిట్‌దారుల నుంచి సీవోవో హోదాలో ఆర్యన్ సింగ్ రూ.14.35 కోట్లు వసూలు చేశాడు. హైదరాబాద్ నుంచి బీదర్ పారిపోయిన ఆర్యన్ సింగ్ అక్కడి నుంచి భటిండా చేరుకుని ఓ గురుద్వారాలో ఆశ్రయం పొందాడు. పక్కా సమాచారంతో సీఐడీ బృందాలు ఆర్యన్‌ను అరెస్టు చేసి ట్రాన్సిట్ వారంట్‌పై ఆదివారం హైదరాబాద్ కు తీసుకువచ్చి న్యాయమూర్తి ముందు హాజరుపరిచినట్టు సీఐడీ అదనపు డీజీ చారుసిన్హా ఓ ప్రకటనలో తెలిపారు.

మహేశ్‌బాబుకు వినియోగదారుల ఫోరం నోటీసు

» సాయిసూర్య డెవలపర్స్‌కు ప్రచారకర్తగా ఉన్న నటుడు

» లేని వెంచర్‌లో ప్లాట్లు విక్రయించినట్టు పలువురి ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సాయిసూర్య డెవలపర్స్ సంస్థకు ప్రచారకర్తగా వ్యవహరించిన నటుడు మహేష్‌బాబుకు రంగారెడ్డి జిల్లా వినియోగదారుల ఫోరం నోటీసులు జారీ చేసింది. సదరు సంస్థ నిర్వాహకులు లేఔట్‌లో అన్ని అనుమతులున్నాయని ప్రచారం చేసుకున్నారని, మహేష్‌బాబు ఫొటో ఉన్న బ్రోచర్‌లోని వెంచర్‌లో ఉన్న ప్రత్యేకతలకు ఆకర్షితులమై ప్లాటు కొనుగోలు చేశామని ఓ వైద్యురాలితో పాటు మరో వ్యక్తి తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్వాహకుల మాటలు నమ్మి బాలాపూర్ గ్రామంలో చెరొక ప్లాటు కొనుగోలుకు రూ.34.80 లక్షల చొప్పున చెల్లించామన్నారు. తర్వాత అసలు లేఔట్ కూడా లేదని తెలుసుకొని తమ డబ్బు తిరిగివ్వాలని ఒత్తిడి చేయడంతో సంస్థ ఎండీ సతీష్ చంద్రగుప్తా పలు వాయిదాల్లో చెరి రూ.15 లక్షలు మాత్రమే చెల్లించారని బాధితులు పేర్కొన్నారు. మహేష్‌బాబు ఫొటో ఉన్న బ్రోచర్‌ను చూపుతూ లేని వెంచర్‌లో ప్లాట్లను విక్రయించి సాయిసూర్య డెవలపర్స్ తమను మోసం చేసిందని, వారిపై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి సాయిసూర్య డెవలపర్స్, సంస్థ ఎండీ కంచర్ల సతీష్ చంద్రగుప్తా, ప్రచారకర్తగా ఉన్న మహేష్‌బాబులను ప్రతివాదులుగా పేర్కొన్న ఫోరం వారికి నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న ప్రతివాదులు సోమవారం వ్యక్తిగతంగా గానీ న్యాయవాదుల ద్వారా గానీ హాజరుకావచ్చు.

ఇక ఆన్‌లైన్‌లోనే పర్యాటక సంస్థ సేవలు

» ముందే హోటళ్లు, బస్సులు, బోటింగ్ బుక్ చేసుకోవచ్చు

» రిజర్వేషన్ కేంద్రానికి వెళ్లే పని లేకుండా ఏర్పాట్లు

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక సంస్థ అందించే అన్ని సేవలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌలభ్యాన్ని కల్పించనున్నారు. తద్వారా పర్యాటకుల విలువైన సమయం వృథా కాకుండా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ బషీర్‌బాగ్ కేంద్రంగా పని చేస్తున్న పర్యాటక సంస్థ రిజర్వేషన్ కేంద్రాన్ని పూర్తి స్థాయి కమాండ్ కంట్రోల్ కేంద్రంగా విస్తరించి అధికారులు పర్యవేక్షిస్తారు. ఇది దేశ, విదేశీ పర్యాటకులకు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. పర్యాటక సంస్థ సమాచార కేంద్రాలను ఆధునికీకరించనున్నారు. సంస్థలో ఉన్న సుమారు 30 ఏసీ, నాన్‌ఏసీ, క్యారవాన్‌లు, మినీ బస్సులు రాజధాని నుంచి తిరుపతి, శిరిడీ, భద్రాచలం తదితర ప్రాంతాలకు, సిటీ టూర్‌కు ప్యాకేజీల కింద నడుస్తున్నాయి. ఆయా బస్సుల్లో వెళ్లేందుకు పర్యాటకులు నేరుగా రిజర్వేషన్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. ఇక నుంచి ఆ అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే వాటి టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ఈ బస్సులకు జీపీఎస్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో అవి గమ్యస్థానాలకి చేరడానికి ఎంత సమయం పడుతుందో పర్యాటకులు కచ్చితంగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాగే పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో నడిచే హోటళ్లలో అందుబాటులో ఉన్న గదులు, వసతులను ఆన్‌లైన్‌లోనే ముందుగా బుక్ చేసుకోవచ్చని పర్యాటక సంస్థ అధికారులు తెలిపారు. బోట్ రైడ్‌లు సైతం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌకర్యం అందుబాటులోకి రానుంది. సెలవులు, ఇతర పండుగ రోజుల్లో రద్దీ పెరిగి పలు పర్యాటక కేంద్రాల్లో బోట్ రైడ్ల కోసం వరుసల్లో నిలబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఇక నుంచి ఆ సమస్య ఉండదు. లుంబినీ పార్క్, హుస్సేన్‌సాగర్‌తో పాటు లక్నవరం, దుర్గంచెరువు, మీర్‌ఆలం చెరువు, కరీంనగర్ ఎల్ఎండీ, రామప్ప చెరువు, సోమశిల, నాగార్జునసాగర్, సింగూరు, ధర్మపురి, కోటిలింగాల, కొత్తగూడెం కిన్నెర సాని తదితర ప్రాంతాల్లోని జలాశయాల్లో పర్యాటకుల కోసం 130కి పైగా బోట్లను నడుపుతున్నారు. కాగా, ఇప్పటి వరకు పర్యాటక సంస్థలో వివిధ విభాగాలకు అధిపతులుగా వ్యవహరించిన రిటైర్డ్ అధికారుల సేవలను నిలిపివేశారు. మార్కెటింగ్, రవాణా, వాటర్ ఫ్లీట్, సౌండ్ అండ్ లైట్, ఇంజనీరింగ్, హోటళ్ల తదితర విభాగాల్లో జనరల్ మేనేజర్లుగా వ్యవహరించిన రిటైర్డ్ అధికారులకు ఉద్వాసన పలికి రెగ్యులర్ అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ పర్యాటక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది.

171 ఇంజనీరింగ్ కాలేజీల్లో 1,07,218 సీట్లు

» కన్వీనర్ కోటాలో 76,795 సీట్ల భర్తీ

» సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రేపే ఆఖరు



హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 171 ఇంజనీరింగ్ కాలేజీల పరిధిలో 1,07,218 సీట్లను భర్తీ చేయనున్నట్టు ఉన్నత విద్యా మండలి వెల్లడించింది. వీటిలో కన్వీనర్ కోటా కింద 76,795 సీట్లను భర్తీ చేయనున్నట్టు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు యూనివర్సిటీల వారీగా కాలేజీల్లో భర్తీ చేసే సీట్ల వివరాలతో పాటు ఏయే కోర్సుల్లో ఎన్ని సీట్లున్నాయన్న వివరాలతో జాబితాను విడుదల చేసింది. కాలేజీల్లో అడ్మిషన్ల కోసం 95,654 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నారని, ఇప్పటివరకు 76,494 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైనట్టు తెలిపారు. కాగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు జూలై 8 ఆఖరు తేదీగా ప్రకటించారు. ఇక ఆప్షన్ల కోసం జూలై 6 నుంచి 10వ తేదీ వరకు అవకాశం కల్పించినట్టు ఎప్‌సెట్ కన్వీనర్ శ్రీదేవసేన వెల్లడించారు. కాగా 10 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిధిలోని 21 కళాశాలల్లో 5,808 సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేయనున్నారు. వీటిలో ఈ ఏడాది కొత్తగా పాలమూరు (180), శాతవాహన (240), ఎర్త్‌సైన్స్ (300) యూనివర్సిటీల పరిధిలో కలిపి 720 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. రెండు ప్రైవేటు యూనివర్సిటీల పరిధిలోని 2 కాలేజీల్లో 1,800 సీట్లుండగా.. వాటిలో 1,260 సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేయనున్నారు.

సీఎ్‌సఈలో 26,150 సీట్లు...

రాష్ట్రంలోని ఓయూ, జేఎన్‌టీయూహెచ్, కేయూ పరిధిలో మొత్తం 171 కాలేజీలుండగా.. ఓయూ పరిధిలో 14, జేఎన్‌టీయూహెచ్ పరిధిలో 130, కేయూ పరిధిలో 4, ప్రైవేటు యూనివర్సిటీల పరిధిలో 23 కాలేజీలున్నాయి. వీటన్నింటిలో కలిపి 1,07,218 సీట్లుండగా.. 76,795 సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. అన్ని కాలేజీల్లో కలిపి 47 బ్రాంచీలున్నాయి. అత్యధికంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) 26,150 సీట్లు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఏఐ అండ్ మిషన్ లెర్నింగ్)లో 12,495, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో 10,125, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్)లో 6,996, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో 4,301, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో 3,681, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 2,994, సివిల్ ఇంజనీరింగ్‌లో 3,129, ఆర్టిఫిషియల్ అండ్ డేటా సైన్స్‌లో 1,235, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సైబర్ సెక్యూరిటీస్) 1,439 సీట్లుండగా.. మిగిలిన అన్ని బ్రాంచీల్లో ఒక్కో దానిలో వెయ్యిలోపే సీట్లున్నాయి. అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ మెకానికల్ విత్ ఎంటెక్ మాన్యుఫ్యాక్చరింగ్ సిస్టమ్స్ (ఎంఎంఎస్), బీటెక్ మెకానికల్ విత్ ఎంటెక్ థర్మల్ ఇంజనీరింగ్ (ఎంటీఈ) బ్రాంచీల్లో ఒక్కోదానిలో అతి తక్కువగా 30 చొప్పున సీట్లున్నాయి. డెయిరీంగ్ బ్రాంచీలో 23 సీట్లుండగా ఎలక్ట్రానిక్స్‌అండ్‌టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో అతి తక్కువగా 21 సీట్లే ఉన్నాయి.

డిజిటల్ హైవేలు!



(మొదటిపేజీ తరువాయి)

పరిధిలో 251 కిలోమీటర్లు ఉంది. ప్రస్తుతం ఇది టోల్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (టీవోటీ) విధానంలో ఉంది. ఈ మొత్తాన్ని డిజిటల్ హై వేగా మార్చనున్నారు. తాజాగా ఈ బాధ్యతలు దక్కించుకున్న ఓ సంస్థ.. పనులు కూడా ప్రారంభించింది.

అత్యాధునిక సీసీ కెమెరాలు..

స్మార్ట్, డిజిటల్ హై వే ఏర్పాటులో భాగంగా.. రహదారిపై 360 డిగ్రీల కోణంలో పనిచేసే అత్యాధునిక సీసీ కెమెరాలను ప్రతి కిలోమీటర్‌కు (రెండు వైపులా) ఒకటి చొప్పున 251 కెమెరాలను అమర్చుతారు. మూల మలుపులు, వంకరలు ఉన్నచోట రెండు చొప్పున కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం రోడ్లపై ఏర్పాటుచేసే వాటికంటే అత్యంత శక్తిమంతంగా ఈ కెమెరాలు ఉంటాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో వీటిని ఏర్పాటుచేస్తారు. ఇవి 24 గంటలూ రోడ్లపై నిఘా ఉంచుతాయి. వీటి పర్యవేక్షణకు ప్రత్యేక మానిటరింగ్ కేంద్రాలను హైవే పైనే ఒకటి, రెండు చోట్ల ఏర్పాటుచేయడంతో పాటు ప్రత్యేకంగా సిబ్బంది కూడా ఉంటారు. ఈ కెమెరాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వ పోలీసు, రవాణా శాఖకు అనుసంధానం చేస్తారు. ఇవి ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను అంచనా వేస్తుంటాయి. రహదారిపై ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు లొకేషన్‌తోపాటు కిలోమీటర్ నంబర్‌తో కూడిన అన్ని వివరాలను వీడియోతో సహా పంపుతుంది. వెంటనే హైవేపై ఉండే అంబులెన్స్, సిబ్బంది అక్కడికి చేరుకుని అవసరమైన సాయం అందిస్తారు. అంతేకాదు.. స్పీడ్ డిటెక్షన్, రాంగ్ రూట్, ప్రమాదాల వీడియోను చిత్రీకరించడం వంటి పలు రకాల సేవలను వీటి ద్వారా అందించనున్నారు. ఫలితంగా రోడ్లన్నీ అత్యంత భద్రతగా ఉండడంతోపాటు ప్రమాదాలు తగ్గేందుకూ అవకాశం ఉంటుందని ఎన్‌హెచ్ఏఐ అధికారులు అంటున్నారు. త్వరలోనే హైదరాబాద్-నాగపూర్ హైవేపై ఈ సాంకేతిక విధానం అందుబాటులోకి రానుంది.

త్వరలో మరో మూడు ఎన్‌హెచ్‌లపై..

ప్రస్తుతానికి నాగపూర్-హైదరాబాద్ రూట్‌లో డిజిటల్ హైవే విధానం అందుబాటులోకి రానుండగా.. త్వరలో రాష్ట్రం గుండా వెళ్తున్న మరో మూడు జాతీయ రహదారులపైనా సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారిపై ఈ విధానాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తిచేసి రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల అధికారులను ఆదేశించారు. దీంతో రహదారిని ప్రారంభించేలోపు లేదా ఆ తరువాతనైనా డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు నిర్ణయించారు. ఇందుకు అవసరమైన పనిలో నిమగ్నమయ్యారు. ఇక కర్నూల్-రాయచూర్ మార్గంలోనూ స్మార్ట్ రోడ్డు విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. హైదరాబాద్-విజయవాడ మార్గంలోనూ దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఈ రహదారిపై అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ మేరకు 17 బ్లాక్‌స్పాట్‌ల వద్ద పలు రకాల పనులు చేపట్టగా.. అవి పలు దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. దీంతోపాటు ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసలను, ఆరు వరుసల రోడ్డుగా మార్చేందుకు డీపీఆర్ సిద్ధమవుతోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యేలోపు.. ఈ రోడ్డుపైనా అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏటీఎంఎస్)ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.


నిర్మాణమే స్మార్ట్‌గా.. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం

రాష్ట్రంలోని పలు జాతీయ రహదారులతోపాటు రాష్ట్రానికే సూపర్ గేమ్‌చేంజర్‌గా భావిస్తున్న రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తరభాగంలోనూ ఈ సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. అంతేకాకుండా ఇక నుంచి రాష్ట్రానికి మంజూరయ్యే జాతీయ రహదారులను ఈ విధానంలోనే నిర్మించనున్నట్టు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు 6 వరుసలతో 161 కిలోమీటర్ల మేర నిర్మించబోయే ఉత్తరభాగంలో నిర్మాణ సమయంలోనే ఈ సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఇందుకు అవసరమైన వ్యవస్థలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే వివరాలను కూడా ఖరారు చేసినట్టు తెలిసింది.

'హింస' డైలాగ్‌లను నేతలు సమర్థించడం విచారకరం

నాయకులు ఎలా ఉన్నారో ప్రజలే గమనించాలి

పుస్తక ఆవిష్కరణలో వెంకయ్య నాయుడు



హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హింసను ప్రోత్సహించే కొన్ని సినిమా డైలాగులను బాహాటంగానే కార్యకర్తలు చెబుతుండడం, కొందరు నాయకులు వారిని సమర్థిస్తుండడం విచారకరమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. నాయకులు ఎలా ఉన్నారో ప్రజలు గమనించాలని, ఎలాంటి వారి వెంట తిరుగుతున్నామో కార్యకర్తలు కూడా ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవుపలికారు. ఆదివారం హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో 'నిరుపమాన దేశభక్తులు పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి' పుస్తకాన్ని వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమం కోసం తమ యావదాస్తిని, జీవితాలను అంకితం చేసిన పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి దంపతులు మహనీయులని కొనియాడారు. ఆ దంపతుల జీవితం ఆదర్శనీయమని.. వారి జీవితాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత రాజకీయాలు సాగుతున్న తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. నాయకత్వమంటే అధికారం, అజమాయిషీ చలాయించడం కాదని.. బాధ్యతతో వ్యవహరించడమని చెప్పారు. నాయకుడికి క్యారెక్టర్ (గుణం), కెపాసిటీ (సామర్థ్యం), క్యాలిబర్ (యోగ్యత), కాండక్ట్ (నడత) అనే నాలుగు 'సీ'లతో కూడిన ఉత్తమ లక్షణాలు ఉండాలని హితవు పలికారు. క్యాష్ (డబ్బు), కమ్యూనిటీ (వర్గం), క్యాస్ట్ (కులం), క్రిమినాలిటి (నేరచరిత్ర) అనే నాలుగు 'సీ'లను కలిగిన వారితో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పుస్తక రచయితలు గాదం గోపాలస్వామి, తిప్పిరిశెట్టి వెంకట రంగనాయకులుతో పాటు పసలకృష్ణమూర్తి మనుమరాలు వీణ, ఏపీ ఎమ్మెల్సీ మండలి బుద్ధప్రసాద్, ఐఏఎస్ రాజమౌళి పాల్గొన్నారు.



మూత్ర పరీక్షకూ దిక్కులేదు!

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించడం లేదు. కొన్నింటికి భవన యజమానులు తాళాలు వేశారు. ఇటీవలే ఏడుగురు యజమానులు తమ భవనాలను ఖాళీ చేయాలని ఈఎ్‌సఐకి నోటీసులు కూడా ఇచ్చారు. పలుచోట్ల డిస్పెన్సరీలను సరిగా నిర్వహించలేక సమీపంలోని ఈఎ్‌సఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో కలిపేస్తున్నారు. అద్దె సరిగా చెల్లించకపోవడంతో హైదరాబాద్‌లోని తార్నాక డిస్పెన్సరీకి భవన యజమాని తాళం వేశారు. ఆ డిస్పెన్సరీని తాజాగా నాచారం ఆస్పత్రికి తరలించారు. జీడిమెట్ల-1, జీడిమెట్ల-2 డిస్పెన్సరీలను, సనత్‌నగర్‌లో రెండు డిస్పెన్సరీలను కలిపేశారు. ఇలా ఇప్పటివరకు సుమారు 20 డిస్పెన్సరీలను విలీనం చేశారు. మరోవైపు డిస్పెన్సరీల్లో 120 పైగా డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనితో రోగులు ఇబ్బందిపడుతున్నారు.

కనీస వైద్య పరీక్షలూ కరువే!

ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీలకు వచ్చే రోగులకు వైద్యం, పరీక్షలు, ఔషధాలు ఉచితంగా అందాలి. అయితే వైద్య పరీక్షలకు అవసరమైన రసాయన పదార్థాల (రీఏజెంట్స్)కాంట్రాక్టు గడువు ముగియడంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచే సరఫరా నిలిచిపోయింది. కొత్తగా టెండర్లు పిలిచి రీఏజెంట్స్ సరఫరాకు చర్యలు తీసుకోవాల్సిన ఈఎస్ఐ ఉన్నతాధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నాచారం వంటి కీలక ఈఎస్ఐ ఆస్పత్రిలో రీఏజెంట్స్ లేక మూత్ర పరీక్షలు నిలిచిపోయాయి. రక్త పరీక్షల్లోనూ కొన్ని రకాలే చేస్తున్నారు. దీంతో ఓపీ(ఔట్ పేషెంట్ల)సంఖ్య 40శాతానికి తగ్గినట్టు ఈఎస్ఐ వర్గాలు చెబుతున్నాయి. ఈఎస్ఐ రెండేళ్లుగా ఔషధ సరఫరా కంపెనీలకు సరిగా బిల్లులు చెల్లించడం లేదు. ఏడాది నుంచి రూపాయి ఇవ్వకపోవడంతో బకాయిలు రూ.150కోట్లకు చేరాయి. దీంతో ఆ సంస్థలు మందుల సరఫరా నిలిపివేశాయి. లోకల్ పర్చేజ్ కింద ఔషధాలను సరఫరా చేసే 'ట్విన్ సిటీస్ మెడికల్ అసోసియేషన్స్' కూడా ఈఎస్ఐ ఆస్పత్రులకు మందులు సరఫరా చేయబోమని చెప్పాయి. ఈఎస్ఐ ఆస్పత్రుల నుంచి 5లక్షల మంది మధుమేహ బాధితులు ప్రతీనెలా ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకెళ్తుంటారు. కొన్ని నెలలుగా వాటి సరఫరా నిలిచిపోవడంతో బయటే కొనుగోలు చేస్తున్నారు. పలు ముఖ్యమైన ఔషధాలు కూడా అందుబాటులో లేకుండాపోయాయి. కొత్తగా బాధ్యతలు తీసుకున్న కార్మికశాఖ మంత్రి వివేక్ ఈ దుస్థితిపై దృష్టిసారించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

బెంగళూరుకు హైస్పీడ్ కారిడార్

నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు నిర్మించే రహదారినే బెంగళూరు వరకు కొనసాగింపు

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్- బెంగుళూరు హైవేకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ రహదారి విస్తరణ సమస్యకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు తెరదించింది. హైదరాబాద్-బెంగుళూరు మార్గంలో హైస్పీడ్ కారిడార్‌ను నిర్మించాలని నిర్ణయించింది. దీని నిర్మాణానికి అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన బాధ్యతలను టెండర్ ద్వారా ఓ సంస్థకు అప్పగించింది. కాగా, డీపీఆర్ కోసం రూ.12.63 కోట్లు వెచ్చించనున్నట్టు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) పేర్కొంది. మరోవైపు నాగపూర్-హైదరాబాద్ వరకు కూడా మరో హైస్పీడ్ కారిడార్‌ను నిర్మించాలని కేంద్రం ఇదివరకే నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికి అవసరమయ్యే డీపీఆర్ రూపకల్పన బాధ్యతను కూడా టెండర్ ద్వారా ఓ సంస్థకు కట్టబెట్టింది. తాజాగా డీపీఆర్ రూపకల్పనకు అవసరమైన 'లెటర్ ఆఫ్ అగ్రిమెంట్' కూడా చేసుకున్నారు. ఈ డీపీఆర్ కోసం రూ.14.99 కోట్లు వెచ్చించనున్నారు. ఈ రెండు మార్గాలను 'విజన్-2047' జాతీయ రహదారుల మాస్టర్ ప్లాన్‌లో కూడా చేర్చినట్టు ఎన్‌హెచ్ఏఐ తెలిపింది. త్వరలోనే ఈ మార్గాలకు సంబంధించిన సర్వే పనులు మొదలు కానున్నాయి. నాగపూర్-హైదరాబాద్-బెంగళూరు మధ్య రాకపోకలతోపాటు ఈ మార్గంలో వ్యాపార, వాణిజ్య రంగాన్ని మరింతగా పెంచాలని కేంద్రం నిర్ణయించింది. అందులో భాగంగానే నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వరకు హైస్పీడ్ కారిడార్ నిర్మాణం తలపెట్టింది. ఆ తరువాత హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ప్రస్తుతం ఉన్న రహదారిని విస్తరించి, కొత్త రోడ్డుకు అనుసంధించాలని భావించింది. కానీ, ప్రస్తుత రోడ్డు విస్తరణకు పలు సమస్యలు తెరపైకి వచ్చాయి. హైదరాబాద్-బెంగళూరు మధ్య ప్రస్తుతం 4 వరుసలతో రోడ్డు ఉండగా, గంటకు 80 కిలోమీటర్ల వేగంతో మాత్రమే ప్రయాణించేందుకు అవకాశం ఉంది. దీనిపై క్షేత్రస్థాయిలో జామెట్రిక్స్ (రహదారి మార్గం పూర్తిస్వరూపం), జిగ్‌జాగ్ (రోడ్డుపై వంకరలు, మూల మలుపులు ఎక్కువగా ఉండడం) సమస్యలు తలెత్తుతున్నాయి. దాంతో ప్రస్తుతం 4వరుసలుగా ఉన్న రహదారిని 12 వరుసలుగా మార్చడం కష్టతరమవుతుందని రహదారి ఇంజనీరింగ్ విభాగం తెలిపింది.

రెండు సెక్షన్లుగా రహదారి నిర్మాణం..

హైదరాబాద్-బెంగళూరు రహదారి విస్తరణ అంశం ఎటూ తేలకపోవడంతో ఏళ్ల తరబడి ఇది పెండింగ్‌లోనే ఉండిపోయింది. ఈ నేపథ్యంలో దీనిని విస్తరించడం కంటే నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వరకు నిర్మించే హైస్పీడ్ కారిడార్‌నే బెంగళూరు వరకు కొనసాగిస్తే మంచిదన్న అభిప్రాయానికి ఎన్‌హెచ్ఏఐ వచ్చింది. జాతీయ రహదారుల విభాగంలో ఉన్న నార్త్‌సౌత్ కారిడార్ (ఎన్‌హెచ్-44)లో భాగంగా నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వరకు నిర్మించబోయే జాతీయ రహదారినే బెంగళూరు వరకు కొనసాగించాలని నిర్ణయించింది. అందుకోసం ఈ రహదారిని రెండు సెక్షన్లుగా విభజించింది. నాగ్‌పూర్-హైదరాబాద్ వరకు ఒకటి, హైదరాబాద్ నుంచి బెంగళూరు వరకు మరో సెక్షన్‌గా చేపట్టనుంది. ఈ హైస్పీడ్ కారిడార్‌ను మొదట 6 లేన్లుగా నిర్మించనుండగా, భవిష్యత్తులో 8లేన్లు, ట్రాఫిక్ రద్దీని బట్టి 12 లేన్లుగా విస్తరించే అవకాశం ఉంది. ఈ క్రమంలో 12 లేన్ల విస్తరణకు అవసరమైన స్థాయిలోనే భూసేకరణ చేయనున్నట్టు అధికార వర్గాలు అంటున్నాయి. కాగా ఈ రోడ్డు తెలంగాణలో 195 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 260 కి.మీ, కర్ణాటకలో 106 కి.మీ మేర నిర్మాణం కానుంది. మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి తెలంగాణలోని హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ మీదుగా కర్ణాటకలోని బెంగళూరు వరకు మొత్తం 1,150 కిలోమీటర్ల మేర నిర్మితమయ్యే ఈ రహదారికి రూ.35వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు.

గంటకు 120 కి.మీకు పైగా వేగంతో..

నాగపూర్-హైదరాబాద్- బెంగుళూరు వరకు ప్రతిపాదించిన హైస్పీడ్ కారిడార్‌పై గంటకు 120 కి.మీ కన్నా ఎక్కువ వేగంతో వాహనాలు ప్రయాణించేలా రోడ్డును నిర్మించనున్నట్టు తెలిసింది. ఆ మేరకే సర్వే నిర్వహించనున్నట్టు సమాచారం. డీపీఆర్ కోసం నిర్వహించనున్న సర్వేను ప్రస్తుతం ఉన్న హైదరాబాద్-బెంగుళూరు హైవేకు రెండు వైపులా చేపట్టనున్నారు. రోడ్డు నిర్మాణానికి ఎంత భూమి అవసరమవుతుంది, మార్గమధ్యంలో నిర్మాణాలు ఎన్ని ఉన్నాయి, అటవీ, వ్యవసాయ భూములు ఏమైనా ఉన్నాయా, రైల్వే మార్గం, హై టెన్షన్ విద్యుత్ లైన్లు సహా సమగ్ర వివరాలతో కూడిన అలైన్‌మెంట్‌ను రూపొందించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులను త్వరలోనే మొదలుపెట్టనుండగా.. రెండు మూడు ప్రతిపాదనలతో కూడిన నివేదికను రూపొందించనున్నట్టు సమాచారం.

ఐక్యతా స్ఫూర్తి.. శ్యామా ప్రసాద్ ముఖర్జీ

» ఆయన ఆశయాలకు అనుగుణంగానే ఆర్టికల్ 370 రద్దు

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు తదితరులు

హైదరాబాద్/బేగంపేట/హైటెక్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఇద్దరు ప్రధాన మంత్రులు, రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు ఉండకూడదని పోరాడిన నేతగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ చరిత్రలో నిలిచిపోతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే ప్రధాని మోదీ ఆర్టికల్ 370ని రద్దు చేశారని తెలిపారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడారు. ఒకే దేశం-ఒకే చట్టం-ఒకే రేషన్-ఒకే ఎన్నికలు అన్న భావనను విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. దేశ సమగ్రత కోసం ప్రతీ కార్యకర్తా శ్రమించాలని కోరారు. శ్యామా ప్రసాద్.. పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తి దాత అని అన్నారు. చిన్న వయసులోనే అనేక పోరాటాలు చేసి కశ్మీర్ సమస్యపై దీటుగా పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. కాగా, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఏటా ఐటీ ఉద్యోగులు బోనాల ఉత్సవాలను జరుపుకోవడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్(టీటా) ఆధ్వర్యంలో మాదాపూర్ ఐటీ కారిడార్‌లో చిన్న పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు.

బ్రాహ్మిణ్ ఎక్సెలెన్స్ సత్కారం

సెంటర్ ఫర్ బ్రాహ్మిణ్ ఎక్సెలెన్స్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును సన్మానించారు. బేగంపేటలోని పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకరభారతి స్వామి.. రాంచందర్ రావును ఆశీర్వదించారు. అనంతరం సెంటర్ ఫర్ బ్రాహ్మిణ్ ఎక్సెలెన్స్ ప్రతినిధులు కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ వాణీదేవి, అరవిందరావు, జ్వాలా నరసింహారావు, వేణుగోపాలచారి, మాధవీలత, రాజీవ్‌శర్మ, రామచందర్‌రావు తదితరులు సన్మానించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశానికే ఆదర్శం

» ఏడాదిలోనే పథకానికి రూ.22 వేల కోట్ల ఖర్చు: భట్టి



మధిరటౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఒక్క ఏడాదిలోనే ఈ పథకానికి రూ.22 వేల కోట్లు ఖర్చు చేసి 4.5 లక్షల మంది పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఖమ్మం జిల్లా మధిరలో ఆదివారం మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల అధికారంలో ఉన్న వారు 'డబుల్‌బెడ్ రూం' పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వంలో పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా తాను, సహచర మంత్రులమంతా ధృడసంకల్పంతో పనిచేస్తున్నామని తెలిపారు. రానున్న మూడున్నరేళ్లలో మరిన్ని అద్భుతమైన పథకాలు తీసుకువస్తామని చెప్పారు. తాము రోజుకు 18 గంటలు కష్టపడి పనిచేస్తూ గత పాలకులు చేసిన అప్పులు చెల్లిస్తూనే సంక్షేమాన్ని, అభివృద్ధిని ముందుకు తీసుకెళుతున్నామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో తమకు పుట్టగతులు ఉండవని ప్రతిపక్షాలు ఆందోళన చెంది కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తాము ప్రజల కోసం నిటారుగా నిలబడతామని ఆయన పేర్కొన్నారు.

మరో 2.89 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు

» ఈ నెల 14న పంపిణీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో 2.89 లక్షల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసింది. ఈ నెల 14వ తేదీన తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో నిర్వహించే బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభించేనాటికి రాష్ట్రవ్యాప్తంగా 89,95,282 రేషన్ కార్డులు అమల్లో ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 26వ తేదీ నుంచి గత మే నెల 23వ తేదీ వరకు 2,03,156 కొత్త దరఖాస్తులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇవికాకుండా అదనపు సభ్యుల నమోదుకు సంబంధించి 15,18,783 దరఖాస్తులను ఆమోదించింది. దీంతో అదనంగా 23,90,868 మంది సభ్యులు వినియోగదారుల జాబితాలో చేరారు. అనంతరం మే 24వ తేదీ నుంచి ఇప్పటివరకు అందిన దరఖాస్తులను పరిశీలించి 2,89,239 కార్డులకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. దీంతో అదనంగా మరో 9,10,349 మంది వినియోగదారుల జాబితాలో చేరారు. ఈ వ్యవధిలో 2,65,142 దరఖాస్తులు అదనపు సభ్యుల నమోదుకు అనుమతించారు. తద్వారా 4,17,160 మంది కొత్తగా వినియోగదారుల జాబితాలో చేరారు. తాజాగా ఆమోదం పొందిన 2.89 లక్షల కుటుంబాలకు ఈ నెల 14వ తేదీ నుంచి రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం అవుతుంది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తంగా 4,92,395 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు అవుతుంది. కాగా పాత, కొత్త కార్డులు కలిపి రాష్ట్రంలో రేషన్‌కార్డుల సంఖ్య 94,72,422కు చేరుతుంది. లబ్ధిదారుల సంఖ్య 3,14,56,690కు పెరుగుతుంది.

అంగన్‌వాడీ నియామకాలపై కసరత్తు

» రోస్టర్ పాయింట్ల ఖరారుకు కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో అంగన్‌వాడీ సిబ్బంది నియామకంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రోస్టర్ పాయింట్లను ఖరారు చేసేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆదివారం ప్రత్యేక కమిటీని నియమించింది. ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ సునంద నేతృత్వంలో మరో ముగ్గురు అధికారులతో ఈ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీలో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ సీడీపీవో మిల్కా, హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి జ్యాంతి, హైదరాబాద్ ప్రధాన కార్యాలయ సూపరింటెండెంట్ శేషపద్మ ఉన్నారు. వీరు పొరుగు రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లోని గిరిజన ప్రాంతాల్లో అంగన్‌వాడీ నియామకాలకు సంబంధించి అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయనున్నారు. తమ నివేదికను మంత్రి సీతక్కకు సమర్పిస్తారు. దాని ఆధారంగా ప్రభుత్వం రోస్టర్ పాయింట్లను ఖరారు చేసి నియామక ప్రక్రియకు తుదిరూపునిస్తుంది.

మోదీ మెగా ఫెయిల్యూర్ మాటేంది?

» రామచందర్‌రావుకు మంత్రి పొన్నం ప్రశ్న

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గడిచిన 11 ఏళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు అణా పైసా తేలేని బీజేపీ నేతలు.. తమకు లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సీఎం రేవంత్‌కు లేఖలు రాయడం కాదని, ముందు మోదీ సర్కారు మెగా ఫెయిల్యూర్ మాటేందో చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును ప్రశ్నించారు. వాగ్దానాలతో ఊదరగొట్టడం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం, అబద్ధాలను ఆవిష్కరించడం తప్ప మోదీ సర్కారు చేసిందేమీ లేదన్నారు. అన్ని వర్గాలనూ మోసం చేసిన చరిత్ర మోదీ సర్కారుదని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. 60 ఏళ్లు దాటిన సన్న చిన్నకారు రైతులకు పింఛన్లు ఇస్తామన్నారని, కిసాన్ సమ్మాన్ నిధిని పెంచుతామన్నారని, వాటిని అమలు చేశారా? అని ఆయన ప్రశ్నించారు.

కాంగ్రెస్ పాలనలో ఎరువులకూ కరువే..!

» ఎరువులను బుక్కేస్తున్న మేతన్నలెవరో తేల్చాలి: కేటీఆర్

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు తప్పడం లేదని.. రైతు భరోసా, రైతు రుణమాఫీ హామీలు ఎగ్గొట్టడమే కాకుండా ఇప్పుడు ఎరువులకు కూడా తీవ్రమైన కరువు ఏర్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అప్పు తెచ్చి వ్యవసాయం చేద్దామన్నా.. కనీసం ఒక ఎరువుల బస్తా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల లోటు ఎందుకు ఉందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. రూ.266కు అందుబాటులో ఉండాల్సిన యూరియా బస్తా ధర ఇప్పుడు రూ.325కు చేరిందని, ఇందుకు కారణం ఏమిటని నిలదీశారు. కృత్రిమ కొరత సృష్టించి.. ఆఖరికి ఎరువులను కూడా బుక్కేస్తున్న మేతన్నలు ఎవరో తేల్చేందుకు తక్షణం విచారణ జరిపించాలని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతులు ఆనందంగా ఉంటే బీఆర్ఎస్ నేతలకు కళ్లుమంట!

(మొదటిపేజీ తరువాయి)

రైతు సంక్షేమానికి ఖర్చు చేసి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. రాష్ట్రంలో తాము అధికారం చేపట్టిన తర్వాత రైతులకు దిగుబడులు పెరిగాయని, అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు అందుతున్నాయని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు రైతు సంక్షేమాన్ని పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు వ్యవసాయం, రైతులు, ఎరువులు,నీళ్లు అని మాట్లాడుతుంటే.. వారంతా నిస్పృహలో ఉన్నారనే విషయం తెలంగాణ సమాజం అర్థం చేసుకుందన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్రప్రభుత్వం ఒకేసారి రూ.21వేల కోట్లు రుణమాఫీ చేసి 25 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసిందని తుమ్మల తెలిపారు. బీఆర్ఎస్ ఎగ్గొట్టిన రైతుబంధు తోపాటు రెండో పంట కాలాల్లో రూ.13,500 కోట్లు రైతు భరోసా పథకంలో చెల్లించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9000 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసిందన్నారు. దీంతో తమ రాజకీయ జీవితానికి ఎక్కడ చరమగీతం పడుతుందోనన్న భయంతో బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. "మీరు అరకొరగా చేసిన రుణమాఫీతో రైతులకు ఏమైనా లాభం కలిగిందా? అసలు రుణమాఫీ అయ్యిందా? రైతుబంధు సొమ్మును ఎప్పుడైనా రెండు నెలల్లోపు వేశారా? రైతుబంధు పేరుతో ఎగ్గొట్టిన పథకాలు ఎన్ని? ఐదేండ్లలో పంట నష్టపరిహారం ఎప్పుడైనా చెల్లించారా? కేంద్ర ప్రభుత్వ పథకాలకు వాటా ధనం చెల్లించకుండా నిధులు అడ్డుకున్నది ఎవరు? యాంత్రీకరణ పథకానికి తూట్లు పొడిచింది ఎవరు? మైక్రో ఇరిగేషన్ పథకానికి చరమగీతం పాడింది ఎవరు? ఏదైనా పంటలకు గిట్టుబాటు ధర కల్పించారా ? వరి వేస్తే ఉరి వేసుకున్నట్లే అన్నది ఎవరు? చివరికి పచ్చి రొట్ట విత్తనాల సబ్సిడీ కూడా బకాయిలు పెట్టింది ఎవరు?" అని బీఆర్ఎస్ నేతలను తుమ్మల ప్రశ్నించారు.



1.9లక్షల టన్నుల ఎరువుల లోటు

రాష్ట్రంలో 1.9లక్షల టన్నుల ఎరువుల లోటు ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రైతులు వానాకాలంలో 53 లక్షల బస్తాల యూరియా, 20లక్షల డీఏపీ, 45 లక్షల బస్తాల కాంప్లెక్స్ ఎరువులను కొనుగోలు చేశారని తెలిపారు. మరో 67లక్షల బస్తాల యూరియా, 8లక్షల బస్తాల డీఏపీ, 66లక్షల బస్తాల కాంప్లెక్స్ ఎరువులు, 6లక్షల ఎంఓపీ బస్తాలు, 4లక్షల ఎస్ఎస్‌పీ బస్తాలు జిల్లా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఇదికాక, ప్రతిరోజు 2-3లక్షల బస్తాల ఎరువులు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

సంయమనం పాటించండి

మంత్రి కొండా సురేఖకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య వివాదం పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డే నేరుగా రంగంలోకి దిగారు. ఆదివారం మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుష్మితాపటేల్‌లను తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో బాధ్యతగల నాయకులు అయ్యుండి.. పార్టీ అంతర్గత వేదికలపై మాట్లాడాల్సిన అంశాలను బహిరంగంగా ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. పార్టీకి బలమైన నాయకుల అవసరమేనని, అయితే ప్రభుత్వానికి ఎమ్మెల్యేలు కూడా ముఖ్యమేనని సీఎం వెల్లడించినట్లు సమాచారం. ఈ వ్యవహారం ఇప్పటికే అధిష్ఠానం వరకు వెళ్లిందని, ఇక మీదట సంయమనం పాటించాలని సూచించినట్లు తెలిసింది. కాగా.. కొండా మురళి వ్యాఖ్యలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చోటు చేసుకున్న వివాదంపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ సోమవారం గాంధీ భవన్‌లో భేటీ కావాల్సి ఉంది. అయితే ఆ సమావేశం వాయిదా పడినట్లు కమిటీ ఛైర్మన్ మల్లు రవి ప్రకటించారు. వరంగల్ కార్పొరేషన్ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొనాల్సి ఉన్నందున భేటీని ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసినట్లు ఓ ప్రకటనలో ఆయన వెల్లడించారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఉదయం 9 గంటలకు వ్యవసాయ యూనివర్సిటీ ఆవరణలో జరిగే వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సీఎం.. అనంతరం అక్కడి నుంచి నేరుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఉదయం 10.30 గంటలకు విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు. ఈ పర్యటనలో రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులను ఆయన కలిసే అవకాశం ఉంది. అలాగే అధిష్ఠానం పెద్దలనూ కలిసే ఆస్కారముంది. ఇటు హైదరాబాద్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్‌ను సీఎం రేవంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో ఆయన్ను సత్కరించి, వెండి నంది జ్ఞాపికను బహూకరించారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దళితుల అభ్యున్నతి, వారి హక్కుల కోసం జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని.. దేశానికి ఎనలేని సేవలందించారని ఈ సందర్భంగా కొనియాడారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

నేటి నుంచి వనమహోత్సవం

హైదరాబాద్/రాజేంద్రనగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆకుపచ్చని తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం సోమవారం ప్రారంభం కానుంది. సీఎం రేవంత్ రెడ్డి ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శ్రీకారం చుట్టనున్నారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, అటవీ దళాల ప్రధానాధికారి సువర్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏటా జూలై మొదటి వారంలో నిర్వహిస్తోంది. ఈ ఏడాది 18.02 కోట్ల మొక్కను నాటాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో అత్యధికంగా పంచాయతీరాజ్ శాఖ 7 కోట్లు, పురపాలక శాఖ 8 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించింది. అటవీ, వ్యవసాయ శాఖలు కూడా కోటి మొక్కలు నాటాలని ఆదేశించింది. గత ఏడాది 20 కోట్లు మొక్కలు నాటాలన్నది లక్ష్యం కాగా.. అందులో 95% మొక్కలు నాటారు. ఈ ఏడాది 100% లక్ష్య సాధనకు కృషి చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. వన మహోత్సవం కోసం 14,355 నర్సరీల్లో 20 కోట్ల మొక్కలు సిద్ధం గా ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. .

అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు: వీసీ

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చెట్లను నరికి వేస్తున్నారని సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని, దాన్ని ఎవరూ నమ్మవద్దని వైస్‌చాన్సలర్ ఆల్దాస్ జానయ్య కోరారు. వాతావరణానికి ముప్పు కలిగించే వర్సిటీ భూముల్లోని 3 వేల సుబాబుల్, 550 యూకలిప్టస్, సర్కారు తుమ్మ చెట్లను మాత్రమే తొలగిస్తున్నామని చెప్పారు.



లబ్ధిదారుకు ఇంటి మంజూరు పత్రాలను అందిస్తున్న మంత్రి పొంగులేటి

రాష్ట్రంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

మంజూరు చేశాం

» మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

కొత్తగూడెం, హైదరాబాద్ జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదలకు 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కేటాయించామని, బఫర్ కింద మరో 1,500 ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. భద్రాద్రి జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో నియోజకవర్గానికి చెందిన 2,500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను ఎన్నికల్లో ప్రచారానికి మాత్రమే వాడుకుని ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కాగా, రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, మన్ననూర్, ఏటూరునాగారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల పరిధిలోని 21 నియోజకవర్గాల్లో 13,266 చెంచు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించామని మంత్రి పొంగులేటి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం తొలి విడతలో భాగంగా అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూర్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి చెంచులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కన్నెపల్లి నుంచి నీళ్లివ్వండి

మేడిగడ్డ పిల్లర్లు కుంగాయన్న సాకు వద్దు

» రాష్ట్ర రైతాంగానికి నీళ్లిచ్చి ఆదుకోవాలి

» లేదంటే కేసీఆర్ ఆధ్వర్యంలో నీటి మోటార్లను నడిపిస్తాం

» అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగానే ఉన్నాయని ఉత్తమ్ చెప్పారు

» నీళ్ల విలువ తెలియని పాలకుల వల్లే ఇబ్బందులు: హరీశ్ రావు



హైదరాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి): "మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగినాయన్న సాకుతో కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని పడావు పెట్టారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్ల తీసుకునే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఇంజనీర్లే చెప్తున్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని మోటర్లు ఆన్ చేయకుండా రైతులను గోస పెడుతోంది. ఇప్పటికైనా స్పందించి తక్షణమే కన్నెపల్లి, కల్వకుర్తి పంపులను ఆన్ చేసి రైతులకు నీళ్ల ఇవ్వాలి. లేకపోతే కేసీఆర్ నాయకత్వంలో లక్షలాది మంది రైతులందరం కలిసి మోటర్లు ఆన్ చేస్తాం" మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 36 రోజుల క్రితమే శ్రీశైలానికి వరద మొదలవ్వగా.. ఇప్పటికీ కల్వకుర్తి మోటార్లను నడపడం లేదని మండిపడ్డారు. కళ్లముందు నీళ్ల పోతుంటే పట్టించుకోని ప్రభుత్వం తీరు నేరపూరితంగా ఉందన్నారు. పదే పదే తాను పాలమూరు బిడ్డను అని చెప్పుకునే ముఖ్యమంత్రి, అక్కడి రైతుల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. గత ఏడాది ఆ ప్రాంత రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించి ఆంధ్రలో మూడో పంటకు నీళ్ల వదిలారని, ఈసారీ ఆంధ్రకు నీళ్లొదిలే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కృష్ణా జల్లాల్లో అతి తక్కువ నీళ్ల వాడుతున్నది రేవంత్ రెడ్డి ప్రభుత్వమేనని, చంద్రబాబుతో రేవంత్‌కు ఉన్న చీకటి ఒప్పందం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. నీళ్ల విలువ తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉంటే ఆ నీళ్లను మలుపుకొనే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటారని చెప్పారు. కానీ నీళ్ల విలువ తెలియని నాయకులు మన పాలకులుగా ఉండటం వల్ల రైతాంగం తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నదని దుయ్యబట్టారు. గతంలో కోదండరాం అడిగిన ప్రశ్నకు, అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ సమాధానమిస్తూ.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగానే ఉన్నాయని చెప్పారని గుర్తుచేశారు. మరి ఆ బ్యారేజీల్లోకి నీరు ఎత్తిపోసి రైతులకు అందించడానికి ప్రభుత్వానికున్న ఇబ్బందులేంటని ప్రశ్నించారు. రోజుకు రెండు టీఎంసీల నీళ్లను కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి తెచ్చుకునే అవకాశం ఉందని, ఈరోజు కాళేశ్వరం మోటర్లు ప్రారంభించినా.. 15జిల్లాలకు నీళ్ల ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు బీఆర్ఎస్‌పై బురద జల్లడంలోనే పోటీపడుతున్నారని, రైతులకు సాగునీటిని అందించాలన్న అంశంపై దృష్టి పెట్టడం లేదని ఆయన విమర్శించారు.

కుంగే బ్యారేజీలకు

నీళ్లు ఎత్తిపోయాలా?

» ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు హరీశ్ యత్నం

» రైతులు బాగుంటే ఓర్వలేకపోతున్నారా?

» రికార్డు స్థాయిలో వరి పంట సాగయింది

» ఇప్పటికైనా అబద్ధాలు మాట్లాడడం మానుకోవాలి: ఉత్తమ్‌కుమార్ రెడ్డి



హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): "అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలు ప్రమాదకరంగా ఉన్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) హెచ్చరించింది. అయినా సరే, కన్నెపల్లి పంప్‌హౌజ్ నుంచి నీటిని ఎత్తిపోయాలని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు పదే పదే మాట్లాడుతున్నారు. దీని వెనుక ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర తప్ప రైతులకు మేలు చేసే ఉద్దేశం లేదు. కుంగే బ్యారేజీలకు నీళ్ల ఎత్తిపోయాలా?" అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పానలనో రైతులు బాగుంటే ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. గతంలో మేడిగడ్డ బ్యారేజీ నుంచి అన్నారం, సుందిళ్ల, అక్కణ్నుంచి ఎల్లంపల్లికి లిఫ్ట్ చేసిన 160 టీఎంసీలలో దాదాపు 57 టీఎంసీల నీళ్ల మళ్లీ గేట్లు ఎత్తి సముద్రానికి పంపించి ప్రజాధనాన్ని గోదాట్లో పోసిన విషయం మరిచిపోయారా..? అని ప్రశ్నించారు. సీకెంట్ ఫైల్స్ టెక్నాలజీతో మేడిగడ్డ నిర్మాణం చేపట్టిన విషయాన్ని ఎన్డీఎస్ఏ తప్పుబట్టిందని తెలిపారు. మేడిగడ్డ మాదిరిగానే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను అదే సీకెంట్ ఫైల్స్ ఫౌండేషన్ టెక్నాలజీతో నిర్మించటంతో ప్రమాదకరంగా మారాయని పేర్కొన్నారు. ఎన్డీఎస్ఏ సలహాలు, సూచనల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులపై తగిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. గోబెల్స్‌కు మించి ప్రచారం చేయటం హరీశ్ రావుకు అలవాటైపోయిందని, ఇప్పటికైనా అబద్ధాలు మాట్లాడడం మానుకోవాలన్నారు. గత ఏడాది వానాకాలంతో పాటు ఇటీవలి యాసంగిలో దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రైతులు రికార్డు స్థాయిలో వరి పంట సాగు చేశారని చెప్పారు. గత వానాకాలంలో 66.7 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేసి 153.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించారని, యాసంగిలో 60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తే.. 130 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించిన ఘనత తెలంగాణ రైతులదని పేర్కొన్నారు. దేశ చరిత్రలోనే ఒకే ఏడాదిలో 283 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సాధించిన రికార్డు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధ్యమైందన్నారు. ప్రతి ఏడాది జూలై చివరిలో లేదా ఆగస్టు ఒకటో తేదీన కల్వకుర్తి పంపులను ప్రారంభించి వానాకాలం పంటలకు నీళ్లు అందిస్తారని, ఈసారీ అదే విధానం అమలవుతుందని ఆయన వెల్లడించారు.

వంద కొడతాం.. బీఆర్ఎస్‌ను బొంద పెడతాం!

» ఇక నుంచి మా నినాదమిదే: ప్రభుత్వ విప్ బీర్ల

» సీఎం రేవంత్‌తో కేటీఆర్‌కు పోలికా?: ఈరవత్రి

» లోకేశ్‌తో రహస్య భేటీల మతలబేంటో?: సామా

» కేటీఆర్ స్థాయికి అద్దంకి చాలు: గజ్జెల కాంతం

హైదాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): 'వచ్చే ఎన్నికల్లో వంద కొడతాం.. బీఆర్ఎస్ పార్టీని బొంద పెడతాం.. ఇక నుంచి మా నినాదం ఇదే!' అని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలకు ఇంకా అహంకారం.. బలుపూ తగ్గలేదని విరుచుకుపడ్డారు. కేటీఆర్ ఒక బచ్చా అని.. ఆయనతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలా అని ఆదివారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. ప్రజలు ఛీకొడితే ఫాంహౌస్, గెస్ట్ హౌస్‌లకు పరిమితమైన వారితో సీఎం రేవంత్‌కు పోటీనా అని నిలదీశారు. దోచుకున్న డబ్బులు, పింక్ మీడియాతో కేటీఆర్ ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. సీఎం రేవంత్‌తో.. కేటీఆర్‌కు పోలిక ఏంటని ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ ప్రశ్నించారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్ సవాళ్లకు తాను సరిపోతానన్నారు. ప్రెస్‌క్లబ్‌కు తానే వస్తానని, అన్ని అంశాలపైనా చర్చ పెడదామని చెప్పారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించిన కల్వకుంట్ల కుటుంబానికి ఏ శిక్ష వేసినా తప్పు లేదన్నారు. ఓ వైపున ఏపీ సర్కారు చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టును ఆపేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తుంటే.. మరోవైపు ఏపీ మంత్రి నారా లోకేశ్‌తో కేటీఆర్ రహస్య మంతనాలు జరుపుతున్నారని టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి మండిపడ్డారు. పక్క రాష్ట్రంలో లోకేశ్‌తో పలుమార్లు కేటీఆర్ రహస్యంగా సమావేశమయ్యారన్నారు. ఎవరికి లబ్ధి చేకూర్చడానికి లోకేశ్‌తో భేటీ అయ్యారో కేటీఆరే చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ స్థాయికి సీఎం రేవంత్ అవసరం లేదని, తమ పార్టీ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావులు చాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. కేటీఆర్ ప్రెస్‌క్లబ్‌కు వస్తే ఏ అంశంపై అయినా చర్చకు సిద్ధమని చెప్పారు. ప్రజా సమస్యలపై కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ సమావేశాలకు వచ్చి మాట్లాడాలన్నారు.

కాంగ్రెస్ నేతలపై కేసులు ఎత్తేయాలి: వీహెచ్

బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ప్రభుత్వం ఎత్తేయాలని ఆ పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు కోరారు. ఇటీవల ఓ భేటీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం ఈ సూచన చేశారని గుర్తు చేశారు. అలాగే ఏళ్ల తరబడి కాంగ్రెస్ కోసం కష్టపడ్డ వాళ్లకు నామినేటెడ్, ఇతర పదవులు ఇవ్వాలన్నారు. సీనియర్ కాంగ్రెస్ నేతలతో ఈనెల 15న కర్ణాటక సీఎం సిద్దరామయ్య నిర్వహిస్తున్న భేటీకి ఆహ్వానం అందిందని.. దానికి హాజరవ్వబోతున్నట్లు ఆయన తెలిపారు.

కొత్త జిల్లాల వారీగా కోడి గుడ్ల టెండర్లు!

» అంగన్‌వాడీ, గురుకులాలు, హాస్టళ్లకు ఒకటే..

» ఐదారు రోజుల్లో సర్కారు నోటిఫికేషన్!

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకుల విద్యాసంస్థలు, వసతి గృహాలకు కోడిగుడ్ల సరఫరాకు జిల్లా స్థాయిలోనే వికేంద్రీకృత టెండర్ విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. కొత్త జిల్లాల వారీగా టెండర్లు ఆహ్వానించనుంది. అంగన్‌వాడీ గుడ్ల సరఫరాకు జోనల్ టెండర్‌ను రద్దు చేసిన సర్కారు.. ఇప్పటికే కలెక్టర్ ఛైర్మన్‌గా 15 మంది సభ్యులతో కొనుగోలు కమిటీని ఏర్పాటు చేయాలని ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా స్థాయి టెండర్ నోటిఫికేషన్‌ను ఐదారు రోజుల్లోనే ఇవ్వనున్నట్లు సమాచారం. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు జోనల్ టెండర్ విధానం అమలవగా.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, ఇతర సంక్షేమ వసతి గృహాలకు వారి పరిధిలోనే టెండర్లు నిర్వహించుకునేవారు. ఆ విధానాన్ని రద్దు చేసిన సర్కారు.. జిల్లా స్థాయి టెండర్ల ద్వారా స్థానిక కాంట్రాక్టర్లకు అవకాశాలు కల్పించడంతోపాటు సరఫరా ప్రక్రియను వేగిరం చేయడం, నాణ్యతను పర్యవేక్షించడం సులభతరం అవుతుందన్న ఉద్దేశంతో వికేంద్రీకృత టెండర్లు నిర్వహించాలని నిర్ణయించింది. గతంలో మాదిరిగా అంగన్‌వాడీలకు, గురుకులాలకు వేర్వేరు కాంట్రాక్టర్లు కాకుండా జిల్లా స్థాయిలో టెండర్ దక్కించుకున్న వారే అందరికీ గుడ్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే గుడ్లకు మాత్రమే అగ్‌మార్క్ ఉండాలని, టెండర్ నోటిఫికేషన్ కంటే ముందే రిప్లికా సీరియల్ నంబర్ ఉండడం తప్పనిసరి అనే నిబంధన ఉంది. దాన్ని జిల్లా స్థాయి టెండర్లకూ వర్తింపజేసే అవకాశం ఉంది. దీనివల్ల నాణ్యమైన గుడ్ల సరఫరాకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో అగ్‌మార్క్, రిప్లికా సీరియల్ నంబర్ గలిగిన వారు 37 మంది వరకు ఉన్నట్లు సమాచారం. అలాగే గతంలో గుడ్లు సరఫరా చేసిన అనుభవం ఉండాలనే నిబంధన కూడా పెట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అలాంటి అనుభవం కేవలం 16 మందికే ఉంది. రోజుకు 10 వేలకు పైగా గుడ్లు ఉత్పత్తి చేసే పౌల్ట్రీ రైతులు రాష్ట్రంలో 1200 మందికి పైగా ఉన్నారు. 10వేల లోపు ఉత్పత్తి చేసే రైతులు 7 వేల మంది ఉన్నారు. వీరిలో కేవలం 16 మందికే గతంలో ప్రభుత్వ సంస్థలకు గుడ్లు సరఫరా చేసిన అనుభవం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఏడాదికి అన్ని విద్యాసంస్థలకు కలిపి దాదాపు 80 కోట్ల గుడ్లు అవసరం అవుతాయని అంచనా. ఇందుకోసం ప్రభుత్వానికి సుమారు రూ.450 కోట్ల వ్యయం కానుంది.



వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో శాకంబరీ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం 11వ రోజు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఉత్సవమూర్తిని ఘునా రూపంలో.. అమ్మవారిని నీలపతాకా రూపంలో అలంకరించారు. - వరంగల్ కల్చరల్

యాదగిరిగుట్టలో శాస్త్రోక్తంగా తొలి ఏకాదశి పూజలు

▸▸ వేములవాడలో రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి

యాదగిరిగుట్ట, వేములవాడ కల్చరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వివిధ రకాల పుష్పాలతో వైభవంగా లక్ష పుష్పార్చన చేపట్టారు. అర్చకులు తొలి ఏకాదశి విశిష్టతను భక్తులకు వివరించారు. 40వేల మంది భక్తులు క్షేత్రాన్ని సందర్శించారు. ఆలయ ఖజానాకు రూ. 57,28,842 ఆదాయం సమకూరింది. కాగా, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజరాజేశ్వర స్వామివారితో పాటుగా పరివార దేవతలకు అభిషేకం, అర్చనలు చేశారు.



యాదగిరిగుట్ట ఆలయంలో పుష్పార్చన నిర్వహిస్తున్న దృశ్యం

పీ4లో ప్రవాసులు భాగస్వామ్యం కావాలి

టాంపా 'నాట్స్' సంబరాల్లో రఘురామకృష్ణరాజు, నాదెండ్ల

(ఆంధ్రజ్యోతి కోసం టాంపా నుంచి కిలారు గోకుల్ కృష్ణ)

ఏపీలో 2047 నాటికి పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన పీ4 (ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం) పథకంలో ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. శనివారం టాంపా నగరంలో ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) నిర్వహిస్తున్న 8వ అమెరికా తెలుగు సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 15 లక్షల కుటుంబాల్లో వెలుగులు నింపే ప్రణాళికతో ఏర్పాటైన పీ4 పథకానికి ప్రవాసులు చేయూతనందించాలని కోరారు. వారికి సీఎం చంద్రబాబుతో పాటు కేబినేట్‌లో చర్చించి తితిదే దర్శనాల వంటి ప్రత్యేక సదుపాయాలు అందేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పీ4ను ప్రోత్సహించాలని కోరారు. 1980ల్లో టెన్నిస్ క్రీడాకారుడిగా తాను అమెరికాకు వచ్చినప్పుడు చూసిన టాంపా ఇప్పటి టాంపా వేరని అన్నారు. ప్రవాసులు ఏపీ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాల్ వద్ద ఏపీ స్పోర్ట్స్ అథారిటీ (సాప్) చైర్మన్ రవినాయుడు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్స్ పలువురికి పురస్కారాలు ప్రదానం చేసింది. డా.గురువారెడ్డి, మ్యాక్సీ విజన్ ప్రసాదరెడ్డి, ఎటర్నల్ హెల్త్ ఐకా పూజ, డా.మాధవి శేఖరం, డా.దేవయ్య రుద్రమ్మలకు పురస్కారాలు అందజేసింది.

తిరుమలలో రాత్రి అన్నప్రసాదంలోనూ వడలు

▸▸ వెల్లడించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, జూలై 6(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదంలో మధ్యాహ్నమే కాకుండా రాత్రి భోజన సమయంలోనూ భక్తులకు వడలను వడ్డించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు అన్నప్రసాదంలో భక్తులకు వడలు అందించనున్నారు. ఆదివారం సాయంత్రం అన్నప్రసాద భవనంలోని స్వామి అమ్మవార్ల చిత్రపటం వద్ద వడలను ఉంచి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పూజ నిర్వహించారు. అనంతరం ఆయన స్వయంగా భక్తులకు వడలు వడ్డించారు.

ఏకలవ్య భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

▸▸ ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి:ఎమ్మెల్సీ కవిత

కవాడిగూడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ మొదలుపెట్టిన ఏకలవ్య భవన నిర్మాణాన్ని పూర్తిచేయలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురంభీం విగ్రహం వద్ద ఏకలవ్య జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి కవిత హాజరై ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తరువాత నాటి సీఎం కేసీఆర్ ఎరుకల కులస్థుల అభివృద్ధి కోసం ఎంపవర్మెంట్ స్కీంను ప్రవేశపెట్టారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని తుంగలో తొక్కిందన్నారు. తాను శాసనమండలిలో ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చలనం లేదని విమర్శించారు. 50వేల ఎరుకుల కుటుంబాలకు రూ.60కోట్ల మేర లబ్ధి చేకూర్చే పథకాన్ని మెరుగుపరిచి ప్రభుత్వం యధాతథంగా అమలు చేయాలన్నారు. రూ.500 కోట్లతో ఎరుకుల కార్పొరేషన్‌నూ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

2,800 ఏళ్లా.. 2,300 ఏళ్లా? తమిళ 'నాగరికత'పై రాజకీయం!

తమిళనాడులోని కీళడి నాగరికతపై ఎడతెగని వివాదం.. 2,800 ఏళ్లకన్నా ముందటిదని తేలిందంటున్న ఆ రాష్ట్ర ప్రభుత్వం

- ▸▸ సాక్ష్యంగా పురావస్తు శాఖ నివేదిక
- ▸▸ తప్పులున్నాయంటూ నిలిపేసిన కేంద్రం
- ▸▸ 2,300ఏళ్ల నాటిదేననే వాదన
- ▸▸ తప్పుపడుతున్న తమిళ పార్టీలు

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పురాతన నాగరికత ఆనవాళ్లు, చరిత్ర ఏ సంస్కృతికైనా గర్వకారణమే. అందులోనూ తమ భాషను, సంస్కృతిని విపరీతంగా ప్రేమించే తమిళుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అలా వారు వెలుగులోకి తెచ్చిన కీళడి నాగరికత, అది కొనసాగిన కాలం విషయంలో ఆ రాష్ట్రానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య ఎడతెగని వివాదం నెలకొంది. కీళడి తవ్వకాలలో లభించిన ప్రాచీన వస్తువులు, నగర శిథిలాలను బట్టి అక్కడి తమిళుల నాగరికత కాలం 2,800 సంవత్సరాలకు మునుపటిదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా.. అది 2,300 ఏళ్ల మునుపటిదేనని కేంద్రం అంటోంది. అంతే కాదు కీళడి నాగరికతకు సంబంధించి భారత పురాతత్వ శాఖ (ఏఎస్ఐ) రూపొందించిన నివేదికను పక్కన పెట్టింది. దీనిపై తమిళ రాజకీయపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఆర్ఎస్ఎస్, బీజేపీ భావజాలానికి, వారు చెప్పే సిద్ధాంతాలను తోసిరాజనేలా కీళడి నాగరికత ఉండటంతోనే వివక్షాపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నాయి. ఇప్పుడీ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

'కీళడి నాగరికత' ఏంటి?

తమిళనాడులోని మదురై ప్రాచీన నగరం. తమిళ సాహిత్యానికి, సంస్కృతికి పుట్టినిల్లు. ఆ నగరం చుట్టూ తమిళ శిలా శాసనాలు, కుడ్య శాసనాలు, తిరుప్పరంకుండ్రం, అళగన్‌కుళం శాసనాలు వంటివెన్నో లభించాయి. ఈ క్రమంలో మదురై చేరువగా తమిళ ప్రాచీన నాగరికత ఆనవాళ్లు ఉండవచ్చన్న ఆలోచనతో ఆ రాష్ట్ర పురావస్తు శాఖ 2014లో తవ్వకాలు చేపట్టింది. అక్కడి వైగై నది తీరాన ప్రాచీన కట్టడాలు, నీటి కాలువలు, చేనేత పరిశ్రమకు సంబంధించిన ఆనవాళ్లు, కుండలు, పెంకులు, ఆభరణాలు వంటివెన్నో బయటపడ్డాయి. దీనిపై తమిళనాడు ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపింది. కీళడిలో నగర నాగరికత 2,800 సంవత్సరాలకు పూర్వమే ఆవిర్భవించిందని పేర్కొంది. మరోవైపు కీళడిలో భారత పురావస్తుశాఖ (ఏఎస్ఐ)కి చెందిన అమర్‌నాథ్ రామకృష్ణన్ నేతృత్వంలోని పరిశోధకుల బృందం కూడా తవ్వకాలు జరిపి 2,800 సంవత్సరాలకు పూర్వం ఈ నాగరికత ఆవిర్భవించిందని, క్రీస్తుపూర్వం 6వ శతాబ్దంలో అంటే 2,500 సంవత్సరాలకు ముందు విస్తరించిందని పేర్కొంది. రామకృష్ణన్ బృందం 2,800 సంవత్సరాలకు



కీళడి తవ్వకాల్లో లభ్యమైన బంగారు నగలు


పూర్వమే ఈ నాగరికత ఆవిర్భవించిందని పేర్కొన్నా.. అది విస్తరించిన కాలాన్ని కేంద్రం పరిగణనలోకి తీసుకోవడం వివాదానికి దారితీసింది.

500 సంవత్సరాలకు కోత పెట్టి!

అమర్‌నాథ్ రామకృష్ణన్ నివేదిక, కీళడిలో లభ్యమైన వస్తువులను బట్టి చూస్తే తమిళుల నాగరికత కాలం 2,300 సంవత్సరాల క్రితం నాటిది మాత్రమేనని అవగతమవుతోందని కేంద్రం పేర్కొంది. ఈ నాగరికత కాలాన్ని 500సంవత్సరాలు తగ్గించాలని సూచించింది. అయితే కీళడి వద్ద తవ్వకాలు, పురాతన ఆధారాల గుర్తింపు అంతా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో చేపట్టామని, ఆ వస్తువులన్నీ ఏ కాలానికి చెందినవో పరిశోధకులు నిర్ధారించారని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి స్పష్టం చేసింది. కీళడి పురావస్తు పరిశోధనలపై ఏఎస్ఐ, రాష్ట్ర పురావస్తు శాఖ సమర్పించిన నివేదికలను అధికారికంగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేసింది. "పురావస్తు తవ్వకాల్లో లభించే పెంకులు, బంగారం, వెండి, ఇనుము వంటి వస్తువులు ఎన్నేళ్ల క్రితం నాటివో క్షణాల్లో తేల్చి చెప్పగల స్కానింగ్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి ఈ వస్తువుల కాలాన్ని తమిళనాడులోనే కాదు, ఇతర రాష్ట్రాల్లో కూడా స్కానింగ్ చేసి నిర్ధారించాం. అశోక చక్రవర్తి గురించి పుస్తకాల్లో చదువుకుంటున్నాం. చెట్లు నాటారని, ధర్మసత్రాలు కట్టారని చదువుతున్నాం. అసలు అశోకుడి పేరుతో ఓ రాజు ఉండేవాడని లోకానికి తొలుత తెలియజేసింది జేమ్స్ ప్రిట్సప్ అనే చరిత్రకారుడే. ఆ చరిత్రకారుడు కనుగొని చెప్పినదే తమిళ బ్రహ్మీ లిపి. అన్ని నాగరికతల కంటే తమిళుల నాగరికత అత్యంత ప్రాచీనమైనదని లోకానికి ఎలుగెత్తి చాటేందుకు సిద్ధమవుతున్నాం" అని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, పరిశోధకుడు బాలకృష్ణన్ చెప్పారు.

సంగ సాహిత్యమే ఆధారం!

సింధు, హరప్పా నాగరికతలకు సంబంధించి బయటపడిన పురాతన వస్తువులను పోల్చదగిన సాహిత్యం అంటూ ఏదీ లేదు. అయితే తమిళ సంగ సాహిత్యంలో వర్ణించిన నగరాలు, నివాసగృహాలు, ఆభరణాలు, పనిముట్లు వంటివి కీళడి తవ్వకాల్లో బయటపడ్డాయని తమిళనాడు ప్రభుత్వం చెబుతోంది. అమర్‌నాథ్ రామకృష్ణన్ 2విడతలుగా కీళడి వద్ద పురావస్తు తవ్వకాలను సమర్థవంతంగా నిర్వహించారని.. కానీ కేంద్రం ఆయనను మరో చోటికి బదిలీ చేసిందని గుర్తు చేస్తోంది. తర్వాత వచ్చిన ఏఎస్ఐ అధికారి.. తమిళ ప్రాచీన నగరాల నాగరికతకు సంబంధించి ఎలాంటి వస్తువులు లభ్యం కాలేదని ప్రకటించి చేతులు దులుపుకొన్నారని పేర్కొంది. దీనితో రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి పురావస్తు తవ్వకాలను కొనసాగించిందని.. తవ్వకాల్లో లభించిన పురాతన వస్తువులతో మ్యూజియం కూడా ఏర్పాటు చేశామని తెలిపింది.



తవ్వకాల్లో బయల్పడిన బావి



కీళడి తవ్వకాల్లో బయల్పడిన కట్టడ నిర్మాణం

విస్తృతంగా తవ్వకాలు జరగాలి

▸▸ అమర్‌నాథ్ రామకృష్ణన్



కీళడిలో మరింత విస్తృతంగా పరిశోధనలు జరపాలని సిఫార్సు చేశానని అమర్‌నాథ్ రామకృష్ణన్ తెలిపారు. వైగై వంటి చిన్న నది సమీపాన పెద్ద నాగరికతల ఆనవాళ్లు లభించడమేంటన్న విమర్శలు సరికాదని చెప్పారు. సింధు నాగరికత కూడా ఆ నదికే పరిమితం కాకుండా 13 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉందని.. ఇక్కడ వైగై నది నాగరికత కూడా చాలా విస్తరించి ఉండవచ్చని తెలిపారు. కీళడికి చేరువగా ఉన్న మరికొన్ని ప్రాంతాల్లో తవ్వకాలు జరిపితే ఆధారాలు బయటపడతాయని పేర్కొన్నారు.

నివేదికను ఆమోదించాల్సిందే: స్టాలిన్



సంగ సాహిత్యంలో వివరించిన జీవన విధానం కీళడి ఆవిష్కరణలతో శాస్త్రీయంగా నిర్ధారణ అయిందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. కీళడి పురావస్తు తవ్వకాలపై బ్రిటన్‌లోని లివర్‌పూల్ జాన్ మూర్స్ విశ్వవిద్యాలయం తాజాగా నిర్వహించిన పరిశోధనలు కూడా తమిళుల సంస్కృతి ప్రాచీనతను గుర్తించాయని తెలిపారు. కేంద్రం ఏ మాత్రం జాప్యం చేయకుండా కీళడి తవ్వకాల నివేదికను ఆమోదించాలని డిమాండ్ చేశారు. కీళడిలో లభించిన పుర్రెలను పరిశీలించిన జాన్‌మూర్స్ విశ్వవిద్యాలయం.. త్రీడీ సాంకేతిక పరిజ్ఞానంతో 2,500 ఏళ్లకు పూర్వం నాటి ప్రజల ముఖకవళికలను పునర్నిర్మించటం పట్ల తాము గర్వపడుతున్నామని చెప్పారు. కీళడి నాగరికత కాలాన్ని 500 సంవత్సరాలు తగ్గించాలన్న కేంద్రం సూచనపై తమిళనాడులోని రాజకీయ పార్టీలన్నీ మండిపడుతున్నాయి. డీఎంకే, అన్నాడీఎంకే, టీవీకే సహా ప్రధాన పార్టీల నేతలంతా కేంద్రం తీరును తప్పుపడుతున్నారు.

బాలలకు న్యాయం.. దీర్ఘకాల రక్షణలా ఉండాలి

- ▸▸ చట్టపరమైన చర్యలే కాదు..సామాజిక సాయమూ దక్కాలి
- ▸▸ సుప్రీంకోర్టు న్యాయమూర్తి విక్రమ్‌నాథ్
- ▸▸ బాలలు చీకటి గాయాలను మరిచేలా ఉపశమన చర్యలుండాలి: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సామ్ కోషి

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వివిధ నేరాల్లో బాధితులుగా మారిన బాలలకు న్యాయమనేది కేవలం చట్టపరమైన చర్యలతో ఆగిపోకూడదని.. సామాజిక, మానసిక సాయమూ అందించేలా ఉండాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ చెప్పారు. బాలలకు దీర్ఘకాలిక రక్షణ అందించాలని సూచించారు. బాలల హక్కులు, రక్షణ అంశంపై హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో రెండు రోజులు పాటు జరిగిన సదస్సు ముగింపు కార్యక్రమంలో జస్టిస్ విక్రమ్‌నాథ్ మాట్లాడారు. చిన్నారులపై లైంగిక వేధింపుల కేసులు చట్టపరమైన పోరాటం మాత్రమే కాదని, బాల్యంపై వారు నమ్మకాన్ని కోల్పోకుండా, సానుభూతితో దీర్ఘకాలిక రక్షణ కల్పించేలా న్యాయం ఉండాలని చెప్పారు. తెలంగాణ భరోసా మోడల్‌ను ఆయన అభినందించారు. ఇదీ వైద్య, చట్టపరమైన, మానసిక, సామాజిక సహాయాన్ని ఒకేచోట చేర్చిన ఏకీకృత ప్రగతిశీల చొరవగా అభివర్ణించారు. లైంగిక వేధింపులకు గురైన చిన్నారులకు ఆ చీకటి గాయాన్ని గుర్తు చేయకుండా మళ్లీ బాల్యంలోకి తీసుకువెళ్లడం అన్ని శాఖల మీదున్న ప్రధాన కర్తవ్యమని చెప్పారు. ఇక బాలలపై లైంగిక వేధింపుల ఘటనలకు సంబంధించి స్వాంతన చర్యలు చేపట్టే సంస్థాగత వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ న్యాయసేవల సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి సామ్‌కోషి పేర్కొన్నారు. బాధలో ఉన్న చిన్నారులకు స్నేహపూర్వక చేయూత అందించాలని.. బాధిత బాలలకు అండగా ఉండే సంస్థల మధ్య మరింత సమన్వయం అవసరమని హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్ చెప్పారు. బాలల భద్రత సామూహిక, నైతిక బాధ్యత అని.. ప్రాసిక్యూషన్ విభాగం మరింత సున్నితత్వంతో స్పందించాలని అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. పోక్సో కేసుల విచారణలు, పునరావాస విధానాలు, బాలల హక్కుల రక్షణలో వ్యవస్థాగత మార్పుల అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయని యూనిసెఫ్ ప్రతినిధి కుట్టిజార్జి చెప్పారు. తెలంగాణలోని భరోసా కేంద్రాల విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించాలన్నారు. సదస్సులో న్యాయమూర్తులు కె.లక్ష్మణ్, స్మిత్, డాక్టర్ సుధ, మహిళా భద్రతా విభాగం ఎస్పీ చేతన రులు పలు అంశాలపై మాట్లాడారు.

పల్లె బడిలో 'ఏఐ' పాఠాలు

పెద్దపల్లి జిల్లా అడవి శ్రీరాంపూర్ పాఠశాలలో పర్‌ప్లెక్సిటీ ఏఐ టూల్ వాడుతున్న విద్యార్థులు

టి-ఫైబర్‌తో గ్రామంలో ఇంటింటికీ ఇంటర్ నెట్

పెద్దపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మారుమూల అటవీ ప్రాంత ప్రజలకూ కృత్రిమమేధ అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పర్‌ప్లెక్సిటీ ఏఐ టూల్స్ ఉపయోగిస్తున్నారు!! రాష్ట్రంలో కోటి ఇళ్లకు అధిక వేగం గల ఇంటర్‌నెట్ సేవలను అందించేందుకు రాష్ట్ర సర్కారు చేపట్టిన 'టి ఫైబర్' ప్రాజెక్టు ద్వారా ఇది సాధ్యమైంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం పరిధిలోని ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్, సంగారెడ్డి జిల్లా అందోల్, నారాయణపేట మద్దూర్ గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ఈ ప్రాజెక్టు అమలవుతోంది. హైదరాబాద్‌కు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవి శ్రీరాంపూర్ గ్రామంలో దాదాపు 1200 ఇళ్లు ఉండగా, 900 ఇళ్లకు టి-ఫైబర్ సేవలను గత ఏడాది డిసెంబరు 8న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వర్చువల్‌గా ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ గ్రామంలో నిరంతరంగా ఇంటర్ నెట్ సేవలు అందుతున్నాయి. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు టి-ఫైబర్ ద్వారా ఇంటర్ నెట్ పాఠాలు బోధించేందుకు గాను మూడు డిజిటల్ బోర్డులను, రెండు మానిటర్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారానే ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. అనంతరం విద్యార్థులు డిజిటల్ బోర్డు ద్వారా గూగుల్ సెర్చ్ చేయడంతో పాటు.. అధీకృత సమాచారం కోసం పర్‌ప్లెక్సిటీ ఏఐ టూల్‌ను సైతం ఉపయోగిస్తున్నారు. వాయిస్ మోడ్ ద్వారా ప్రశ్నలు అడిగి సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. తెలంగాణ స్కూల్ యాప్‌ను ఉపయోగించుకుని.. పాఠాలకు సంబంధించిన ఇంటరాక్ట్ వీడియోలు చూస్తున్నారు.

గ్రామంలో గతంలో ఇంటర్‌నెట్ సిగ్నల్స్ తక్కువగా ఉండేవని.. టి-ఫైబర్ వచ్చిన తర్వాత హై స్పీడ్ ఇంటర్ నెట్ అందుబాటులోకి వచ్చిందని గ్రామస్థులు తెలిపారు. ఈ ప్రాజెక్టు చేపట్టాక.. చాలా మంది కేబుల్, డిష్ కనెక్షన్లను తీసివేశారు. సాఫ్ట్‌వేర్, ఇతరత్రా ఉద్యోగాలు చేసే వాళ్లు ఇంటికి వచ్చినప్పుడు టి-ఫైబర్ కనెక్షన్ ఉండడంతో ఇంటి నుంచే పని చేస్తున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవ తీసుకుని తమ గ్రామాలకు టి-ఫైబర్ ద్వారా సేవలను అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. కాగా.. ఈ ప్రాజెక్టు కింద ఆరు నెలలుగా ఇంటర్ నెట్ సేవలను ఉచితంగానే అందిస్తున్నారు. మున్ముందు నెల నెలా బిల్లు చెల్లించే విధానాన్ని అమలు చేయనున్నారు.



టి ఫైబర్ ప్రారంభోత్సవంలో వర్చువల్‌గా మంత్రితో మాట్లాడుతున్న గ్రామస్థురాలు (ఫైల్)

ఆనందంగా ఉంది: పర్‌ప్లెక్సిటీ ఏఐ సీఈవో

మారుమూల అటవీ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు.. పర్‌ప్లెక్సిటీ ఏఐని వినియోగిస్తున్న వీడియోలు చూసి ఆ సంస్థ సీఈవో, సహ వ్యవస్థాపకుడు అరవింద్ శ్రీనివాస్ ఎక్స్ ద్వారా స్పందించారు. "భారత దేశంలో స్కూల్ విద్యార్థులు పర్‌ప్లెక్సిటీ.ఏఐను ట్యూటర్‌లా వాడుతూ చదువుకోవడం ఆనందంగా ఉంది. ప్రపంచ విజ్ఞానాన్ని అందరికీ చేరేలా చేయడమే మా లక్ష్యం. అది సాకారం అవుతుండడం చూసి సంతోషంగా ఉంది." అన్నారు. దీనిపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పందించారు. "గత ఆగస్టులో అరవింద్ శ్రీనివాస్‌ను కలిశాను. రాష్ట్రంలో ఏఐ వ్యవస్థను, ఏఐ సిటీ ప్రాజెక్టును చూడమని ఆహ్వానించాను. మా ప్రభుత్వం టి-ఫైబర్ ద్వారా కోటికి పైగా ఇళ్లకు కనెక్టివిటీ ఇస్తోంది. హైదరాబాద్ సిటీకి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవి శ్రీరాంపూర్ విద్యార్థులు సిలికాన్ వ్యాలీ స్థాయి టెక్నాలజీని వాడడం గొప్ప విషయం. ఇది మా విజన్‌పై నమ్మకానికి నిదర్శనం' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఎడారుల్లో అసువులు తీస్తున్న గుల్ఫాం కల్తీ కల్లు

కల్లు లభించక దుబాయ్, యూఏఈలో మరణిస్తున్న తెలంగాణ వాసులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గుల్ఫాం కల్తీ కల్లుకు బానిసైన భర్త ఇంటికి దూరంగా ఉన్నా ఫర్వాలేదు.. ఎంతోకొంత సంపాదించి కుటుంబానికి అండగా నిలబడితే చాలనుకుంది నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం తెంబర్ని గ్రామానికి చెందిన 23 ఏళ్ల బోగేడమీది ప్రమీల. భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో తన భర్త సంతోష్‌ను జూన్ 22న దుబాయ్‌కు పంపింది. గుల్ఫాం కల్తీ కల్లుకు బానిసైన సంతోష్ దుబాయ్ చేరుకున్న కొన్ని గంటలకే విపరీతంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. గుల్ఫాం కల్లు మత్తు కోసం తపించిపోయి, అది దొరక్క.. ఆ మరుసటి రోజే తాను బస చేసిన గది నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడు. తిరిగి జూన్ 27న ఓ చోట శవంగా దొరికాడు. సంతోష్ మృతదేహం జూలై 6న హైదరాబాద్ చేరుకుంది. తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచింది అన్నట్టు అయ్యింది ప్రమీల పరిస్థితి. ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన భర్త రెండు వారాల తర్వాత విగతజీవిగా తిరిగి రావడంతో ఆమె తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఇది కేవలం ప్రమీలకు మాత్రమే పరిమితమైన బాధ కాదు. ఉత్తర తెలంగాణ జిల్లాలో ప్రమీల లాంటి చాలామంది మహిళలను వితంతవులుగా మారుస్తున్న తెలంగాణ గుల్ఫాం కల్తీ కల్లు చాలా కుటుంబాలను రోడ్డున పడేస్తోంది. ప్రాణాంతకమైన ఆల్ప్రాజోలం, క్లోరోఫాం, డైజోఫాంతోపాటు క్రిమిసంహారక మందుల్లో వాడే ముడి పదార్థాలను నీళ్లలో కలిపి తయారు చేసిన పానీయాన్ని ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో కల్లుగా విక్రయిస్తుంటారు. గుల్ఫాం కల్లుగా పిలిచే ఈ కల్లును సేవించిన వారు దానికి బానిసలు అవుతున్నారు. అది లేకపోతే ఉండలేని స్థితికి చేరుకుంటున్నారు. నిజానికి, దుబాయ్‌లో చట్టబద్ధంగా మద్యం లభిస్తుంది. కానీ, గుల్ఫాం కల్లుకు అలవాటు పడిన వారికి మరే మద్యం రుచించదు. దీంతో కల్తీ కల్లుకు బానిసలైన వారిలో చాలా మంది దుబాయ్ వచ్చిన మరుసటి రోజే కనిపించకుండా పోయి శవాలుగానో లేదా మతిస్థిమితం కోల్పోయిన వారిగానో తేలుతున్నారు.

పెరుగుతున్న కేసులు

గుల్ఫాం కల్లు వ్యసనపరుల కేసులు గల్ఫ్ దేశాల్లో క్రమంగా పెరుగుతున్నాయి. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి చెందిన అరవింద్ అనే గిరిజనుడు కల్తీ కల్లు దొరక్క దుబాయ్ వచ్చిన మూడురోజులకే పిచ్చిగా అరుస్తూ రోడ్డుపై తీవ్ర ప్రమాదానికి గురయ్యాడు. అరవింద్ కొద్ది నెలలుగా దుబాయ్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పిప్రీ గ్రామానికి చెందిన నడిపోళ్ల శ్రీనివాస్‌ది అదేకథ. శ్రీనివాస్ గాయాలతో రోడ్డుపై పడి ఉండగా గుర్తించిన దుబాయ్ పోలీసులు అతనికి చికిత్స చేయించి స్వదేశానికి పంపించారు. ఇక, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలానికి చెందిన బట్టు నాగార్జున అయితే రెండు నెలలుగా ఆచూకీ లేకుండా పోయాడు. తెలంగాణ గుల్ఫాం కల్లు కేసులు యూఏఈలో అధికమవుతున్నాయని అబుదాబీకి చెందిన సామాజిక సేవకుడు నరేందర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



దుబాయ్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అరవింద్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.